ప్రజలే ప్రభువులు

# జనబలం

డిసెంబర్ 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## 'ఉచితాలు VS అభివృద్ధి'గా వచ్చే ఎన్నికలు

## భారత్‌కు వినాశకరం.. సమతూకంతోనే జనహితం

## EWS: సుప్రీంకోర్టు తీర్పు హేతుబద్ధంగా ఉందా?



## NJAC పై ఎట్టకేలకు స్పందించిన యూనియన్

## హుజూరాబాద్, మునుగోడు ముగిసిన కథ కాదు










# 'సక్సెస్'కి నిర్వచనం మారిస్తే భారతీయ విద్యావ్యవస్థ రూపురేఖలే మారిపోతాయి



మన సమాజంలో విద్యకు ఎంతో డిమాండ్ ఉందని, కానీ విద్యలో సక్సెస్‌కి నిర్వచనం పక్కదోవ పట్టి పరీక్షల్లో ర్యాంకులు, గ్రేడ్‌లకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బానిసలై పిల్లల మీద భారం మోపుతున్నారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్యార్థులతో పాఠాలు బట్టీ పట్టించటాన్ని, మాస్ కాపీయింగ్‌ని నివారించాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే, వారు నైపుణ్యాల్ని ప్రదర్శించగలిగే, సమస్యల్ని ఎదుర్కొనే, పరిష్కరించే చదువులు ఉండాలన్నారు. ఇందుకు అవసరమైన తర్కం, విశ్లేషణ, సమస్యా పరిష్కారశక్తి, భావ వ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలు వంటి సామర్థ్యాల్ని పరీక్షించగలిగేలా ఆహ్లాదరకమైన రీతిలో పరీక్షలు ఉండాలన్నారు. పుట్టుక నుండే ప్రతి బిడ్డలో అపారమైన ప్రతిభాపాటవాలు నిద్రాణంగా ఉంటాయన్నారు. సరైన విద్యా ప్రమాణాలు లేకపోవటంతో లక్షలాది పుష్పాలు వికసించటం లేదన్నారు. విద్యాప్రమాణాలపై లోతైన అధ్యయనం కావాలని, వాటిని బాగుచేసేందుకు ఒక విప్లవంలా కృషి జరగాలన్నారు. నూజివీడులో రోటరీ క్లబ్, నూజివీడు డివిజన్ ప్రయివేటు పాఠశాలల ఆధ్వర్యంలో 'విద్యార్థుల్లో వచ్చిన మార్పులు - ఉపాధ్యాయుల పాత్ర' అంశంపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు సబ్బినేని శ్రీనివాసరావు, రోటరీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కార్యదర్శి డి.శివశేషరెడ్డి, అప్సా అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, పాఠశాల అధినేత పీవీ కుమార్ తదితరులు మాట్లాడారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 12

డిసెంబర్ 2022

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# జి-20 అధ్యక్ష స్థానంలో భారత్

జి–20 పద్దెనిమిదవ శిఖరాగ్ర సదస్సు 2023 సెప్టెంబర్ 9, 10 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్నది. అతిథేయ హోదాతో సదస్సుకు భారతదేశం అధ్యక్షత వహించనున్నది. జి–20లో 19 దేశాలు, యూరోపియన్ యూనియన్ సభ్యత్వం కలిగి ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో 66 శాతం వాటాను జి–20 దేశాలు కలిగి ఉన్నాయి. 90వ దశకంలో ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో జి–20 కూటమి ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. మెక్సికన్ పెసో సంక్షోభం, ఆసియా ఆర్థిక సంక్షోభం, రష్యాలో మొదలై అమెరికాను ప్రభావితం చేసిన ఆర్థిక సంక్షోభం రుణ సంక్షోభాలుగా పరిణమించాయి. ఆర్థిక మార్కెట్లు కుప్పకూలిన నేపథ్యంలో 1993లో జి–20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకుల గవర్నర్లు సమావేశమై సంక్షోభ నివారణా చర్యల గురించి చర్చలు ప్రారంభించారు. ఆ రకంగా ప్రారంభమైన జి–20 కూటమి మార్కెట్లలో సుస్థిరతను సాధించలేకపోయింది. 2008 నాటి అమెరికా ఆర్థిక సంక్షోభం మరోసారి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపివేసింది. దాంతో జి–20 అధినేతల స్థాయి శిఖరాగ్ర సదస్సులో జరపాలని, నిర్దిష్ట అంశాలపై కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని సభ్య దేశాలు నిర్ణయించాయి. ఆ మేరకు 2008 నుండి అధినేతల స్థాయి శిఖరాగ్ర సదస్సులు ప్రారంభమయ్యాయి. ఒక్కొక్క సంవత్సరం ఒక్కో దేశంలో శిఖరాగ్ర సదస్సులు జరిపే ఆనవాయితీని, వంతులవారీగా ఆతిథేయ దేశం అధ్యక్ష బాధ్యతలు చేపట్టే పద్ధతిని అనుసరిస్తూ వచ్చాయి.

ఇంతవరకూ జరిగిన పదిహేడు శిఖరాగ్ర సదస్సుల్లో సంపద సృష్టి, ఆర్థిక సుస్థిరత, దేశీయ ఆర్థిక వ్యవస్థలలో ఆంతరంగిక సంస్కరణలు, సుస్థిరాభివృద్ధి, ఇంధన వనరుల వినియోగం, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో, ప్రపంచ బ్యాంకులో సంస్కరణలు, జనాభా మార్పులు, ద్రవ్య మార్కెట్లలో పోటీ, వాతావరణ మార్పులు, వలసలు వంటి పలు కీలకాంశాలపై సభ్య దేశాలు చర్చించాయి.

అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు సభ్యులుగా కొనసాగుతున్న జి–20 కూటమి అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలపై అపారమైన ప్రభావాన్ని చూపగలిగే స్థాయిలో ఉన్నది. ఇరాన్ చమురు సంక్షోభాన్ని, సిరియా అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో జి–20 కూటమి కీలక భూమిక పోషించింది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో జి–20 కూటమి ప్రధాన పాత్ర పోషిస్తున్నది. 2016లో చైనాలో జరిగిన పదకొండవ శిఖరాగ్ర సదస్సు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు 15 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. 2030 అజెండా పేరుతో సభ్య దేశాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగలిగే స్థాయిలో ఉండి కూడా కీలక అంశాలపై లక్ష్య సాధనలో జి–20 సఫలం కాలేకపోతున్నది. నిర్ణయాల అమలు తప్పనిసరి కాకపోవడం, పర్యవేక్షణా యంత్రాంగం లేకపోవడం, కూటమికి శాశ్వత కార్యస్థానంగానీ, శాశ్వత యంత్రాంగంగానీ లేకపోవడం పెద్ద బలహీనతలుగా ఉన్నాయి. నార్వే, స్వీడన్, పోలండ్ వంటి దేశాలు కూటమిలో చేరడానికి ఆసక్తి చూపినా వీలు కాలేదు. ఇతర దేశాలను చేర్చుకోవడానికి కూటమి సిద్ధంగా లేదు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన పలు బహుళపక్ష కూటములలో జి–20 అత్యంత శక్తివంతమైనది. అయితే సభ్య దేశాలలో కొన్ని అగ్ర దేశాలు తమ ప్రయోజనాల కోసం ఈ వేదికను వినియోగించుకుంటున్నాయనీ, అంతర్జాతీయ వేదికలను బలహీనపరుస్తున్నాయనే విమర్శ ఉన్నది. ఏకధృవ ప్రపంచానికి కాలం చెల్లిన నేపథ్యంలో బహుళపక్ష, ప్రాంతీయ కూటముల పాత్ర నిరంతరం పెరుగుతూనే ఉంది. శాంతి, అభివృద్ధి, పర్యావరణం రంగాల్లో బహుళపక్ష సంప్రదింపుల వ్యవస్థల ప్రాముఖ్యం ఎంతైనా ఉన్నది.

జి–20 శిఖరాగ్ర సదస్సు భారత్లో జరగడం మన దేశానికి ఒక మంచి అవకాశం. సదస్సు ఏర్పాట్లకు సన్నాహకంగా ప్రధానమంత్రి డిసెంబర్ 5న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో దాదాపు నలభై రాజకీయ పార్టీల అధినేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జి–20 అధ్యక్ష స్థానం మొత్తం దేశానికి చెందుతుందని, ప్రపంచం ముందు భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడానికి, పరస్పర ఆర్థిక సహకారానికీ, పర్యాటక రంగ అభివృద్ధికీ జి–20 శిఖరాగ్ర సదస్సు తోడ్పడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఒకే భూగోళం, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' నినాదంతో సదస్సును ప్రభావితం చేసేందుకు జాతి యావత్తూ కలిసికట్టుగా కృషి చేద్దామని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం జి–20 సదస్సు అవకాశాన్ని వినియోగించుకోవాలని అఖిలపక్ష సదస్సులో పాల్గొన్న నేతలు ప్రధానమంత్రికి సూచించారు. చైనా సరిహద్దు వివాదం, అమెరికా వీసాలు వంటి అంశాలను కొందరు నేతలు ప్రస్తావించారు. అఖిలపక్ష సమావేశం జరపడం ద్వారా ప్రధానమంత్రి ఒక సానుకూల సందేశం ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆయనలోని ప్రచారకుడు మాత్రం ప్రజాస్వామ్యానికి మాతృభూమి, విశ్వగురువు వంటి ఆర్భాటపు మాటల ద్వారా పటాటోపానికి తావు ఇచ్చారు. అదే అదనుగా అధికారపక్షపు ప్రచార యంత్రాంగం దీన్నొక రాజకీయ అవకాశంగా ప్రచారం ప్రారంభించింది. గతంలోనే మన దేశం అలీన దేశాల శిఖరాగ్ర సదస్సు నిర్వహించిందని, దానికి వంద మంది దేశాధినేతలు హాజరయ్యారనీ, అలాగే కామన్వెల్తు దేశాధినేతల శిఖరాగ్ర సదస్సుకు 40 దేశాల అధినేతలు హాజరయ్యారనీ, జి–20కి చెందిన ఒక ఉన్నతాధికారి గుర్తుచేశారు.

పత్రికాస్వేచ్ఛలో 180 దేశాల జాబితాలో 150వ స్థానంలో ఉన్న భారతదేశంను ప్రజాస్వామ్యానికి మాతృభూమిగా ఎలా వర్ణిస్తారని ఒక విశ్లేషకుడు ప్రశ్నించారు. 'ఒకే భూగోళం, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు నినాదం సాకారం కావాలంటే మిశ్రమ సంస్కృతిని, వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని ఆమోదించే వాతావరణాన్ని దేశంలో నెలకొల్పాలని' అఖిలపక్ష సదస్సులో కొందరు నేతలు చేసిన సూచనను అర్థం చేసుకోవాల్సి ఉంది. రానున్న ఏడాది కాలంలో దేశంలోని వివిధ నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు దాదాపు 200 వరకూ జరపాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. జి–20 సందర్భంగా ఆ మేరకు ఒక జాతీయ ఏకాభిప్రాయం రూపొందించడం కోసం ప్రయత్నం జరుగుతుందని ఆశిద్దాం!

డి. సోమ సుందర్

# 'ఉచితాలు vs అభివృద్ధి'గా వచ్చే ఎన్నికలు భారత్‌కు వినాశకరం.. సమతూకంతోనే జనహితం

## -యూనియన్ ప్రభుత్వానికి పరిష్కార ఫార్ములా సూచించిన జేపీ-



ప్రభుత్వాలు అప్పు తెచ్చిన డబ్బును ఉచితాలు, ఇతర రోజువారీ ఖర్చులకు వినియోగించకుండా, కేవలం పెట్టుబడులు, భవిష్యత్ అవసరాలకు ఉపయోగించేలా చట్టబద్ధ ఏర్పాట్లు చేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఈ నిబంధన కేవలం రాష్ట్ర ప్రభుత్వాలకే కాకుండా యూనియన్ ప్రభుత్వానికి కూడా వర్తించాలన్నారు. ప్రభుత్వాల రెవెన్యూ లోటు సున్నా ఉండేలా చూసేందుకు ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని విస్తరించాలన్నారు. తీ?

ఇలా కాకుండా ఏది ఉచితం, ఏది సంక్షేమం అనే చర్చను లేవనెత్తితే.. అసంబద్ధ ఉచితాల కట్టడి ప్రయత్నం కాస్తా రాజకీయ వివాదంగా మారి ప్రజాప్రయోజనం లేని నిరర్థక చర్చయ్యే ప్రమాదముందని జేపీ అన్నారు. ప్రస్తుత రాజకీయాలు వాజ్‌పేయి, పీవీ నరసింహారావుల కాలం తరహాలోనివి కాదని, మోదీ చెబితే కేసీఆర్ వ్యతిరేకిస్తారని, ఇంకో నేత చెబితే మరోపార్టీ వారు ఒప్పుకోరన్నారు. మీ దృష్టిలో తాయిలం నా దృష్టిలో సంక్షేమం అయ్యే వాతావరణం నెలకొన్నందున, ఆ చర్చ జోలికి వెళ్లకుండా.. అప్పు తెచ్చిన డబ్బు రోజువారీ ఖర్చులకు వాడకూడకుండా అభివృద్ధి పెట్టుబడులకు మాత్రమే ఉపయోగించాలన్న నిబంధన విధించటం సరైన పరిష్కారమవుతుందన్నారు. ఈ ఏర్పాటు అమలు కూడా రాజకీయం కాకుండా, పక్షపాతం చూపుతున్నారనే ఆరోపణలు రాకుండా ఉండేందుకు పార్టీలకతీతంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. జాతీయ ఆర్థిక సంఘాన్ని శాశ్వతీకరించి ఆ బాధ్యత అప్పచెప్పటమో లేకుంటే ఒక స్వతంత్ర సంస్థను ఇందుకోసం ఏర్పాటు చేయటమో పరిష్కారమని సూచించారు.

తెలుగుదేశం వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు శతజయంతి సందర్భంగా 'సాధికారత-సుపరిపాలన'పై విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో జేపీ ప్రసంగించారు. యూనియన్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌ని లోతుగా అధ్యయనం చేయకపోవటం వల్ల చాలామంది తాయిలాల్ని పంచారనుకుంటారని, కానీ వాస్తవానికి ఆయన సంక్షేమానికి-అభివృద్ధికి మధ్య సమతూకం పాటించారని జేపీ తెలిపారు. తాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు దేశంలో ఎన్నడూలేని రీతిలో పత్తి రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయని, వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వటం పరిష్కారమనే డిమాండ్లు యధావిధిగా వినిపించినా ఒత్తిళ్లకు ఎన్‌టీఆర్ లొంగలేదని, చనిపోవటం పరిష్కారమనే సంకేతాన్ని పొరపాటున కూడా ఇవ్వొద్దని నిష్కర్షగా చెప్పారన్నారు. జయప్రకాష్ గారూ, నేను రైతు పక్షపాతిని. బాధిత రైతు కుటుంబాలకు ఏం కావాలో అన్నీ ప్రభుత్వం తరపున చేయండి, వారికి అన్ని రకాలుగా అండగా ఉండండి. కానీ చనిపోతే డబ్బులొస్తాయన్న ఆలోచన రానీయకుండి.. అని చెప్పారు. ప్రభుత్వం చేసే సాయం దీర్ఘకాలిక అభివృద్ధికి, ప్రజల శక్తిసామర్థ్యాల్ని పెంచి వారికి సాధికారతనందించేందుకు దోహదపడాలని రామారావు భావించేవారన్నారు.

సాధికారత, సంక్షేమం వేరు కాదు.. నిజమైన సంక్షేమం ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని అందిస్తే, కుహనా సంక్షేమం ప్రజలను బానిసలుగా, పరాధీనులుగా చేస్తుందనే అవగాహన ఎన్‌టీఆర్‌లో ఉండబట్టే తెలుగు గ్రామీణ క్రాంతి పథం అనే పథకాన్ని ప్రారంభించారని, ఆ పథకం ద్వారానే తాను ప్రకాశం జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అతి తక్కువ ఖర్చుతో అందించే ప్రణాళికను అమలు చేయగలిగానని జేపీ వివరించారు. ఎకరాకు కేవలం రూ.2-3,000 ఖర్చయిందన్నారు. ఇది స్వతంత్ర భారత చరిత్రలోనే రికార్డన్నారు. దీనివల్ల లక్ష కుటుంబాలు పేదరికం నుంచి శాశ్వతంగా బయటపడ్డాయన్నారు. రైతుల భాగస్వామ్యంతో అమలు చేయాలని పథకాన్ని ఎన్‌టీఆర్ ప్రకటించినప్పుడు, ఇదేమి పిచ్చి పథకం, ప్రజల భాగస్వామ్యం ఏమిటి అని పలువురు నిజాయతీపరులైన సీనియర్ ఐఏఎస్ అధికారులు కూడా విమర్శించారన్నారు. ఆ పథకం అమలుకు సగం డబ్బు రైతులే పెట్టుకున్నారని, వారికి బ్యాంకుల్లో రుణాలివ్వటం, ఇతర

అవరోధాల్లేకుండా చేయటమే తాను చేసిందని, ఆ డబ్బును కూడా అణాపైసలు సహా మొత్తం వారు తిరిగి చెల్లించారన్నారు. ఏడేళ్ల గడువుండగా మూడేళ్లలోనే బ్యాంకు రుణాల్ని చెల్లించారన్నారు. నిర్వహణకు ప్రభుత్వం ఎకరాకు రూ.450 వరకు ఇస్తుండగా, ఆ వ్యయం కూడా లేకుండా రైతులే సాగునీటి పథకాల్ని నిర్వహించుకోవటం మరో విశేషమన్నారు.

ప్రభుత్వ తోడ్పాటు లేకుండా ప్రజలు తమంతట తాము సంస్థల్ని స్థాపించుకుని కార్యక్రమాలను నిర్వహించుకోవటానికి, సాధికారతను అందుకోవటానికి వీలు కల్పించే సహకార రంగంలోనూ ఎన్టీఆర్ ముద్ర ఉందని జేపీ తెలిపారు. ఎన్టీఆర్, వర్గీస్ కురియన్ స్ఫూర్తితోనే 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంస్థల) చట్టాన్ని, ఆ తర్వాత సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి గ్యారంటీనిచ్చే 97వ రాజ్యాంగ సవరణనూ తేవటంలో తాను కీలక పాత్ర పోషించానని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ విశ్వవిద్యాలయాల్లో చదువుకోలేదని, కానీ చెమటోడ్చి ఎదిగిన తన జీవిత పాఠాల్ని మనసులోకి రంగరించుకున్నారని, ప్రజల పట్ల ఎంతో ఆర్ద్రత కలిగి ఉండేవారని, అందువల్లే సంక్షేమం-అభివృద్ధి-ప్రజల సాధికారత మధ్య సమతుల్యతతో జనజీవితంపై చెరగని ముద్ర వేశారన్నారు.

ఈవేళ్టి అవసరాల కోసం మన బిడ్డల భవిష్యత్తును తాకట్టుపెట్టే అధికారం మనకు లేదని.. హిందూ, ముసల్మాన్, ఈ కులం, ఆ కులం అని తేడా లేకుండా పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంత త్యాగానికైనా సిద్ధపడటం భారతీయ సంస్కృతిలో భాగమని జేపీ అన్నారు. తల్లిదండ్రులు అవసరాలను తగ్గించుకుని, కొన్ని త్యాగాలు చేయబట్టే ఎన్.టి రామారావు ఎదిగారని, మనలో చాలామందిమి కూడా అలాగే జీవితంలో చెప్పుకోదగిన స్థాయికి చేరుకోగలిగామన్నారు. అలాంటిది తాత్కాలిక తాయిలాలతో రేపటి భవిష్యత్తును తాకట్టుపెట్టే హక్కు ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజల సాధికారతకు అవసరమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఏపీలో ప్రతి పాఠశాల విద్యార్థి మీదా ఏడాదికి రూ.91,000 ఖర్చు చేస్తున్నా కనీసం పనికొచ్చే చదువు అందటం లేదన్నారు. 14-18 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లల్లో 40-50 శాతం మంది గడియారం చూసి గంట, నిమిషాలతో సమయం చెప్పలేకపోతున్నారన్నారు. కాస్త అటూ ఇటుగా దేశం మొత్తంలో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఈవేళ్టి అవసరాలకు-రేపటి ప్రయోజనాలకు మధ్య సమన్వయం ఉండేలా వనరుల వినియోగం ఉండాలన్నారు. ఉచితాల అంశాన్ని రాజకీయ వివాదాలకు ఆస్కారమివ్వకుండా పరిష్కరించాలని ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు.

వచ్చే ఎన్నికలు గనక ఉచితాలకు, అభివృద్ధికి మధ్య పోరు అయితే, భారతదేశానికి అది రాజకీయంగా వినాశకర పరిణామమవుతుందని జేపీ హెచ్చరించారు. తాయిలాలపై రాజకీయ వివాదాన్ని.. సున్నా రెవెన్యూ లోటు, అప్పు చేసి పప్పుకూడు లేకుండా రోజువారీ ఖర్చులు ప్రభుత్వ ఆదాయంతో మాత్రమే నిర్వహించటం, అప్పుల్ని కేవలం పెట్టుబడులకే



## అభివృద్ధికి అవరోధం కల్పించే ఉచితాలు సుపరిపాలన కావు

**ఆస్తులు సృష్టించటానికి, అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు చేయవచ్చు తప్ప.. పాత అప్పులకు వడ్డీలు కట్టటానికి, తాయిలాలు ఇవ్వటానికి అప్పులు చేయకూడదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అభివృద్ధికి అవరోధం కల్పించేలా ఉచితాలు ఇవ్వటం సమర్థనీయం కాదు, ఈ విధమైన చర్యలు సుపరిపాలన అనిపించుకోవన్నారు.**

ఉపయోగించటం, ఈ మొత్తం అమలు బాధ్యతను ఒక స్వతంత్ర సంస్థ పరిధిలోకి తేవటం అనే పరిష్కారం వైపు మళ్లించాలన్నారు. ఈ పరిష్కారాన్ని అమలు చేయకపోతే అసమానతలు పెరగటంతోపాటు పేదరికం, కుల వివక్ష కొనసాగుతుంటాయన్నారు. వృద్ధి రేటు 7 శాతానికి, 8 శాతానికి మధ్య తేడా జీడీపీలో పదేళ్లలో 50 లక్షల కోట్ల రూపాయలని, 10 లక్షల కోట్ల రూపాయల పన్నుల ఆదాయమని అన్నారు. తాత్కాలిక తాయిలాల కోసం వృద్ధి రేటును అడ్డుకుంటే తీవ్రంగా నష్టపోతామన్నారు. అవి ఒకదానికొకటి శత్రువు కాదని, రెంటి మధ్యా సమతూకం ఉండాలని తెలిపారు. ఎన్.టి రామారావు, రాజగోపాలాచారి, అలనాటి జాతీయోద్యమ నేతలు దాదాభాయ్ నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలే వంటి వారందరి స్ఫూర్తితో మనం ఈ పరిష్కారాన్ని సాధించాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) డీన్ మదన్ పిల్లుట్ల, యూనియన్ మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి, 'గీతం' విశ్వవిద్యాలయ చైర్మన్ ఎం.భరత్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, డాక్టర్ ఎస్.వి ఆదినారాయణ, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామ్‌లను సత్కరించారు. విశాఖ అభివృద్ధి మండలి వ్యవస్థాపకుడు ఒ.నరేష్ కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

### ఈడబ్ల్యూఎస్‌పై సుప్రీంకోర్టు తీర్పు:

# కులం బయటి సమస్యకు కులాధారిత రిజర్వేషన్లు పరిష్కారమా?

**రిజర్వేషన్లకు ప్రాతిపదిక ఏమిటి?**
**కచ్చితంగా కులమే.**
**కులమే ఎందుకు?**

మన దేశ జనాభాలో అత్యధికుల విశ్వాసంగా ఉన్న హిందూ మతంలో శతాబ్దాల కుల వివక్ష వల్లే కోట్ల మంది తమ శక్తిసామర్థ్యాలను వికసింప చేసుకోలేకపోయారు. వారి జన్యుసంపద వృథా అయిపోయింది. అలా అణగారటం వల్లే ఆయా కులాల్లో అవకాశాలు అందుకోలేనివారు, పేదలు ఇతర కులాల్లో కంటే ఎక్కువమంది ఉన్నారు. అందుకే ఆ పాపానికి కొంత పరిహారంగా, ఊరటగా, ఆ పాపాన్ని గుర్తించామన్న సంకేతంగా అణగారినవారికి ఒకమేర ఊతమిచ్చేందుకు విద్య, ఉద్యోగ రంగాలలో అదనపు అవకాశాల్ని ఇవ్వటం అవసరం. ఈ క్రమంలో రిజర్వేషన్లకు కులమే ప్రాతిపదిక కావాలి. కాబట్టే రాజ్యాంగ మౌలిక స్వరూపానికి అనుగుణంగా కోటా కల్పించారు.




అయితే మతం మార్చుకున్నట్లుగా మార్చుకోవటానికి వీల్లేకుండా జీవితాంతం కొనసాగే కులాన్ని నిర్మూలించటం మన దేశంలో కనుచూపుమేరలో సాధ్యమా? కాకుంటే రిజర్వేషన్లు ఆయా కులాలకు శాశ్వతంగా కొనసాగుతుండాల్సిందేనా?

అణగారిన వర్గాలను గుర్తించి ఎస్.సి, ఎస్.టి గొడుగు కింద వారికి రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అందించటంలో ప్రధాన పాత్ర పోషించిన బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ కూడా రిజర్వేషన్లు శాశ్వతంగా కొనసాగాలని చెప్పలేదు. పదేళ్ల కాలపరిమితినే ఆయన సూచించారు.

రిజర్వుడు కేటగిరీ కులాల్లో వివక్ష నుంచి బయటపడ్డవారిని కోటా నుంచి మినహాయించటానికి ప్రాతిపదిక ఏమిటి?

ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్లు అందుకుంటున్న కులాల్లో క్రీమీలేయర్ ప్రతిపాదన వచ్చింది. రిజర్వేషన్ల ద్వారా ఒక ఆర్థిక హోదా స్థాయికి వచ్చాక వారిని రిజర్వేషన్ల నుంచి మినహాయించాలన్న వాదన ఆమోదయోగ్యమైనది. ఇలాంటి ఆర్థిక స్థితికి ఆస్కారం కల్పించే స్థాయిని ఒక ఐఏఎస్‌గానో, డాక్టర్‌గానో, మరో హోదాతోనో, వృత్తితోనో అందుకున్నవారిని రిజర్వేషన్ల పరిధి నుంచి తప్పించాలి. వీరిని తప్పిస్తే తప్ప రిజర్వేషన్ల కేటగిరిలో ఉన్న అసలైన పేదలకు అవకాశాలు అందవు. అయితే కొంతమంది ఈ రకమైన వాదనను వ్యతిరేకిస్తున్నారు. అణగారిన కులంలో పుట్టినవారికి ఎల్లకాలం రిజర్వేషన్ కొనసాగాల్సిందేనని, ఎంత ఎదిగినా కుల వివక్షకు గురవుతూనే ఉండాల్సి వస్తుందని వారి వాదన. తమ కులాల్లోనే నిరుపేదలకు అవకాశాలు లేకుండా చేస్తున్నామన్న స్పృహ కూడా వారిలో కనిపించదు. ఆర్థికంగా, హోదా పరంగా ఒక స్థాయికి చేరినా కూడా వివక్ష పోదంటే ఇక దేని మూలంగా పోతుంది?

అలాగే ఇక్కడో విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. రిజర్వేషన్లనేవి ప్రభుత్వపరంగా ఇస్తున్నవి. కుల వివక్ష పోవటానికి ప్రభుత్వపరంగా అదనపు తోడ్పాటు ఎంతవరకు సాధ్యం అన్న కోణంలోనే వీటిని చూడాలి. ఒక స్థాయికి వచ్చినా ఏదోక మూల కులవివక్షను ఎదుర్కోవాల్సి వస్తోందంటే, విద్యా ప్రమాణాలు, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ మొదలైన మౌలిక బాధ్యతల నిర్వహణలో పాలనా వైఫల్యం మీద పోరాడాలి, సామాజిక ఉద్యమాలను నిర్మించాలి తప్ప దాన్ని రిజర్వేషన్ల చుట్టూ తిప్పకూడదు. కులాన్ని రాజకీయం ఉపయోగించుకుంటోంది గానీ, కులాన్ని రాజకీయం, ప్రభుత్వాలు సృష్టించలేదు. కాబట్టి అణగారిన కులాల్లో ఒక ఆర్థిక స్థాయి, హోదాకి వచ్చినవారిని రిజర్వేషన్ల మినహాయించటం తప్పనిసరి. జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో 103వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా అమల్లోకి తెచ్చిన ఆర్థికంగా బలహీనవర్గాల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లకు 3-2తో నవంబర్ 7న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమోదముద్ర వేయటాన్ని ఈ మొత్తం నేపథ్యంలో చూడాలి.

రిజర్వేషన్ల ద్వారా ఆర్థిక స్థాయిని కల్పించటం ఎదిగే

అవకాశాల్లో పుట్టుకతో వివక్షకు కీలక పరిష్కారమైనప్పుడు, ఆర్థికంగా వెనుకబడినవారికి ప్రభుత్వపరంగా అదనపు తోడ్పాటు అవసరమనే వాదనను కూడా మౌలికంగా అంగీకరించాల్సిందే.

ఈడబ్ల్యూఎస్ తీర్పునిచ్చిన ధర్మాసనంలోని జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ జె.బి పార్దీవాలా, జస్టిస్ రవీంద్ర భట్‌తో పాటు ధర్మాసనానికి నేతృత్వం వహించిన సుప్రీంకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు లలిత్ కూడా ఈ రకమైన తోడ్పాటుకి ఆర్థిక కొలమానం ఆమోదయోగ్యమనే పేర్కొన్నారు. ఇందుకు రిజర్వేషన్ మార్గాన్ని సమర్థించారు. ఎస్.సి, ఎస్.టి, ఓబీసీలకు కాకుండా 103వ రాజ్యాంగ సవరణ ద్వారా పేర్కొన్న 'ఇతరులకు' మాత్రమే కోటాను వర్తింప చేయటం వద్దే జస్టిస్ లలిత్, జస్టిస్ భట్ తీర్పులో విభేదించారు. ఇది అణగారిన కులాలకు అన్యాయం చేయటం, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించటం అని వారు అభిప్రాయపడ్డారు.

అయితే అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా బలహీనులకు ఎస్.సి, ఎస్.టి, ఓబీసీల తరహా రిజర్వేషన్లను అమలు చేయటం పరిష్కారమా? అన్నది తీర్పు తర్వాత కూడా అడగాల్సిన ప్రశ్న.

కాదు.

అగ్రవర్ణాలు ఎదిగే అవకాశాలకు ఆర్థిక బలహీనత అవరోధం కాకుండా.. ఒకప్పుడు అణగారిన కులాలకు ఇచ్చిన రిజర్వేషన్లనే అమలు చేస్తామనటం ఏ రకంగానూ సబబు కాదు. రెండూ ఆర్థికాంశంతో ముడిపడి ఉన్నా, రెంటినీ సమానంగా చూడలేము. కుల వివక్షకు సంబంధించి విద్య, ఉద్యోగ రంగాలలో కల్పించే వెసులుబాట్లు 'పరిహారం'లో భాగం కాగా.. అటువంటి పరిహారం కోణం ఈడబ్ల్యూఎస్‌లో ఉండదు. ఎస్.సి, ఎస్.టి, ఓబీసీలది (ఇందులోని కులాల గుర్తింపు ప్రక్రియలో కొన్ని లోపాలున్నప్పటికీ) ప్రధానంగా కుల వివక్ష నుంచి వచ్చిన సమస్య. అగ్రవర్ణాలది పాలనా వైఫల్యం వల్ల తలెత్తిన సమస్య. స్వతంత్రం వచ్చి ఇన్ని దశాబ్దాలయినా, మంచి ప్రమాణాలున్న విద్యను ప్రజలకు ప్రభుత్వం అందించకపోవటం వంటి కారణాల వల్ల అగ్రవర్ణాల్లో కూడా అనేకమంది అవకాశాలను అందుకోలేకపోతున్నారు. చేతిలో డిగ్రీలు ఉన్నా ఉపాధి పొందలేకపోతున్నారు, ఆదాయాలు పెంచుకోలేకపోతున్నారు. కాబట్టి ఒక ప్రత్యేక పరిస్థితి కారణంగా వెనుకబాటుతనానికి గురవుతున్న ఆయా కులాలకు పరిహారంలో భాగంగా కల్పించిన రిజర్వేషన్లు.. ఆ ప్రత్యేక పరిస్థితి లేకున్నా అవకాశాలు అందుకోలేని వారికి కూడా పరిష్కారం కాబోవు. రెంటి పరిష్కారాల్ని ఒకే గాటన కట్టటం తప్పుడు సంకేతాన్నివ్వటమవుతుంది. అందునా, సామాజిక వెనుకబాటుతనంతో రిజర్వేషన్ల పరిధిలో ఉన్న కులాలు కూడా కోటా బయటి పరిష్కారాల్ని అందుకునేలా చేయటంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన సమయంలో!

మెజారిటీ తీర్పుతో విభేదించిన ఇద్దరు గౌరవనీయ న్యాయమూర్తులు అభిప్రాయం పరిగణలోకి తీసుకుని ఈడబ్ల్యూఎస్‌లో ఎస్.సి, ఎస్.టి, ఓబీసీలను కలిపినా కూడా అది సరైన పరిష్కారమనిపించుకోదు. కాకపోతే, ఈ కోటాలో వారికి స్థానం లేకపోవటం వల్ల అది మరింత ప్రతికూల సంకేతాన్నిస్తోంది. ఇప్పటిదాకా రిజర్వేషన్లు పొందుతున్నవారి వల్ల అగ్రవర్ణాలు భారీగా నష్టపోయారని, ఆ నష్టాన్ని పూడ్చటానికే ఈడబ్ల్యూఎస్ పేరుతో ప్రత్యేక కోటాను రూపొందించారనే అభిప్రాయం కలుగుతుంది. ఈ జీరోసమ్ రాజకీయం కులాన్ని మరింత ఘనీభవింప చేస్తుంది.

రిజర్వేషన్లు శాశ్వత పరిష్కారమని అణగారిన కులాలను నమ్మిస్తూ, దానివల్ల తమకు అన్యాయం జరిగిందని అగ్రవర్ణాల్లో విద్వేషాన్ని రగులుస్తూ, మళ్లీ ఈడబ్ల్యూఎస్ ద్వారా అగ్రవర్ణాలకు ఏదో చేస్తున్నట్లు కన్పిస్తూ.. మొత్తంగా ఎవరికీ ఏమీ చేయకుండా మన రాజకీయ వ్యవస్థ పార్టీలకతీతంగా గొప్ప చతురతను ప్రదర్శిస్తూ వస్తోంది. అంబేద్కర్ ఆశించినట్లు, మన విద్యా రంగాన్ని ప్రక్షాళన చేసి ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందించే ఏర్పాటు చేసి ఉంటే, అణగారిన కులాల్లో కూడా రిజర్వేషన్లను 1960ల నాటికే తొలగించే అవకాశముండేది. కొత్తగా రిజర్వేషన్ల డిమాండ్లు తలెత్తే అవకాశమే ఉండేది కాదు. కానీ ఇప్పటికీ ప్రభుత్వాలు విద్య, నైపుణ్యాలు, వైద్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ వంటి రంగాల్లో తాము చేయాల్సిన పనిచేయకుండా రిజర్వేషన్లే సర్వరోగనివారిణి అన్నట్లు ప్రజలను మభ్యపెడుతున్నాయి, సుపరిపాలనలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటున్నాయి. కులం సమసిపోవటానికి ప్రభుత్వాలు, రాజకీయం తమ వంతు బాధ్యతను చేయకుండా వీలైనంత మేర విభజనలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటుండటం వల్ల రిజర్వేషన్ల చుట్టూ కొత్త సమస్యలు ముసురుకుంటున్నాయి.

కేవలం ఈడబ్ల్యూఎస్ రాజ్యాంగ సవరణచట్టం-2019కి సాంకేతికంగా పరిమితమవటం వల్ల సుప్రీంకోర్టు ఈ ప్రస్తావనలు లేకుండా సమస్యను వాయిదా వేసినట్లు కనిపిస్తుంది. కుల వివక్ష పరిధిలోని సమస్యను, కుల వివక్ష బయటి సమస్యను ఒకే రీతిలో చూడటం ద్వారా రిజర్వేషన్ల తరహా పరిష్కారానికి రిజర్వేషన్ల పరిధిలోనే గౌరవ న్యాయమూర్తులు పరిష్కారం చూపారు (సామాజికంగా వెనుకబడిన కులాల రిజర్వేషన్లకు వర్తింప చేసే కొన్ని నిబంధనలు ఈడబ్ల్యూఎస్ కోటాలో ప్రామాణికంగా లేకున్నా ప్రశ్నించకుండా). సదరు పేదరికానికి, కులం మూలంగా వెనుకబాటుతనానికి మధ్య తేడాను గుర్తించే ప్రయత్నం చేయకుండా తీర్పు జారీ చేశారు. సమస్యపై కులం కోణంలో కాకుండా పౌర కోణంలో అత్యున్నత న్యాయస్థానం దిశానిర్దేశం చేసి ఉంటే, ముస్లిం, క్రైస్తవ వంటి

హిందూయేతర మతాల్లోని పేదల పరిష్కారానికి కూడా దోహదం చేసే అవకాశం ఉండేది. పరిష్కారం కులాధారిత ఈడబ్ల్యూఎస్ చుట్టూనే తిరగటం వల్ల అటు సామాజిక వెనకబాటుతనం, ఇటు పేదరికం రెండు ప్రాతిపదికల్లోనూ కోటాల పెంపుపై కొత్త వివాదాలు తలెత్తి చివరికి ప్రతిభ, తద్వారా రాజ్యాంగ ప్రజాస్వామ్య మౌలిక స్ఫూర్తి, దేశ ప్రయోజనాలు మూల్యం చెల్లిస్తాయి. అగ్రవర్ణ పేదల కోటాను విస్తరిస్తూ పోతే దాన్ని సాకుగా చూపి సామాజిక వెనుకబాటు రిజర్వేషన్ల పరిధిలోని క్రీమీలేయర్ కూడా మరిన్ని అవకాశాల కోసం అర్రులు జాస్తూ నిజమైన పేదలను ఇంకా అణగదొక్కే ప్రమాదముంది. ఇప్పటికే రిజర్వేషన్ల కులాలవారు ఏదో భారీ లాభం పొందుతున్నారని అగ్ర కులాల్లో .. ఈడబ్ల్యూఎస్‌తో మనకు మళ్లీ పెద్ద అన్యాయం జరిగిపోతోందని సామాజిక వెనుకబాటుతన రిజర్వేషన్లు పొందుతున్న కులాల్లో పరస్పర శత్రుత్వ వాతావరణం నెలకొంది. ఇప్పుడది మరింత పెరుగుతుంది.

అయితే రిజర్వేషన్లను శాశ్వతంగా కొనసాగించకూడదని, సమీక్షించాలని ధర్మాసనం సూచించటం సానుకూల పరిణామం. ఈ సూచనను పరిగణలోకి తీసుకుంటూ, ఎస్.సి, ఎస్.టి, ఓబీసీలకు ప్రస్తుతమున్న రిజర్వేషన్లను కొనసాగిస్తూనే హేతుబద్ధీకరించటం, ఓసీల్లోని ఈడబ్ల్యూఎస్‌కు ప్రత్యామ్నాయ మార్గాల్లో తోడ్పాటు అందించటం కోసం శాసన, రాజకీయ వ్యవస్థలు చర్యలు తీసుకోవాలి. మీడియాలో, సమాజంలో ఇందుకోసం చర్చ జరగాలి. ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎస్.సి, ఎస్.టి, ఇతర వెనుకబడిన వర్గాలకూ వాటా ఉండాలని వాదిస్తున్నవారు.. ఏడు దశాబ్దాలైనా మా పేదరికాన్ని తొలగించలేని రిజర్వేషన్లనే అగ్రవర్ణాల్లోని పేదలకూ ఎందుకు పరిష్కారంగా చూపుతున్నారు? ప్రభుత్వోద్యోగాలు తగ్గుతూ ప్రయివేటు రంగం పెరిగిపోతున్న తరుణంలో ఇది మరీ మోసపూరితం కాదా? అనే కీలక ప్రశ్నల్ని లేవనెత్తలేకపోతున్నారు.

అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కింద ప్రభుత్వం తరపున అందించే తోడ్పాటు రిజర్వేషన్ల పరిధికి ఆవల ఉండాలి. ఇలాంటి ఏర్పాటు లేకుంటే ఎన్నేళ్లు గడిచినా రిజర్వేషన్లు ఫలితాలు లేకుండా కొనసాగటం, ఒకరి పట్ల ఒకరికి ద్వేషం పెరగటం, కుల వ్యవస్థ మరింత ఘనీభవించటం, రాజకీయ నాయకులు లాభపడటం మాత్రమే జరుగుతుంటుంది.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచించిన పరిష్కారాల్ని పరిగణలోకి తీసుకోవటం అవసరం..


1) ఐఏఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీసులు తదితర స్థాయి ప్రభుత్వరంగ ఉద్యోగుల్ని.. ప్రస్తుత లేదా మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర సీనియర్ రాజకీయ నేతలు, మంచి ఆదాయం వచ్చే వైద్యులు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు, ప్రైవేటు రంగంలో ఒక స్థాయి పైబడిన మేనేజర్లు, కొంత ఆదాయం దాటిన వ్యాపారవేత్తలు మొదలైనవారిని రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించాలి (డిస్ రిజర్వ్ చేయాలి). అంటే, తమ సొంత కులాల్లో అవకాశాలు అందని నిజమైన ఆర్తుల పిల్లలకు అవకాశాలు అందించేందుకు పైస్థాయిలోని వారు రిజర్వేషన్ల నుంచి వైదొలగాలి. దీనివల్ల, అణగారిన కులాల్లోని పేదలకు ఎదిగేందుకు నిజమైన అవకాశం లభిస్తుంది.

2) ఓసీ కులాల్లోని పేద పిల్లలు తమ లోటును అధిగమించగలిగేలా మార్కుల్లో సహేతుకంగా కొన్ని అదనపు మార్కుల్ని (5 నుంచి 10శాతం) కలిపే ఏర్పాటు చేయాలి. ఈ వెయిటేజీ మార్కుల్ని నిపుణుల బృందం నిర్ణయిస్తుంది. అధికారులిచ్చే ఆదాయ సర్టిఫికెట్ల మీద ఆధారపడితే ఏ ప్రయోజనమూ ఉండదు. కోట్లకి పడగలెత్తే కుటుంబాలకి కూడా తెల్లరేషన్ కార్డులు, కాలేజీలలో ఫీజు మినహాయింపులు అమలవుతున్న సమాజంలో దొంగ సర్టిఫికెట్లు సృష్టించటం చాలా తేలిక. కాబట్టి అర్హులైన కుటుంబాలను గుర్తించటానికి పరిశీలనకు అవకాశమున్న, విశ్వసనీయమైన, న్యాయమైన ధృవీకరణ ఏర్పాటు చేసుకోవాలి. తల్లిదండ్రుల చదువుని, పిల్లలు చదివే స్కూలుని ఇందుకు ప్రాతిపదికలుగా తీసుకోవచ్చు. ఇతర ప్రాతిపదికల్ని కూడా స్థూల ఏకాభిప్రాయంతో రూపొందించుకోవచ్చు. ఒక్కసారి ఓసీల్లోని పేద పిల్లలు అదనపు మార్కుల్ని (5 నుంచి 10శాతం) పొందితే, వారు తమ కులాల్లోని సంపన్నుల బిడ్డలతో సమానస్థాయిలో పోటీపడగలుగుతారు.

అలాగే, ప్రతిభ ఉండి, ఉన్నత విద్య చదవాలనుకున్న ఏ బిడ్డకూ పేదరికం, పుట్టిన కులం అవరోధం కాకూడదు. స్కాలర్ షిప్పులు, ఉచిత ట్యూషన్, తేలికైన రుణాలు, ఇతర ఏర్పాట్లు అన్నిటినీ సమగ్రమైనరీతిలో పటిష్ఠపరచాలి.

3) పాఠశాల విద్యలో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఒక విప్లవంలా కృషి జరగాలి. ఇక్కడ రిజర్వేషన్ల గొడవ కూడా లేదు. పాఠశాల విద్యను సమూలంగా మెరుగుపరిచేందుకు జాతీయ నూతన విద్యా విధానంలో ఉన్న ఏర్పాట్లని ఉపయోగించుకోవాలి. కేవలం ప్రభుత్వం మీద ఆధారపడకుండా సమాజం కూడా తోడ్పాటునివ్వాలి. పుట్టుకతో, పేదరికంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన స్కూలు చదువు గ్యారంటీగా అందేలా చేయాలి. పాఠశాల విద్యాప్రమాణాలపై ప్రోగ్రాం ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్ (పీసా) 74 దేశాల మధ్య నిర్వహించిన సర్వేలో భారత్ 73వ స్థానంలో ఉండటం, విద్యారంగ స్థితిగతుల వార్షిక నివేదిక (అసర్) వరస ఫలితాలు మన పాఠశాల విద్య అధ్వాన్నస్థితికి నిలువెత్తు నిదర్శనాలు. రిజర్వేషన్లు తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే.. నాణ్యమైన విద్య, సంపద సృష్టికి పనికొచ్చే నైపుణ్యాలు మాత్రమే ఎదిగేందుకు మనకు శాశ్వత మార్గాలు.

# ఈడబ్ల్యూఎస్ కోటా - కొన్ని సాంకేతికాంశాలు




అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించే 103వ రాజ్యాంగ సవరణ (124వ రాజ్యాంగ సవరణ బిల్లు)ను 2019లో పార్లమెంటు ఆమోదించింది. జనవరి 7న రూపొందించి, జనవరి 9న పార్లమెంటు రెండు సభలతోనూ ఇంత కీలక బిల్లును ఆమోదింప చేయటం న్యాయమా? అని అప్పట్లో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించివారి గొంతు అప్పటి సాధారణ ఎన్నికల హోరులో కలిసిపోయింది.

అయితే ఈడబ్ల్యూఎస్‌ను మోదీ తన ఖాతాలో వేసుకున్నా, ఇందుకు ప్రయత్నం మూడు దశాబ్దాల క్రితం పి.వి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడే మొదలైంది. సుప్రీంకోర్టు జోక్యంతో అది విఫలమయ్యాక కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆ ప్రయత్నం చేయకపోయినా.. దాన్ని వదిలిపెట్టేయలేదు. 'ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్ కల్పిస్తామని' ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది.

**ఇంతవరకూ రిజర్వేషన్లు వర్తించనివారిలో ఆర్థికంగా బలహీనులకు**

'ఇంతవరకూ రిజర్వేషన్లు వర్తించనివారిలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం కల్పించటమే తమ ఉద్దేశమని' 2019లో లోక్‌సభలో బిల్లును ప్రవేశపెడుతూ ప్రభుత్వం పేర్కొంది.

'ప్రస్తుతం ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలు ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వోద్యోగాలు పొందడంలో ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నవారితో పోటీ పడలేకపోతున్నారు. వాటికి వారు దూరమవుతున్నారు. దీని దృష్ట్యా రాజ్యాంగంలోని 15వ అధికరణను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ప్రజల్లో ఆర్థికంగా వెనుకబడిన ఏ వర్గానికైనా ప్రయోజనాలు కల్పించడానికి రాష్ట్రాలకు ప్రత్యేక అనుమతి లభించేందుకు వీలుగా ఒక నిబంధనను చేర్చాలనేది ప్రతిపాదన. అన్ని విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఈ నిబంధనలు వీలు కల్పిస్తాయి. ప్రస్తుత రిజర్వేషన్లకు ఇవి అదనం. ప్రతీ విభాగంలో ఉన్న మొత్తం సీట్లలో గరిష్ఠంగా 10 శాతానికి మించకుండా ఈ రిజర్వేషన్‌ను వర్తింప చేస్తాం" అని బిల్లులో చెప్పారు.

'రాజ్యాంగంలోని 46వ అధికరణలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాల ప్రకారం బలహీన వర్గాల ప్రజల, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టిల విద్య, ఆర్థిక ప్రయోజనాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపరచాల్సి ఉంది. సామాజిక అన్యాయాలు, అన్ని రూపాల్లోని దోపిడీ నుంచి వారిని పరిరక్షించాలి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ప్రస్తుత రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడానికి అర్హులు కారు. 46వ అధికరణను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి, ఆర్థికంగా బలహీనంగా ఉన్న పౌరులు విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత అవకాశాలు పొందడానికి భారత రాజ్యాంగాన్ని సవరించాలని నిర్ణయించాం' అని బిల్లు లక్ష్యాల్లో ప్రభుత్వం పేర్కొంది.

**కొత్తగా క్లాజుల జోడింపు**

తదనుగుణంగా ఆర్టికల్ 15, 16కు క్లాజులు చేర్చారు.

రాజ్యాంగం 15వ అధికరణంలో ఇప్పటికే ఉన్న 5 నిబంధనలకు తోడు మరో నిబంధనను చేర్చారు. ఈ ఆరో నిబంధన ఏమిటంటే.. "(ఎ) ఈ అధికరణంలోని 4, 5 క్లాజులలో ప్రస్తావించిన వర్గాలు కాకుండా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల అభ్యున్నతికి ఏ ప్రత్యేక చర్య అయినా ప్రభుత్వం తీసుకోవచ్చు. (బి) ఆర్థిక బలహీన వర్గాలకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో (ఎయిడెడ్ లేదా అన్‌ఎయిడెడ్) ప్రవేశం విషయంలో మొత్తం సీట్లలో పది శాతం రిజర్వేషన్ ఇప్పుడున్న దానికి అదనంగా కల్పించాలి". అదే విధంగా ఆర్టికల్ 16 కింద కూడా అదనంగా ఒక నిబంధన (క్లాజ్-6) చేర్చారు. దీని ప్రకారం- "వివిధ నియామకాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల వారికి మొత్తం పోస్టుల్లో పది శాతం కేటాయించాలి. ఇవి ప్రస్తుత రిజర్వేషన్లకు అదనం. ఇదే అధికరణం కింద- నాలుగో నిబంధనల్లో పేర్కొన్న వర్గాలు కాకుండా అదనంగా ఈ ఈడబ్ల్యూసీ (ఈడబ్ల్యూఎస్/ఈబీసీ) వర్గాలకు కేటాయించాలి". అధికరణ 15 (5) ప్రకారం, రిజర్వేషన్లను చట్టరీత్యా (బై లా) కల్పించాలి. అయితే జోడించిన క్లాజులో 'చట్టరీత్యా' అనే పదాన్ని తొలగించారు. ఆర్టికల్ 16 (4).. ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలవారికి రిజర్వేషన్లు కల్పించాలని చెబుతోంది. ఆర్టికల్ 16కు కొత్తగా కలిపిన 5వ క్లాజు (16 (5))లో 'ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలు' అనే మాటలను తొలగించారు.

'2005లో రాజ్యాంగానికి 93వ సవరణ చేస్తూ ఆర్టికల్ 15లో 4, 5 నిబంధనలను, ఆర్టికల్ 16లో 4వ నిబంధనను చేర్చారు. ఎస్.సిలు, ఎస్.టిలు, నిమ్నవర్గాల వారు విద్యాపరంగా, సామాజికంగా అభ్యున్నతి సాధించేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల వారిని ఆనాడు

# రిజర్వేషన్లపై రాజ్యాంగం ఏం చెప్పింది?

**అంటరానితనం కారణంగా అనాదిగా నిరాదరణకు, వివక్షకు గురవుతున్న ఎస్.సి, ఎస్.టి, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది. వ్యక్తులు, కుటుంబాలకు లబ్ధి గురించి రాజ్యాంగం ప్రస్తావించలేదు.**

పట్టించుకోలేదు. అందువల్ల, ఆర్టికల్ 46వ అధికరణంలో పేర్కొన్న ఆదేశిక సూత్రాల స్ఫూర్తిని కాపాడేందుకు ఈ కోటా అవసరం' అని ప్రభుత్వం బిల్లులో పేర్కొంది.

**5.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి**

విద్యా, ఉద్యోగ సంస్థల్లో ఈడబ్ల్యూఎస్/ఈబీసీల (ఆర్థికంగా బలహీన వర్గాల)కు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రం తీసుకొచ్చిన చట్టం వల్ల దేశవ్యాప్తంగా 5.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని 'బిజినెస్ స్టాండర్డ్' సర్వే అంచనా వేసింది (ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లనేపథ్యంలో 2005లో యూపీఏ ప్రభుత్వం రిటైర్డ్ మేజర్ జనరల్ ఎస్.ఆర్ సిన్హా నేతృత్వంలో ఒక కమిషన్‌ని ఏర్పాటు చేసింది. 2010లో ఆ కమిషన్ నివేదిక సమర్పించింది. జనరల్ కేటగిరీలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల వార్షిక ఆదాయం పన్ను పరిమితికి లోపే ఉంటే వారిని ఆర్థికంగా వెనుకబడినవారిగా గుర్తించాలని సిన్హా కమిషన్ సిఫార్సు చేసింది. దేశ జనాభాలో 31.7 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని నిర్ధారిస్తోంది. వీరిలో ఎస్.సి జనాభా 7.74 కోట్లు, ఎస్.టి జనాభా 4.25 కోట్లు కాగా, ఓబీసీ జనాభా 13.86 కోట్లు. మొత్తంగా 25.85 కోట్లు. దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న జనాభాలో వీరు 81.5 శాతంగా ఉన్నారు).

బిజినెస్ స్టాండర్డ్ సర్వే ప్రకారం అర్హుల్లో 93.5 లక్షల బ్రాహ్మణ కుటుంబాలుండగా (దేశం మొత్తమ్మీద 1.25 కోట్ల బ్రాహ్మణ కుటుంబాలున్నాయి) .. 4.21 కోట్ల కుటుంబాలు ఇతర వర్ణాలకు చెందినవిగా వెల్లడైంది. పదిశాతం కోటా వల్ల పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఎక్కువ లబ్ధి పొందుతాయని, దేశవ్యాప్తంగా మొత్తం కుటుంబాల్లో 42 శాతం ఈ మూడు రాష్ట్రాల్లోనే ఉన్నాయని సర్వే తెలిపింది. మేరీల్యాండ్ యూనివర్సిటీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చ్‌లు చేపట్టిన 'ఇండియన్

# ఎవరికి రిజర్వేషన్లు ఇచ్చారు - పరిణామక్రమం

అణగారిన వర్గాలుగా భారత ప్రభుత్వం గుర్తించి, నిర్దేశించిన షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి), ఇతర వెనుకబడిన తరగతు (ఓబీసీ)లవారికి రిజర్వేషన్లు కల్పించారు. కొన్ని రాష్ట్రాల్లో ముస్లింలకూ బీసీ (ఎం/ఈ) కింద రిజర్వేషన్లు ఇచ్చారు. భారత రాజ్యాంగం, చట్టాలు, స్థానిక నియమ నిబంధనలు ప్రాతిపదికగా ఇవి అమల్లోకి వచ్చాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం చూస్తే, బ్రిటీష్ ఇండియాలో కూడా కొన్ని కులాలు, వర్గాలకు కోటా విధానం ఉండేది. కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహూ మహరాజ్ బ్రాహ్మణేతరులు, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. 1902లో ఇది అమల్లోకి వచ్చింది. 1932లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రిజర్వేషన్లకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. బ్రిటీష్ ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రతిపాదించారు. దీని ప్రకారం ముస్లింలు, సిక్కులు, భారత క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు, యూరోపియన్లు, అణగారిన వర్గాల వారికి ప్రత్యేక కోటా ప్రాతినిధ్యం కల్పించారు. దీన్ని గాంధీజీ వ్యతిరేకించగా.. అంబేద్కర్ సమర్థించారు.

దేశ స్వాతంత్ర్యానంతరం ఎస్.సి, ఎస్.టి, బి.సిల రిజర్వేషన్లకు సంబంధించి కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎస్.సి, ఎస్.టిలజనాభా ప్రాతిపదికన.. విద్యాసంస్థల్లో 20 శాతం సీట్లను ప్రత్యేకించాలని విద్యామంత్రిత్వ శాఖ 1950లో ప్రతిపాదించింది. ఆ తర్వాత ప్రభుత్వ రంగం, ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలతోపాటు, ఉద్యోగాల్లో ఎస్.సిలకు 15 శాతం, ఎస్.టిలకు 7.5 శాతాల్ని జనాభా ప్రాతిపదికన రిజర్వు చేశారు.

ఆ తర్వాత మండల్ కమిషన్ వచ్చింది.

దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల స్థితిగతుల్ని అధ్యయనం చేసి, సిఫార్సులు చేయడం కోసం 1979 జనవరి 1వ తేదీన అప్పటి మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని జనతా పార్టీ ప్రభుత్వం బి.పి మండల్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఓబీసీల జన సంఖ్య ఎంత అన్న గణాంకాలు అప్పటికి కమిషన్ వద్ద లేవు. దాంతో అది 1931 నాటి జనాభా లెక్కల్ని వినియోగించుకుని వారి జనాభా 52 శాతంగా నిర్ధారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని సేవలు, సంస్థల ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో ఇదే రిజర్వేషన్ల అమలుకూ మార్పులు చేయాలని సూచించింది. దీనివల్ల కేంద్రంలో ఎస్.సి, ఎస్.టి, బి.సిల మొత్తం రిజర్వేషన్లు 49.5 శాతానికి చేరుకున్నాయి. మండల్ సిఫార్సుల్ని అమలు చేస్తామని 1990ల సమయంలో వి.పి సింగ్ ప్రభుత్వం ప్రకటించటంతో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమాలు చెలరేగాయి. అప్పటికి సుప్రీంకోర్టు తాత్కాలికంగా స్టే ఇచ్చినా.. ఆ తర్వాత రిజర్వేషన్ల అమలు మొదలైంది.

హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' (ఐహెచ్‌డిఎస్) గణాంకాల ప్రకారం 2016-17 ఆదాయ రికార్డుల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఈ కోటా వల్ల లబ్ధి పొందే కుటుంబాల్లో 17.2 శాతం పశ్చిమ బెంగాల్‌లో, 13.3 శాతం ఉత్తర ప్రదేశ్‌లో, 12 శాతం మహారాష్ట్రలో, 5.8 శాతం ఆంధ్రప్రదేశ్‌లో, 5.4 శాతం గుజరాత్‌లో, 5 శాతం బీహార్‌లో, 4.8 శాతం మధ్యప్రదేశ్‌లో ఉన్నాయి. మిగతా రాష్ట్రాలన్నీ కలిపి 36.5 శాతం ఉన్నాయి. ఈ కుటుంబాల్లో మూడింట రెండొంతులు గ్రామాల్లోనే నివసిస్తున్నాయని సర్వే తెలిపింది.

## 59.5 శాతానికి చేరిన రిజర్వేషన్లు

ఉన్న రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఈబీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ పది శాతంతో కలుపుకుని మొత్తం రిజర్వేషన్లు దాదాపు 59.5 శాతానికి చేరాయి. పలు రాష్ట్రాలు ఈ శాతాన్ని పోటాపోటీగా పెంచుతున్నాయి. ఇది రిజర్వేషన్ల మౌలిక స్వభావానికి కూడా ప్రశ్నల్ని సంధిస్తోంది. వృత్తిపరంగా, వ్యవసాయం నుంచి వార్షికాదాయం ఎనిమిది లక్షలకన్నా తక్కువ కలవారు (ఇది బీసీ క్రీమీ లేయర్‌తో సమానం), అయిదెకరాల వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగులకన్నా తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు కలవారు, నోటిఫైడ్ మునిసిపల్ ప్రాంతాల్లో వంద గజాలు, నాన్‌నోటిఫైడ్‌లో రెండొందల గజాల కన్నా తక్కువ స్థలంలో ఇళ్లు ఉన్నవారు తాజా రిజర్వేషన్ పొందటానికి అర్హులన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కూడా పలు విమర్శలకు తావిస్తోంది. పేదరిక ప్రమాణానికి దాదాపు పదహారు రెట్లు ఎక్కువ ఆదాయమున్నవారిని ఈ రిజర్వేషన్ పరిధిలో చేర్చటం, భూములకు ఒక్కో చోట ఒక్కో రేటు ఉండటం వంటి వాటిని ఎత్తిచూపుతూ తీవ్ర విమర్శలు కొనసాగుతున్నాయి. అలాగే రిజర్వేషన్ల పరిధిలోకి దాదాపు జనాభాలోని అందరూ వచ్చేస్తారు అనే అంచనాల పట్ల కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



# వైద్య సేవలతో చెలగాటమాడొద్దు

**రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యుల నియామకాలకు టెండర్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందనే వార్తలు విని వైద్యులు, చదువుకునే యువత నవ్వుకుంటున్నారని, అటువంటి ప్రతిపాదన ఉంటే ప్రభుత్వం దయచేసి విరమించుకోవాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతోనే ఆ పని చేసినా, మంచి ఫలితాలు రావని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఈ తరహాలో ఉద్యోగం పొందినవారు క్రమశిక్షణతో పనిచెయ్యరు సరికదా, వ్యవస్థను పక్కదోవ పట్టిస్తారన్నారు. ఇలాంటి విధానాల వల్ల వైద్యుల పట్ల ఇప్పటికే సమాజంలో పెరుగుతున్న వ్యతిరేకత మరింత ఎక్కువవుతుందని, దీనివల్ల అంతిమంగా ప్రజలే నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగంలో ఎంతోమంది నిపుణులు ఉన్నారని, ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే ముందు వారితో చర్చిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని అనుసరించి ఎంతమంది రోగులను చూస్తే అంత ఆదాయం, రోగులకు నచ్చిన ఫ్యామిలీ డాక్టర్‌ని ఎంచుకునే అవకాశం వంటి పద్ధతుల్ని అమలు చేయాలని, జయప్రకాష్ నారాయణ్ సేవల్ని వినియోగించుకోవాలని బాబ్జీ సూచించారు. సమావేశంలో మహిళాసత్తా రాష్ట్ర ప్రతినిధి ఐ.అనంతలక్ష్మి, విశాఖపట్నం సిటీ మహిళాసత్తా నేతలు రాజేశ్వరి, రూప తదితరులు పాల్గొన్నారు.**

# సత్వర న్యాయం: NJDG, జడ్జీల సంఖ్య, ప్రొసీజరల్ లా

- పి వి గోపాలకృష్ణ

NJDG నేషనల్ జుడిషియల్ డేటా గ్రిడ్ - దేశంలోని అన్ని కోర్టులలోని కేసుల దైనందిన సమగ్ర సంఖ్యా సమాచారాన్ని సుప్రీంకోర్ట్ ఈ-కమిటీ, నేషనల్ జుడిషియల్ డేటా గ్రిడ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతోంది. ఈ కీలక సమాచార సేకరణ, నిర్వహణ ద్వారా అపరిష్కృత కేసుల సంఖ్య తగ్గించి తద్వారా సత్వర న్యాయం అందించాలన్నది సుప్రీంకోర్ట్ పరమధ్యేయం. జిల్లా, తాలూకా, హైకోర్ట్‌లలో దాఖలైన కేసుల వివిధ దశల సమాచారం సేకరించి ఏరోజుకారోజు డేటా గ్రిడ్‌లో భద్రపరుస్తూ సత్వర న్యాయం అందించడానికి ఈ సమాచారం వినియోగించాలన్నది లక్ష్యం.

**జనాభా - జడ్జీ స్థానాల నిష్పత్తి**

డేటా గ్రిడ్‌లోని సమాచారం ప్రకారం సుప్రీంకోర్ట్‌లో ఈ సంవత్సరం ఈ (అక్టోబర్ 1 నాటికి 69,461 కేసులు), నవంబర్ 1 నాటికి 69,781, ఈరోజు - (అక్టోబర్ 17 వరకు 25 హైకోర్టులలో సివిల్, క్రిమినల్ కలిపి కేసులు 59 లక్షల 52 వేల 5 వందల 5 కేసులు)- నవంబర్ 16 వరకు 25 హైకోర్టులలో సివిల్, క్రిమినల్ కలిపి కేసులు 59 లక్షల 59 వేల 9 వందల 55 కేసులు, దేశం మొత్తం మీద ఉన్న 18,735 జిల్లా కోర్టులు, వాటి పరిధిలోని తక్కువ స్థాయి కోర్టులలో రోజువారీగా దాఖలు అవుతున్నవి, ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా ఉన్నవి సివిల్, క్రిమినల్ కలిపి (అక్టోబర్ 17 వరకు 4 కోట్ల 24 లక్షల 51 వేల 2 వందల 6 కేసులు), నవంబర్ 16 వరకు 4 కోట్ల 26 లక్షల 21 వేల 6 వందల 35 కేసులు పేరుకుపోయి ఉన్నాయి. గత ఏప్రిల్ 30న జస్టిస్ ఎన్.వి రమణ పదవీ విరమణ చేసిన నాటికి పత్రికల సమాచారం ప్రకారం, సుప్రీంకోర్ట్‌లో 34కి 29 జడ్జీల పోస్టులు, 25 హైకోర్టులలోనూ కలిపి 1,104కి గాను 716 జడ్జీల పోస్టులు భర్తీ అయి ఉన్నాయి. జిల్లా స్థాయి, అంతకన్న కింది స్థాయి కోర్టులలో 24,225 పోస్టులు కల్పించినట్టు గత ఆగస్టు 5న పత్రికా సమాచారం ప్రకారం కేంద్ర న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజ్జు ప్రకటించినా, ఎన్ని పోస్టులు భర్తీ అయి ఉన్నాయన్న సమాచారం లేదు. ప్రస్తుత గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల ప్రమాణాలననుసరించి పది లక్షల జనాభాకి 50 మంది జడ్జీలు ఉండాలన్న అంచనాకి మన దేశంలోని పది లక్షల జనాభాకి 21.03 మంది అన్న జడ్జీల నిష్పత్తి చాలా తక్కువ. ఒక అంచనా ప్రకారం 2016 నాటికి రోజువారీగా పెరుగుతున్న కేసుల సంఖ్య, ఆనాటికి అపరిష్కృతంగా ఉన్న కేసులన్నిటినీ పరిష్కరించడానికి లా కమిషన్ 120వ రిపోర్ట్, పది లక్షల జనాభాకి 50 మంది అన్న నిష్పత్తి ప్రకారం నియమించవలసిన జడ్జీల సంఖ్య 60,476. కానీ మన దేశ ఆర్థిక, ఇతర స్థితిగతులను బట్టి అది అందని మ్రానిపండు. ఆనాటికి దేశంలో కిందిస్థాయి జడ్జీల సంఖ్య 16,119. ఆరేళ్ళ తరవాత ఆ సంఖ్య 24,225కి పెరిగినా, ఆనాటికీ అపరిష్కృతంగా ఉన్న కేసులు,




సివిల్, క్రిమినల్ కలిపి 2 కోట్ల 65 లక్షలుగా ఉన్నది. ఈనాడు (17 అక్టోబర్ 2022) అది 4 కోట్ల 24 లక్షల 51 వేల 2 వందల 6కి పెరిగిన దృష్ట్యా తదనుగుణంగా పెరగవలసిన జడ్జీల సంఖ్య కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది. అంటే పెరిగిన కేసుల శాతం తదనుగుణంగా పెరగవలసిన జడ్జీల సంఖ్య కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది. అంటే పెరిగిన కేసుల శాతం సుమారుగా 54.64 అయితే పెరిగిన జడ్జీల శాతం 16 (20,811 నుంచి 24,112కి పెరిగింది). అది కూడా పోస్ట్‌ల కల్పన అయితే జరిగింది కానీ ఎంతమంది నియామకం నిజంగా జరిగిందన్న సమాచారం లేదు. మరో లెక్క ప్రకారం దేశంలోని అపరిష్కృతంగా ఉన్న అన్ని కేసులనీ పరిష్కరించడానికి అవసరమైన జడ్జీలు 24,839 అన్న సంఖ్య కూడా చాలా ఎక్కువే. కావలసిన జడ్జీల సంఖ్య, నిజంగా నియమించబడినవారి సంఖ్య మధ్య అంతరం ఎప్పుడూ ఉంటూనే ఉంది. దీనికితోడు


కిందిస్థాయి నుంచి సర్వోన్నత స్థాయి వరకు క్రమక్రమంగా ఉద్యోగ విరమణ వల్ల తరుగుతుండే సంఖ్యని లెక్కలోకి తీసుకోవాల్సి ఉంది. జస్టిస్ రమణ విరమణ తరువాత సుప్రీంకోర్ట్‌లో 34గా ఉండవలసిన సంఖ్య 29 నుంచి 28కి తగ్గింది. నవంబర్ 8 నాటికి జస్టిస్ లలిత్ విరమణ తరవాత 27కి తగ్గింది. కిందిస్థాయిలో ఆ సంఖ్య మరీ ఆందోళనకరంగానే ఉంటుంది. ముఖ్యంగా సకాలంలో ఆ తరుగుదల భర్తీ చేయకపోతే. రోజువారీ కేసుల సంఖ్య పెరిగిపోతూ ఉంటే. అందువల్ల సత్వర న్యాయం జడ్జీల నియామకాల ద్వారా సాధించగలమనుకోడం ఒక భ్రమ.

**జడ్జీల నియామకాలు ఓటికుండని నింపడంలాటిది**

జడ్జీల నియామకాలన్నది ఓటి కుండని నింపడంలాటిది. ఒకపక్క నింపే ప్రయత్నాలు జరుగుతూ ఉన్నా అది కావలసినంత స్థాయిలో ఉండదు. మరోపక్క పదవీ విరమణ వల్ల ఖాళీ అయిపోతూ ఉంటుంది. పరిస్థితిని అధ్వాన్నం చేస్తూ నిత్యధారగా కేసులు దాఖలైపోతూ ఉంటాయి. ఇక సత్వర న్యాయం అన్నది కలేనా?

**డాష్‌బోర్డులో అపరిష్కృత కేసుల సంఖ్య**

అక్టోబర్ 11 నాటికి, సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా క్రింది కోర్టులలో దాఖలైన సివిల్ కేసుల సంఖ్య 3 లక్షల 47 వేల 3 వందల 75. అక్టోబర్ 28 నాటికి అది 3 లక్షల 52 వేల 6 వందల 67. అక్టోబర్ 11 నాటికి సెప్టెంబర్ నెలలో పరిష్కరించబడినవి 3 లక్షల 52 వేల 2 వందల 62. అక్టోబర్ 28 నాటికి అది 3 లక్షల 55 వేల 3 వందల 12. అక్టోబర్ 11 నాటికి, సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా హైకోర్టులలో దాఖలైన సివిల్ కేసుల సంఖ్య 1 లక్ష 09 వేల 5 వందల 83. అక్టోబర్ 28 నాటికి అది 1 లక్ష 20 వేల 7 వందల 51. ఒక్క సెప్టెంబర్ నెల దాఖలైన కేసులు, పరిష్కరించబడిన కేసుల సంఖ్య అక్టోబర్ 11న ఒకలాగ, 28న మరొకలాగ ఉండడానికి కారణం తెలీదు. సెప్టెంబర్ నెలలో అనికాక సెప్టెంబర్ నెల వరకు అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. మరొక విధంగా ఈ సంఖ్యలని గమనిస్తే, ఒక నెలలో దాఖలైన కేసుల సంఖ్య, పరిష్కరించబడిన కేసుల సంఖ్య దాదాపుగా సమానంగా ఉన్నాయి. మహిళలు, వృద్ధుల కేసుల మీద ప్రత్యేక దృష్టి ఉంటుంది. అందువల్ల సంవత్సరం తిరిగేసరికి కేసులు పేరుకుపోతూ ఉంటాయి. పరిష్కరించవలసిన కేసుల సంఖ్య కొత్తగా దాఖలయ్యే కేసుల వల్లనే కాక ఇతర కారణాల వల్ల కూడా వాటి సంఖ్య పెరుగుతూ పోతూ ఉంటుంది. కేసులు వినే ప్రక్రియ కూడా ఒక కారణమే. డేటా గ్రిడ్‌లోని సమాచారం ప్రకారం ఈనాటికి (17/10/2022) ఎదుటివారికి నోటీసులు అందినవి, అందిన తరువాత హాజరు కావలసిన దశలో ఉన్న సివిల్ కేసుల సంఖ్య 26,30,233. కంప్లయన్స్, స్టెప్స్, స్టే అన్న దశలో (లేక) ఆ కారణాల వల్ల 18,83,386 సివిల్ కేసులు అపరిష్కృతంగా పెండింగ్‌లో పడి ఉన్నాయి. వీటిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా ఉండవచ్చు. కంప్లయన్స్ అంటే కోర్టు ఆదేశాల్ని నిర్వర్తించడం. అది ఎదుటివారికి నోటీస్‌లివ్వడంకానీ, కౌంటర్లు, రిటన్ స్టేట్‌మెంట్లు దాఖలు చేయడంగానీ, మరే యితర ఆదేశాలైనా కావచ్చును. కానీ ఆ 18 లక్షల కేసుల్లో చాలాకాలంగా అంటే నెలల తరబడి ఇంకా చెప్పాలంటే సంవత్సరాల తరబడి ఈ దశలోనే ఉన్న కేసులు ఎన్ని అన్న సమాచారం గ్రిడ్ ఇవ్వడం లేదు. అంటే, కేవలం జాప్యం చేయడమే ధ్యేయంగా, దానినుంచి లాభపడదామనుకునేవారు ఎంతకాలంగా కోర్టు ఆదేశాలను లక్ష్యపెట్టక, పాటించకుండా ఉన్నారు అన్న సమాచారం లేదు. కోర్టులలో ఈ ప్రాథమిక దశలోనే పేరుకుపోయి ఉన్న కేసుల సంఖ్య, సివిల్, క్రిమినల్ కలిపి 2 కోట్ల 11 లక్షల 84 వేల 024. ఈనాటికి మొత్తం కేసుల సంఖ్య 4 కోట్ల 24 లక్షల 51 వేల 206లో ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నవి సగానికి సగం. వీటిలో కేవలం జాప్యం చెయ్యడమే ధ్యేయంగా అడ్జర్న్‌మెంట్ల మీద అడ్జర్న్‌మెంట్లు తీసుకుంటూ ఏళ్ళ తరబడి పెండింగ్ కేసుల సంఖ్యని భయానకంగా పెంచుతూ ఉన్న కేసుల సంఖ్య కచ్చితంగా ఎంతో తెలీదు. డేటాగ్రిడ్‌లోని real time సమాచారం చాలా నిశితంగా సేకరిస్తున్నదే. కానీ ఇంకా వివిధ రకాల కేసులను విశ్లేషించి వాటి దశననుసరించి సంఖ్యని ఈ డాష్‌బోర్డులో ప్రకటించవలసి ఉంది.




**మార్పు రావాలి – ఆశయంలో – ఆలోచనలో – ఆచరణలో**

మౌలికమైన మార్పులు ఆశయంలోను, ఆలోచనలోను, ఆచరణలోను రావాలి. ప్రొసీజరల్ లా సవరణల ద్వారా సత్వర న్యాయానికి మార్గం అన్వేషించాలి. కంప్లయన్స్, స్టెప్స్, స్టే దశలోనే పెండింగ్‌లో ఉన్న 18,83,386 సివిల్ కేసులలో రిటన్ స్టేట్‌మెంట్లు, కౌంటర్లు ఫైల్ చెయ్యవలసిన వాటి సంఖ్య కూడా డేటా గ్రిడ్ ద్వారా తెలీదు. కానీ వాటి సంఖ్య కూడా తక్కువగా ఉండకపోవచ్చును. సివిల్ సూట్‌లలో ప్రతివాది దాఖలు చేయవలసిన రిటన్ స్టేట్‌మెంట్ దాఖలు చేయడానికి కచ్చితమైన గడువు 120 (30+90) రోజులు చట్టంలోనే (CPC) Order

VIII Rule 1 లోనే ఉన్నా ఆచరణలో అంత కచ్చితత్వం ఉండదు. చట్టంలోనే ఉన్న ఈ గడువు సూచనాత్మకమే directoryయే కాని ఆచరణాత్మకం కాదు అంటే mandatory కాదు – తప్పనిసరి కాదు అన్నది సుప్రీంకోర్ట్ చాలా కేసులలో చేసిన విశ్లేషణ. ఈ వైరుధ్యాన్ని కమర్షియల్ కోర్ట్స్ చట్టంలో సరిచేసి 120 రోజుల గడువు ఆచరణాత్మకంగా మారినప్పుడు అదే ఆచరణాత్మకత మిగిలిన అన్ని సివిల్ కేసులకూ వర్తింపచేయడం సత్వర న్యాయం దృష్ట్యా చాలా అవసరం. ప్రభుత్వానికి కోర్ట్ ఫీ ద్వారా అధిక ఆదాయం తెచ్చే కమర్షియల్ కేసులకో న్యాయం, సాధారణ సివిల్ కేసులకో న్యాయం అన్యాయం. ఇక ప్రతివాది ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్‌లలో దాఖలు చేయవలసిన కౌంటర్ల విషయంలో చట్టబద్ధమైన గడువు ఏదీ లేదు. ప్రాథమిక దశలోనే కేసులు నానుతూ ఉండడానికి ఇది మరో కారణం. ప్రతివాది దాఖలు చేయవలసిన కౌంటర్ కోసం వాయిదాల మీద వాయిదాలు పడుతూ ఏళ్లూ పూళ్ళూ గడిచిపోతున్న కేసుల సంఖ్య ఎంతో కూడా డేటా గ్రిడ్ ద్వారా తెలీదు. కోర్ట్ కేసులలో తగులుకుని జీవితాలు దుర్భరంగా మారిన సామాన్యుడికి సత్వర న్యాయం అందించడం కోసం Order VIII (ఆర్డర్ ఎనిమిది) Rule 10 (రూల్ పది)ని మరింత ఆచరణాత్మకం – mandatory చేస్తే సత్వర న్యాయం దిశగా మౌలికమైన మార్పు సాధించగలం. 120 రోజుల గడువు ముగిసిన వెంటనే లేదా కోర్టు నిర్ణయించిన తేదీ దాటిన మర్నాడే ఇక ప్రతివాది రిటన్ స్టేట్‌మెంట్ లేదా కౌంటర్‌లతోను, మరియే యితర న్యాయప్రక్రియల ప్రమేయం లేకుండా, ఆటోమేటిక్‌గా వాది కోరిన రిలీఫ్ మంజూరయిపోయే విధంగా నిబంధనలని చట్టబద్ధం చేయడం సమంజసం. The court shall grant the relief sought అని ప్రొసీజర్స్‌లో చట్టసవరణ జరిగితే సత్వర న్యాయం దానంతటదే గాడిలో పడుతుంది. ఈ కారణంతో – 120 రోజుల mandatory period లోపల ప్రతివాది తన వాదనను వ్రాతపూర్వకంగా దాఖలు చేయలేదన్న కారణంతో – వస్తే హైకోర్ట్‌లో CRPలు అడ్మిట్ కూడా కాని విధంగా కఠినమైన నిబంధనలు చట్టబద్ధం చెయ్యడం కూడా సత్వర న్యాయానికి మార్గం.

### Reserved for Orders - Pending for Government Sanction

కఠినమైన నిబంధనలతో గడువులు చట్టబద్ధం చెయ్యడం అన్న విషయం పరిధిలోకి, కోర్టులలో తీర్పుల కోసం పెండింగ్‌లో ఉన్న కేసులు (reserved for orders), ప్రభుత్వాధికారుల విచారణకి అవసరమైన శాఖాపరమైన అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా రావాలి. డేటా గ్రిడ్‌లో reserved for orders, sanction of Government permission అన్న కారణాలకి పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య కూడా కచ్చితంగా తెలీదు. ఎడాపెడా CRPలు వాటి ద్వారా సంపాదించుకున్న స్టేలు కింది కోర్టులలో కేసులు ఏళ్ళ తరబడి ప్రాథమిక స్థాయిని కూడా దాటకుండా ఉండడానికి ఎంతవరకు కారణమో డేటా గ్రిడ్ ద్వారా తెలుసుకునే అవకాశం లేదు. ప్రస్తుతం ఒకసారి హైకోర్ట్‌లో CRPలో, సుప్రీంకోర్ట్‌లో SLP admit అయితే ఆ ప్రక్రియ పూర్తవడానికి ఎంత కనిష్ట సమయం పడుతుందో ఎవరూ చెప్పలేరు. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సహా. సర్వోన్నత న్యాయస్థానంలో అక్టోబర్ 1 నాటికి అపరిష్కృతంగా ఉన్న కేసుల సంఖ్య 69,461. సుప్రీంకోర్ట్ కేసుల సమాచారం NJDG Dashboardలో కనిపించదు. సుప్రీంకోర్ట్ official website – main.sci.gov.inలో Homeలో Statisticsఅన్న విభాగంలో నెలవారీగా సంక్షిప్తీకరించిన సమాచారం కనిపిస్తుంది. దానికి లింక్ https://main.sci.gov.in/statistics.ఈరోజుకి (20/10/2022) పదేళ్ళుగా పరిష్కారం కాని సివిల్ కేసుల సంఖ్య 16 లక్షల 63 వేల 855. ఇరవైయేళ్ళుగా పరిష్కారం కాని కేసులు కూడా ఉన్నాయి. అవి 140 అని ఒక పత్రిక సమాచారం. ఈ విషయం డాష్‌బోర్డులో అలభ్యం.

### Special Courts- ప్రత్యేక కోర్టులు

ప్రజాప్రతినిధులపైన దాఖలైన వివిధ కేసులు ముఖ్యంగా క్రిమినల్ కేసులు, ఎలక్షన్ పిటిషన్లు ప్రత్యేక కోర్టుల ద్వారా సత్వరం ముగించాలని సాక్షాత్తూ సర్వోన్నత న్యాయస్థానమే సంకల్పించినా ఆచరణలో అది ఎంతవరకు సఫలమౌతుందో చూస్తూనే ఉన్నాం. ఏ దశలో ఏ రకమైన కేసులు ఎంతకాలంగా పేరుకుపోయున్నాయన్న సమాచారం జనబాహుళ్యానికి తెలియకపోయినా ప్రధాన న్యాయమూర్తికి అందుబాటులో ఉండాలి. డేటా గ్రిడ్‌లో వివిధ రకాల కేసులు – మనీ సూట్స్, భూ వివాదాలు – ఇత్యాదులకి సంబంధించి ఏవేవి ఎంతెంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్న సమాచారం ప్రత్యేకంగా చూపించలేదు. డేటా గ్రిడ్‌తో 26 రాష్ట్రాల భూ రికార్డులు లింకై ఉన్నాయని చెప్పుకుంటున్నా, దేశంలోని వివిధ కోర్టులలో వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న భూవివాద కేసుల సమాచారం సామాన్యుడికి అందుబాటులో లేదు. రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌వారిచ్చే ఎన్కంబ్రన్స్ సర్టిఫికెట్ వంటి పెండింగ్ లిటిగేషన్/ నో పెండింగ్ లిటిగేషన్ సర్టిఫికెట్ భూ లావాదేవీలు చేసేవారికి అందే ఏర్పాటు చేయమని సుప్రీంకోర్ట్ ఈ-కమిటీకి విన్నవించుకున్నా ఆ శంఖనాదం చెవినవేసుకున్న నాధుడే లేదు. ఈ విధమైన సమాచారం అందుబాటులో ఉంటే చెల్లుబడికాని భూ క్రయ ఒప్పందాలు, సేల్ డీడ్లు, రిజిస్ట్రేషన్లు, అనవసరపు ఖర్చులు, వాటి వల్ల ఉత్పన్నమయ్యే కోర్టు కేసులు కూడా అరికట్టబడతాయి.

**నూతన చట్టాలు - రాజ్యాంగ సవరణలు**

రాజ్యాంగం ఇచ్చిన అధికారాలతో సత్వర న్యాయం సాధ్యపడకపోతే ప్రధాన న్యాయమూర్తి పదవిని అర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన అధికారాన్నిచ్చే తగిన చట్టాలని లేదా రాజ్యాంగ సవరణలని చేసి సామాన్యుడికి సత్వర న్యాయం అందించవలసిన బాధ్యత శాసనవ్యవస్థదే. ప్రొసీజరల్ లా సత్వర న్యాయానికి ప్రతిబంధకంగా మారకుండా ఏ విధమైన నూతన

విధానాలు అనుసరిస్తారా అని కొత్త ప్రధాన న్యాయమూర్తి పదవీ స్వీకారం చేసిన ప్రతిసారీ సామాన్యుడు ఎదురుచూస్తూ ఉంటాడు. ఉన్నత న్యాయస్థాన అధికార పరిధిలో సత్వర న్యాయం సాకారం కాకపోతే తగిన చట్టరూపకల్పన ద్వారా లేదా చట్టసవరణల ద్వారా దాన్ని చట్టబద్ధంగా సామాన్యుడికి అందేలా చేయవలసిన బాధ్యత శాసనసభదే. వెధవలు వెధవల కోసం చేసుకునేవి వెధవ చట్టాలే. బుద్ధివంతమైన చట్టాలు బుద్ధిమంతుల కోసం చెయ్యడానికి చట్టసభలలో బుద్ధిమంతులే ఉండాలి. Bad intentions translated into actions are crimes. Good intentions not translated into actions are also crimes. ప్రజాస్వామ్యంలో Class IV నుంచి President of India దాకా అన్ని ఉద్యోగాలు ప్రజోపయోగార్థమే. వాటి మధ్య ఎక్కువ తక్కువ, ఉన్నతం నీచం లాంటి తారతమ్యాలు లేవు. ప్రభుత్వంలో ఎన్ని ఏళ్ళు ఏ పదవులు, ఉద్యోగాలు – ఉన్నతమో, సర్వోన్నతమో – నిర్వహించినా ప్రజాప్రయోజనాలు సిద్ధించనప్పుడు ప్రజాప్రయోజనం కోసం అవసరమైన శాసననిర్మాణకర్తలుగా మారాల్సిందే. వెధవలు తమకి విరుద్ధమైన శాసనాల రూపకల్పనకి పూనుకోరు సరికదా అటువంటి చట్టాలు, GOలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని ఉన్నత న్యాయస్థానాలు, సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించినా, కోర్ట్ ఆదేశాలని ధిక్కరిస్తూ వాటి అమలుని ఆపరు. కోర్ట్ ఆదేశాలని అమలు చేసే బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థది. కోర్ట్ ధిక్కారణ ఆదేశాలని సైతం ధిక్కరించి "సారీ చెప్పిద్దాం" అన్న ఆలోచనా ధోరణే ప్రబలితే అది అరాచకత్వానికి పరాకాష్ఠ.

ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ తన అధికార పరిధిలోని రోస్టర్, లిస్టింగ్‌లను సంస్కరించి రాబోయే తన రెండేళ్ళ పదవీకాలంలో వీలైనంత ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించాలన్న దృఢసంకల్పంతో ఉన్నారు. పదవీ స్వీకారం చేసిన మొదటివారంలోనే ఆ దిశగా క్రిమినల్, ట్యాక్స్, లాండ్ అక్విసిషన్, మోటార్ యాక్సిడెంట్స్ కేసుల కోసం స్పెషల్ బెంచ్‌లను ఏర్పాటు చెయ్యాలని సంకల్పించారు. రోజువారీగా ఫైల్ అవుతున్న కేసులు ఆటోమేటిక్‌గా సోమ, శుక్రవారాల్లో లిస్ట్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బెయిల్, ట్రాన్స్‌ఫర్ కేసుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాబోయే శీతాకాలం సెలవల లోపల 3000 కేసులు పరిష్కరించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. సుప్రీంకోర్ట్ పరిధిలోకి వచ్చిన దైనందిన కేసుల సత్వర పరిష్కారానికి ఈ చర్యలు సత్ఫలితాలనిస్తాయని ఆశిద్దాం. కానీ సుప్రీంకోర్ట్‌లోనే ఇంకా ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు, దేశవ్యాప్తంగా హైకోర్ట్‌లు, క్రిందిస్థాయి కోర్ట్‌లలో రోజువారీగా ఫైల్ అవుతున్న కేసులు, వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న కేసుల 'సత్వర' పరిష్కారానికి తీసుకోబోయే చర్యలు ఎటువంటి సత్ఫలితాలనిస్తాయో వేచిచూడాలి.

**ప్రత్యామ్నాయ విధానాలు**

దేశ ఆర్థిక మూలాలు బలంగా ఉండడానికి సత్వర న్యాయప్రక్రియ లేమి ప్రతిబంధకం కాకుండా ఉండాలనిIAMC - International Arbitration and Mediation Centreలు, ICADR - International Council for Alternate Dispute Resolution వంటి వ్యవస్థల రూపకల్పనకి– Institutional mediation and arbitration అంటే వివాదాల పరిష్కారానికి వ్యవస్థీకృత ప్రత్యామ్నాయ మార్గాలను దేశ ప్రధాన న్యాయమూర్తే స్వయంగా రంగంలోకి దిగి రూపుదిద్దాలనుకోవడం ముదావహం. కానీ ఆ ప్రత్యామ్నాయ విధానం కేవలం వ్యాపార రంగాభివృద్ధికి పరిమితం చేయడం దారుణం. సామాన్యుడికి కూడా సత్వర న్యాయం అందించడం కోసం ప్రత్యామ్నాయ విధానాలకి తగిన రూపకల్పన చేయాలని ఉన్నత న్యాయస్థానాలలో ఉన్నవారు ఆలోచించలేకపోవడం దురదృష్టం. కొన్ని రకాల కేసులు, ముఖ్యంగా కుటుంబ ఆస్తి బాంధవ్య సంబంధ వివాదాలు కోర్ట్ పరిధి నుంచి తప్పించి ప్రత్యామ్నాయ మార్గంగా మధ్యవర్తిత్వం ద్వారా మాత్రమే ఏకాభిప్రాయ సాధన, వివాద పరిష్కార సాధనల కోసం చట్టాల రూపకల్పన అవసరం. ఆ ప్రక్రియలో న్యాయ వాదుల పాత్ర మరింత క్రియాశీలంగా ఉండే విధంగా చట్ట సవ రణ కూడా అవసరం. మధ్యవర్తిత్వ ప్రక్రియ ఆశించిన ఫలి తా న్ని ఇవ్వలేదు అన్నది ఆచరణలో చూపించిన తరవాతే కోర్టులలో సూట్ నెంబర్ అయ్యే విధంగా ప్రొసీజరల్ మార్పులు అవసరం.

**న్యాయస్థానాలు న్యాయార్థుల కోసమే**

కొండొకచో ఈ మౌలిక మార్పులను ఒప్పుకోలేక bar తనకు తెలిసిన ABC మంత్రం (Advocate Boycott Courts) పఠిస్తే దానికి ఉన్న ఒకే విరుగుడు మంత్రం, మనం జవాబు చెప్పుకోవలసిన ఒకే ప్రశ్న న్యాయస్థానాలు న్యాయవాదుల కోసమా న్యాయార్థుల కోసమా? సత్వర న్యాయం గగనకుసుమం అవడంలో bar & bench పాత్ర గణనీయమైనదే.

న్యాయమూర్తుల నియామకాలలో అధికశాతం న్యాయవాదులే అయిఉండడం వలన కేసులు వాయిదాల విషయంలో వారి – న్యాయమూర్తుల – ఆలోచనాధోరణిలో విప్లవాత్మకమైన మార్పులు ఉండే అవకాశం లేదు. స్థాలీపులాకంగా, అక్టోబర్ 1 నాటికి అలహాబాద్ హైకోర్ట్‌లో approved judge strength160కి గాను నియమించబడిన నూరుమంది న్యాయమూర్తులలో 72 మంది, తెలుగు రాష్ట్రాలలో, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌లో approved judge strengthగా 37 మందికి గాను నియమించబడిన 30 మంది న్యాయమూర్తులలో 20 మంది, తెలంగాణ హైకోర్ట్‌లో approved judge strength 42 మందికిగాను నియమించబడిన 34 మంది న్యాయమూర్తులలో 21 మంది న్యాయవాదవృత్తి నుంచి నియమించబడినవారే.

**సత్వర న్యాయ స్వరూపం**

న్యాయస్థానాలలో న్యాయమూర్తుల పదవుల ఖాళీలను భర్తీచేయడం ద్వారా, న్యాయమూర్తుల సంఖ్య తరగకుండా చూసుకుంటే చాలు సత్వర న్యాయం దానంతటదే

అందుతుందనుకుంటే, అది కేవలం భ్రమ. సత్వరం అంటే ఏది సత్వరం? ఇప్పుడున్న పరిస్థితుల్లో న్యాయప్రక్రియ సంపూర్ణంగా పూర్తవడానికి పట్టే సమయం, అంటే, ట్రయల్ కోర్ట్ నుంచి సుప్రీంకోర్ట్‌లో అపీళ్ళ ఆఖరి ఘట్టం పూర్తయిన ఇక ఎక్కవలసిన కోర్టు మెట్లేమీ లేవు అనుకోడానికి పట్టే సమయం తక్కువలో తక్కువగా పదేళ్ళు. నెత్తి మీద శని తాండవం చేస్తున్న న్యాయార్థి విషయంలో అది పదిహేనేళ్ళయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అటువంటి సదవకాశం కూడా అందరికీ దక్కదు. కారణం దానికయ్యే ఖర్చు కూడా తక్కువేం కాదు. ఆ శక్తిమంతులు కొందరే. ఎంతకాలం పడితే అంతకాలం కోర్టులో పోరాడడానికి అవసరమైన డబ్బు సమకూర్చుకునే సత్తా అందరికీ లేదు. కొంతమందికి మొదటిది ఉన్నా, అంటే జీవించి ఉన్నంతకాలం, జీవితాంతం కోర్టులో పోరాడి న్యాయం సాధించాలన్న కోరిక బలంగా ఉన్నా ధనబలం అవసరమైనంత లేకపోడంతో వారి న్యాయపోరాటం అర్ధంతరంగా ముగిసిపోతుంది. చాలామందికి ఈ రెండూ లేక అసలైన న్యాయస్వరూపాన్ని దర్శించే యోగం లేక జీవితమే కడగట్టిపోతుంది.

అయినా కోర్టులలో కేసుల సంఖ్య పెరుగుతూనే ఉందిగానీ తగ్గడం లేదు. దానికి కారణం కోర్టుల మీద జనానికున్న అపార నమ్మకం కాదు. మరో దారిలేక. చచ్చేలోపు న్యాయం సంపాదించుకోవాలనే తాపత్రయం. సంపాదించుకోలేమా అన్న ఆశ. ప్రత్యామ్నాయం లేకపోవడం. ఇక ఇటువంటి పరిస్థితుల్లో సత్వర న్యాయం అంటే ఏమిటి? మొత్తం న్యాయ సముపార్జన ప్రక్రియకి పట్టే సమయం ఆరు నెలలకి మించకూడదు. మహా అయితే సంవత్సరం. ట్రయల్ దశ నుంచి అపీల్ దశ వరకూ పట్టవలసిన సమయం. అలాగే అపీళ్ళ కోసం ఉన్న ఊళ్ళు దాటి ఢిల్లీ దాక వెళ్ళవలసిన అవసరం లేకుండా ఆ ప్రక్రియ జిల్లా స్థాయిలోనే అందుబాటులో ఉండడం.

### Delayed and therefore Denied

సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి స్థానానికెదిగిన తరవాత మన న్యాయవ్యవస్థ విశ్వరూపం కళ్ళకి కట్టడంతో అనుభవపూర్వకంగా తెలుసుకున్న తత్వజ్ఞానంతో కొందరు భారత ప్రధాన న్యాయమూర్తులు కోర్టుల మీద ఆధారపడొద్దని కూడా సూచించడం ప్రారంభించేరు. నిర్మొహమాటంగా ఆ పనిని మొదట చేసిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భగవతి. ముప్పై ఎనిమిదేళ్ళ స్వతంత్ర భారతావనిలో అసంఖ్యాకంగా పెరిగిపోతున్న కేసుల పరిష్కారానికి ఎన్ని కోర్టులున్నా చాలవన్న సత్యస్వరూపం ఆయనకి పందొమ్మిది వందల ఎనభై ఐదులోనే గోచరించింది. ప్రత్యామ్నాయంగా మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయించడమే శ్రేయస్కరం అని భావించడంతో 1987లో లీగల్ సర్వీసస్ అథారిటీ చట్టం ద్వారా రూపుదిద్దుకున్నది లోక్ అదాలత్ వ్యవస్థ. కానీ ప్రత్యామ్నాయ వ్యవస్థగా మధ్యవర్తిత్వ ప్రక్రియ నిలదొక్కుకోకపోడానికి న్యాయస్థానాలు, న్యాయవాదులు కూడా బాధ్యులే. It is a collective failure of both the bar and the bench. మధ్యవర్తిత్వం ఒక పరిష్కార మార్గంగా గుర్తించి దాని వేపు కక్షిదారులని నడిపించడానికి తగిన ప్రేరణ అడ్వొకేట్లకి లేదు. చట్టం ద్వారానే ఆ అవసరాన్ని అధిగమించాలి. కొన్ని రకాల వివాదాలకి – కుటుంబ ఆస్తి తగాదాలకి – మధ్యవర్తిత్వమే పరిష్కార వేదికగా చట్టరూపకల్పన జరగాలి. దానికి తగిన విధంగా ప్రొసీజరల్ చట్టాలలో సవరణ చేయాలి. ఆర్బిట్రల్ ట్రైబ్యునల్ రూపకల్పన, నిర్వహణ అడ్వొకేట్లకి చట్టబద్ధమైన బాధ్యతగా పరిణమించాలి. ఆరు నెలల గడువులోగా వివాదాలు పరిష్కారమవ్వాలి. ఆర్బిట్రల్ అవార్డు మీద అపీల్ ప్రక్రియ మరో ఆరు నెలలలోపు పూర్తవాలి. సత్వర న్యాయం అంటే సంవత్సరంలోగా ప్రక్రియ పూర్తవడం. అది కూడా ఉన్న ఊళ్ళోనే. తప్పదంటే జిల్లా స్థాయిలో సంవత్సరంలోగా వస్తేనే న్యాయం జరిగిందని అనుకోవాలి. సంవత్సరం దాటిందంటే justice delayed and therefore denied. న్యాయస్థానాలు న్యాయవాదుల కోసమా, న్యాయార్థుల కోసమా అన్న మౌలిక ప్రశ్నకి సమాధానం న్యాయార్థుల కోసమేనని న్యాయవాదులు ఆచరణలో చూపించాలి. దానికి అవరోధంగా ఉన్న అడ్వొకేట్ల ఆలోచనా ధోరణి మారాలి.

### ఎక్కడున్న గొంగళి అక్కడే

సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులుగా పదవులనలంకరించిన తరవాత వ్యక్తిగతమైన కీర్తిప్రతిష్ఠలు సంపాదించుకోడంతోపాటు సామాన్యుడికి సత్వర న్యాయం అందించడానికి ఏం చేశాం అని తమను తాము ప్రశ్నించుకుని దానికి జవాబు దొరకక, కళ్ళనీళ్ళు నింపుకుంటారు ఒకరు. నేనూ సత్వర న్యాయం బాధితురాలినే అని చెప్పుకుంటారు మరొకరు. గాలిలో దీపం పెట్టి గుళ్ళూ గోపురాలు తీర్థయాత్రలు చేస్తూంటారు ఇంకొకరు. వారందరి collective achievement - status quo.

### డేటా గ్రిడ్‌లోని సమాచారం అసమగ్రం - అసంపూర్ణం

ప్రస్తుతం డేటా గ్రిడ్‌లోని సంఖ్యా సమాచారాన్ని మరింతగా విశ్లేషించి, ఏ ఏ రకాలైన కేసులు ఏ దశలో ఎంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్న సమాచారం కూడా ఎప్పటికప్పుడు real timeలో జనబాహుళ్యానికి అందుబాటులో ఉంచినప్పుడు ఆ సమాచారం మరింత సమగ్రంగాను, సంపూర్ణంగాను ఉంటుంది. తరాల తరబడి న్యాయం కోసం అర్రులు చాచి ఎదురుచూస్తున్నవారి ఆశలు అడియాశలు కాకుండా ఆయా కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు నియమించినప్పుడు, ఆ ప్రత్యేక కోర్టులు వాటికి నిర్ణయించిన గడువులలోగా న్యాయాన్ని అందించగలిగినప్పుడు NJDG స్థాపన అర్థవంతమవుతుంది. అంతమాత్రాన ఇప్పుడున్న సంఖ్యాసమాచారం నిరర్థకమని కాదు.


మౌలికమైన మార్పులు రావాలి – ఆశయంలో, ఆలోచనలో, ఆచరణలో. వస్తుందని ఎదురుచూస్తూ ఉంటాడు సామాన్యుడు. ఆశావాది.

# ఎన్‌జేఏసీ కొట్టివేతపై యూనియన్ ప్రభుత్వం మౌనం వీడటం ముదావహం

సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకాలకు జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) కి పార్లమెంటు ఆమోదం తెలిపి ఈ డిసెంబర్‌కి ఎనిమిదేళ్లవుతుంది. 4 దశాబ్దాలకాలంలో అత్యుత్తమ న్యాయ మూర్తులుగా పేరొందిన సుప్రీంకోర్టు జస్టిస్‌లు ఎం.ఎన్ వెంకటాచలయ్య, జేఎస్ వర్మ, వీఆర్ కృష్ణ అయ్యర్‌లు లోక్‌సత్తా చొరవతో రూపొందించిన ఎన్‌జేఏసీ బిల్లు 99వ రాజ్యాంగ సవరణగా సాకారమైంది. లోక్‌సత్తా 14 ఏళ్ల కృషికి లభించిన విజయమది. ఈ రాజ్యాంగ సవరణ కోసం అన్ని పార్టీలనూ ఒక తాటి మీదకు తేవటంలో కూడా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కీలక పాత్ర పోషించారు. పదహారు రాష్ట్రాల అసెంబ్లీలు స్వల్ప వ్యవధిలోనే ఈ బిల్లును ధృవీకరించాయి. పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించినా, ఉన్నత న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం వ్యవస్థ సవ్యంగా లేదని ఆ కొలీజియం తీర్పుని రాసిన జస్టిస్ జేఎస్ వర్మ కూడా ఎన్‌జేఏసీని రూపొందించినవారిలో ఉన్నా, పలు న్యాయ కమిషన్లు, పాలనా సంస్కరణ సంఘం, కె.టి థామస్ వంటి విశ్రాంత ప్రధాన న్యాయ మూర్తులు ఎన్‌జేఏసీని సమర్థించినా.. ఎన్‌జేఏసీ చెల్లదంటూ సుప్రీం కోర్టు ధర్మాసనం అక్టోబర్ 16, 2015న 4-1 మెజారిటీతో కొట్టి వేసింది. కొలీజియం ద్వారానే జడ్జీల ఎంపిక కొనసాగాలని చెప్పింది. ప్రమాణాలను పట్టించుకోకుండా లిఖితపూర్వక వాదనలు లేకుండా కొలీజియం జడ్జీలను ఎంపికచేయటం, తిరస్కరించటం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ కొలీజియం సమావేశాలను బహిష్కరించిన సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ఎన్‌జేఏసీని సమర్థిస్తూ తీర్పు రాశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై స్పందిస్తూ, ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పార్లమెంటుకు, ప్రభుత్వానికి, పౌరులకు భాగస్వామ్యం కల్పించే జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయటం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ప్రజలు, పార్లమెంటు నిర్ద్వంద్వంగా ఈ తీర్పుని తిరస్కరించాలి అని జేపీ విజ్ఞప్తి చేశారు. దేశ చరిత్రలోనే కీలకఘట్టమైన ఈ తీర్పు మీద పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి లోతైన చర్చతో రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలని, పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని పరిరక్షించాలన్నారు. ఇందుకోసం రాష్ట్రపతి, యూనియన్ ప్రభుత్వం, పార్లమెంటులోని పార్టీల మద్దతు కూడగట్టేందుకు జేపీ ఢిల్లీ వెళ్లారు. కానీ వివిధ కారణాల రీత్యా నరేంద్ర మోదీ ప్రభుత్వం అందుకు ధైర్యం చేయలేకపోయింది.

ఎన్‌జేఏసీని కొట్టివేసినా కొలీజియంలో లోపాలున్నాయని విమర్శల నేపథ్యంలో సుప్రీంకోర్టు అంగీకరించాల్సి వచ్చింది. పారదర్శకతకు సూచనలపై ప్రభుత్వాన్ని ప్రతిపాదనలు కోరింది. కొన్నేళ్ల తర్వాతైనా




సుప్రీంకోర్టు తన తీర్పుని వెనక్కి తీసుకుని ఎన్‌జేఏసీని పునరుద్ధరించకతప్పదని స్పష్టం చేస్తూ, కొలీజియంలో పారదర్శకతకు కూడా జేపీ ఏకాభిప్రాయ సాధనతో సూచనలు పంపారు. ఆ మార్పులు సైతం ఇంకా పెండింగ్‌లో కొనసాగుతున్నాయి. దీంతో కొలీజియంపై విమర్శలు పెరుగుతూనే ఉన్నాయి. ఇటీవల మరింత తీవ్రమయ్యాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఎన్‌జేఏసీ వచ్చింది కాబట్టి ఏదో కుట్ర ఉందని వ్యతిరేకించిన పౌర సమాజ నేతలు కూడా కొన్ని తీర్పులు చూసి కొలీజియం ఎంపికల్ని విమర్శించనారంభించారు. గతేడాది డిసెంబర్‌లో పార్లమెంటులోనే పెద్ద చర్చ జరిగింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాలకు ఇప్పుడనుసరిస్తున్న కొలీజియం పద్ధతిని మార్చాలని సభ్యులు పార్టీలకతీతంగా బలంగా గొంతు వినిపించారు. న్యాయమూర్తుల పింఛను పెంపుకి సంబంధించిన న్యాయ చట్టాల సవరణ సందర్భంగా చర్చలో మాట్లాడుతూ, జాతీయ న్యాయవ్యవస్థ నియామకాల బిల్లు (ఎన్‌జేఏసీ)ని మళ్లీ తీసుకురావాలని వారు సూచించారు. ప్రస్తుత కొలీజియం వ్యవస్థని పునఃపరిశీలించాలని కోరారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకంలో యూనియన్ న్యాయ శాఖా మంత్రికి ఎటువంటి పాత్రా లేకపోవటం వల్ల ఆయన పార్లమెంటుకు జవాబుదారీగా ఉండలేని పరిస్థితి ఉందన్నారు. కొలీజియం పద్ధతిని రద్దు చేసి నూతన వ్యవస్థ ఏర్పాటుకు ఇప్పటికిప్పుడు బిల్లు తెచ్చే యోచన లేదని చెప్పిన న్యాయ శాఖా మంత్రి కిరణ్ రిజిజు కూడా.. ఎన్‌జేఏసీ ఏర్పాటుకు దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని ఆరోజు సభలో స్పష్టం చేశారు. పలువురు న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసినవారు సైతం ఎన్‌జేఏసీకి సుముఖంగా ఉన్నారన్నారు. పార్లమెంటు ఆమోదించిన ఎన్‌జేఏసీ బిల్లుని సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని ప్రస్తావించారు. 'జడ్జీల నియామకానికి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి' అని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆ తర్వాత నవంబర్‌లో ఓ సదస్సులో మాట్లాడుతూ, యూనియన్ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్‌జేఏసీని కొట్టివేయటంపై ఇప్పటి దాకా ప్రభుత్వం మౌనం

వహించిందని, కానీ ఎల్లకాలం మౌనంగా ఉండబోదని స్పష్టం చేశారు.

ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేసినప్పుడు స్పందించాలని 2014లో జేపీ కోరినా సంకోచించిన ప్రభుత్వం ఎట్టకేలకు తన వైఖరిపై మౌనం వీడి ఎన్‌జేఏసీ పునరుద్ధరణకు ప్రయత్నం ప్రారంభించిందన్నది స్పష్టం. అయితే ఇంకా ఏదోకరకంగా కొలీజియంని సమర్థించుకునేందుకే సుప్రీంకోర్టులో జస్టిస్‌లు ప్రయత్నిస్తుండటం విచిత్రం.

కొలీజియంలో లోపం లేదని ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఓ ఆంగ్ల పత్రిక ఇంటర్వ్యూలో చెప్పగా, కొలీజియం మంచిదేనని అంతకుముందు సీజేఐ జస్టిస్ యు.యు లలిత్ ఇటీవల మీడియా ముందు చెప్పారు. 'ప్రతి ఒక్కరూ కొలీజియం చేపట్టే ప్రక్రియను అర్థం చేసుకోవాలి. హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించినంతవరకు హైకోర్టు కొలీజియం 1+2 విధానంలో పేర్లు పంపుతుంది. వాటిపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు స్వీకరిస్తారు. తర్వాత యూనియన్ ప్రభుత్వం ఇంటెలిజెన్స్ బ్యూరో ద్వారా ఆ వ్యక్తుల గుణగణాలు తెలుసుకుంటుంది. తర్వాత ఆ పేర్లు సుప్రీంకోర్టు కొలీజియం ముందుకు వచ్చినప్పుడు అక్కడ ఆయా రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించే న్యాయమూర్తులను సంప్రదించి ఆ వ్యక్తుల గురించి అభిప్రాయాలు తీసుకుంటాం. ఆ తర్వాతే కొలీజియం సిఫార్సులు చేస్తుంది. నా వరకు కొలీజియం వ్యవస్థ ఉత్తమమైందే. 750 మంది న్యాయమూర్తులున్న హైకోర్టులకు జస్టిస్ రమణ నేతృత్వంలోని కొలీజియం 250 మందికిపైగా పేర్లను సిఫార్సు చేసి నియామకాలు జరిగేలా చూడటాన్ని బట్టి కొలీజియం మంచిదే అని నిరూపితమైంది. ఎన్‌జేఏసీ జడ్జిమెంట్‌లో న్యాయమూర్తుల నియామకం గురించి స్పష్టంగా చెప్పారు. అదే ఇప్పుడు లా ఆఫ్ ద ల్యాండ్. అందువల్ల కొలీజియం ఉండాలి' అన్నారాయన. జస్టిస్ లలిత్ కంటే ముందు సీజేఐగా ఉన్న జస్టిస్ ఎన్.వి రమణ కూడా కొలీజియం వ్యవస్థ ఎంతో పారదర్శకమైనదని, ఒక దీర్ఘ ప్రక్రియతో పారదర్శకంగా జడ్జీల ఎంపిక జరుగుతుందని, కొలీజియంపై విమర్శలు అపోహలు మాత్రమేనని చెప్పుకొచ్చారు. కానీ ఎన్‌జేఏసీని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేశాక 'న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం–పారదర్శకత' అంశంపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (ఆస్కీ), ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా సంయుక్తంగా సెప్టెంబర్ 11, 2016న హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహనరావు తన ప్రత్యక్ష అనుభవం నుంచి హైకోర్టు జడ్జీల నియామకంలోని అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధ ధోరణుల్ని ఇలా వివరించారు.. 'కొలీజియంలో పేర్కొన్న న్యాయమూర్తులకపట్ల ముఖ్యమంత్రి లేవనెత్తిన అభ్యంతరాలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లెక్కచేయలేదు. చివరికి కొలీజియంలో పేర్కొన్న పేర్లు, ముఖ్యమంత్రి అభ్యంతరాలతో గవర్నర్ కార్యాలయం నుంచి కేంద్ర న్యాయశాఖకు జాబితాను పంపగా, కేంద్రంతో రాష్ట్రానికి సరైన సంబంధాలు లేని నేపథ్యంలో కొలీజియం పేర్లు యథాతథంగా ఆమోదం పొందాయి. 16–17మంది జడ్జీలను ఆ సమయంలో నియామకం చేయగా, అందులో సగం మందిపై ఆ తర్వాత పలురకాల ఆరోపణలు వచ్చాయి. ముఖ్యమంత్రులకు, ప్రధాన న్యాయమూర్తులకు మధ్య సంబంధాలు బాగుంటే, సీజేని సీఎం విందుకు ఆహ్వానిస్తారు. ఆ విందులో తనకు కావలసిన జడ్జీల పేర్లను కొలీజియం కోసం ముఖ్యమంత్రి ఇస్తారు'. చివరికి రాష్ట్రపతి పాత్రను కూడా తోసిపుచ్చే రీతిలో కొలీజియం వ్యవహరిస్తోందని రామ్మోహనరావు తెలిపారు. ఇవన్నీ చూశాకే, న్యాయ నియామకాలను సంస్కరించటం అత్యవసరం అని తాను ఆ సమయంలోనే గట్టిగా భావించానన్నారు. న్యాయనియామకాలలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఏర్పడిన ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేయటం దురదృష్టకరమన్నారు. న్యాయవ్యవస్థ, ప్రభుత్వాల మధ్య 'అహేల యుద్ధం' జరుగుతోందన్నారు. సమావేశంలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మభూషణ్ పద్మనాభయ్య, అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ కాకి మాధవరావు, ఆంధ్రప్రదేశ్ మాజీ లా సెక్రటరీ కళానిధి సత్యనారాయణ, జాతీయ పోలీసు అకాడమీ మాజీ డైరెక్టర్ కమల్ కుమార్, మాజీ ఐఏఎస్ అధికారి భలేరావు మొదలైన నిష్ణాతులు, అనుభవజ్ఞులు కూడా ఈ అభిప్రాయాలతో ఏకీభవించారు. హైకోర్టులు, సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల నియామకంలో అవకతవకలు, బంధుప్రీతి, రాజకీయ పక్షపాతాలు లేకుండా ఎన్‌జేఏసీ లాంటి వ్యవస్థ ఏర్పాటు తప్పనిసరి అన్నారు.

జడ్జీలను జడ్జీలే నియమించుకోవటం ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ లేదు. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజల ప్రమేయం లేకుండా ఉండకూడదు. న్యాయవ్యవస్థ కూడా అందుకు అతీతం కాదు. ప్రజల భాగస్వామ్యమున్న రీతిలో ఏర్పడటంతో పాటు, ప్రజలకు జవాబుదారీగా ఉండే ఏర్పాటు కూడా మన న్యాయవ్యవస్థలో ఉండాలి. ఎన్‌జేఏసీని కొట్టివేయటంపై యూనియన్ ప్రభుత్వం ఇప్పటికైనా మౌనం వీడటం సానుకూల పరిణామం. 2014 సమయంలో ఎన్‌జేఏసీ ఆమోదం విషయంలో ఎలాగైతే పార్టీలకతీతంగా వ్యవహరించారో, ఆ బిల్లును మరోరూపంలో తెచ్చేందుకు కూడా అదే రీతిలో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయపక్షాలు వ్యవహరించాలి. పక్షపాత రాజకీయ ఆరోపణలు లేకుండా అంశాలపై హేతుబద్ధంగా స్పందించాలి. ఉన్నత న్యాయవ్యవస్థ కూడా తాము అతీతులమన్న ధోరణిని వీడి నిపుణుల సూచనలను, ప్రజాప్రయోజనాలను, ఇతర ప్రజాస్వామిక దేశాల్లోని మెరుగైన పద్ధతులను పరిగణలోకి తీసుకుని జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ను సాకారం చేయాలి. ఎన్‌జేఏసీతోపాటు న్యాయమూర్తులపై ఆరోపణలను విచారించేందుకు జ్యుడీషియల్ అకౌంటబిలిటీ చట్టం, సమర్థులు న్యాయమూర్తులుగా వచ్చేందుకు ఐఏఎస్, ఐపీఎస్‌ల తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్)ని ఏర్పాటు, కింది కోర్టులలో న్యాయమూర్తుల సంఖ్య పెంపు, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయటం, గ్రామ న్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక న్యాయస్థానాల బలోపేతం, నేరపరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా పోలీసు వ్యవస్థలో మార్పులు, స్వతంత్ర ప్రాసిక్యూషన్ మొదలైన సంస్కరణలపై కూడా రాజకీయ, పాలనా, న్యాయ వ్యవస్థలు, మీడియా, పౌర సమాజం దృష్టి సారించటం ఆధునిక భారత్‌కి తక్షణావసరం.

(జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన అక్టోబర్ 16, 2015న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు చేసిన బహిరంగ ప్రకటన (మీడియా రిలీజ్)..

# కంచే చేను మేసింది!

**ఎన్‌జేఏసీని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పుని ప్రజలు తిరస్కరించాలి,**
**ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ రక్షణ కోసం జాతిపోరాటం: జేపీ**
**పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసిపార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి**

ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పార్లమెంటుకు, ప్రభుత్వానికి, పౌరులకు భాగస్వామ్యం కల్పించే జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయటం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ప్రజలు, పార్లమెంటు నిర్ద్వంద్వంగా ఈ తీర్పుని తిరస్కరించాలి అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని తూ నాబొడ్డు అని సుప్రీంకోర్టే అనటం సాధారణ విషయం కాదు, ఇది రాజకీయ పోరాటం కాదు, జాతిపోరాటం అన్నారు. దేశ చరిత్రలోనే కీలకఘట్టమైన ఈ తీర్పు మీద పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి లోతైన చర్చతో రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలని, పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని పరిరక్షించాలన్నారు. కంచే చేను మేసినట్టు అత్యున్నత న్యాయస్థానం వ్యవహరించిందని, రాజ్యాంగాన్ని ధిక్కరించిందని అన్నారు. సుప్రీంకోర్టుకు స్వయంప్రతిపత్తి రాజ్యాంగం నుంచి వస్తుంది తప్ప రాజ్యాంగాన్నే కాదనే అధికారం సుప్రీంకోర్టుకు లేదన్నారు. న్యాయమూర్తులు స్వయంభులు, దైవదూతలు, దైవాంశసంభూతులు, చక్రవర్తులు కాదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు లోబడి పనిచేయాల్సిందేనన్నారు.




ఎన్‌జేఏసీని ఏర్పాటుకు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన 99వ రాజ్యాంగ సవరణను కొట్టివేస్తూ, జడ్జీలను జడ్జీలే నియమించుకునే పాత కొలీజియం వ్యవస్థనే కొనసాగించాలంటూ సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పుపై జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రపంచంలోని మరే ప్రజాస్వామ్య దేశంలోనూ ఇలా మాట్లాడే సాహసాన్ని న్యాయవ్యవస్థ చేయదని, కానీ రాజకీయం దిగజారి, అరుపులు, నినాదాలు తప్ప విధానాల సంక్లిష్టతల గురించి అవగాహన తక్కువ ఉండటం వల్ల మనదేశంలో ఇలాంటి తీర్పుని ఇచ్చారని అన్నారు. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా జడ్జీలను జడ్జీలే నియమించుకోరన్నారు. ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్ తదితర దేశాలన్నిటిలో ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వాల, పార్లమెంటుల పాత్ర ఉంటుందన్నారు. చాలా దేశాల్లో సమాజంలోని పౌరులకు కూడా అవకాశం కల్పిస్తారన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి ఉన్నత న్యాయమూర్తులను నియమించమని రాజ్యాంగంలో పదజాలం ఉంటే, దానికి విపరీతార్థాలు చెప్పి ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ లేనిరీతిలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే విడ్డూరమైన కొలీజియం వ్యవస్థని మన సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిందని, ఈ తరహా వ్యవస్థనే కొనసాగించాలనుకుంటోందన్నారు.

దైవదూతల్లా, దైవాంశసంభూతుల్లా తమను తామే నియమించుకుంటామని, ప్రభుత్వం, ప్రజలతో తమకు సంబంధం లేదని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను తానే తగ్గించుకుందని జేపీ అన్నారు. దేశంలో సంక్లిష్టమైన మందిరం-మసీదు, రిజర్వేషన్లు, నదీజలాల పంపిణీ, ఆంధ్ర-తెలంగాణ వంటి రాష్ట్రాల మధ్య తగాదాలు వంటి ఘర్షణలు తలెత్తినప్పుడు రాజకీయం వాటిని పరిష్కరించటం కష్టమని, అటువంటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన సుప్రీంకోర్టు అవసరమని, ఇలాంటి తీర్పులతో సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను కోల్పేయి దైవదూతలం, దైవాంశసంభూతులం అంటూ వ్యవహరిస్తే ఉపద్రవాలు

ముంచుకొచ్చి దేశ సమగ్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు.

దేశం కన్నా న్యాయవ్యవస్థ ఎక్కువ కాదని, ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రజల మద్దతును ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందాల్సిందేనని, అలా ప్రజలతో సంబంధం లేని వ్యవస్థలకు విశ్వసనీయత, నైతికత ఉండదని జేపీ స్పష్టంచేశారు. పార్లమెంటు, పౌరులు, ప్రభుత్వం పాత్ర అక్కర్లేదు అంటే ఇక కలెక్టర్లని కలెక్టర్లు, ఎన్నికల సంఘాన్ని ఎన్నికల సంఘం, యూపీఎస్‌సీని యూపీఎస్‌సీ, ఇలా ప్రతి వ్యవస్థా తనను తానే నియమించుకోవచ్చని, రేపు ఎన్నికలు, పార్లమెంటు కూడా అక్కర్లేదనవచ్చని అన్నారు. ఈ ధోరణి అరాచకత్వానికి, నియంతృత్వానికి దారితీస్తుందన్నారు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26, 1949న డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ, ఈ రాజ్యాంగం విఫలమైతే తప్పు రాజ్యాంగానిది కాదు, దాన్ని అమలు చేసే వారిదేనని హెచ్చరించిన విషయాన్ని జేపీ ఉటంకించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సుప్రీంకోర్టే ఈవేళ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. దేశ చరిత్రలో ఇది కీలకఘట్టమని, 99వ రాజ్యాంగ సవరణతో ఈ చట్టాన్ని తీసుకురావటానికి లోక్‌సత్తా 14-15 ఏళ్ల పాటు పోరాటం చేసిందని అన్నారు. విజ్ఞతకు, నిర్భీతికి మారుపేరైన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్‌లను ఒకచోటకి చేర్చి ఈ బిల్లును రూపొందించిందని, పదేళ్ల పాటు కృషి చేసి అన్ని పార్టీలనూ ఒప్పించిందని అన్నారు. అందుకే ఉప్పునిప్పులా ఉండే ఎన్డీయే, యూపీయేలు ఏకగ్రీవంగా పార్లమెంటులో 2014 డిసెంబర్‌లో ఈ బిల్లును ఆమోదించాయని గుర్తుచేశారు. ఎంతో నిజాయతీతో, ముందుచూపుతో, అత్యుత్తమ న్యాయమూర్తుల భాగస్వామ్యంతో లోక్‌సత్తా రూపొందించింది కాబట్టే పార్టీలకతీతంగా అది ఆమోదం పొందిందన్నారు.

**ఇంప్లీడ్ అవుతానన్నా బెంచ్ అవకాశం ఇవ్వలేదు,**

**ఎన్‌జేఏసీపై కృషి, సమాచారం పుస్తకరూపంలో అందరికీ, స్పందించిన సోనియా**

ఈ బిల్లు వెనక కృషిని, వివరాలను పుస్తకరూపంలో రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ప్రతిపక్ష నేతకు, అన్ని పార్టీలకు, పార్లమెంటు సభ్యులందరికీ పంపించామని, లేఖ రాశామని, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇప్పటికే ఎన్‌జేఏసీకి మద్దతిస్తామని తిరిగి లేఖ రాశారని తెలిపారు. ఆ పుస్తకాన్ని, లేఖలను మీడియాకు జేపీ విడుదల చేశారు. ఎన్‌జేఏసీపై వాదనల సమయంలో ఇంప్లీడ్ కావటానికి తాను అభ్యర్థించినా సుప్రీంకోర్టు బెంచ్ అనుమతించలేదని, వారికి కూడా ఈ వివరాలు పంపానని తెలిపారు. ఈ చట్టంలోని సంక్లిష్ట దేశ ప్రయోజనాలను గుర్తించి సంయమనంతో తీర్పునివ్వాలని కోరానన్నారు. కానీ వారికి విషయం బోధపడకో, ఏం చేసినా చెల్లుతుందని భావించో, రాజ్యాంగానికి వేరే భాష్యం అనుకునో ఎన్‌జేఏసీని వ్యతిరేకిస్తూ తీర్పునిచ్చారన్నారు.

**ఢిల్లీకి జేపీ**

శనివారం ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి సహా అందరినీ కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తానని జేపీ తెలిపారు. పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ తీర్పుపై కనీసం వారంరోజులపాటు చర్చించాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగవ్యతిరేక తీర్పునకు వ్యతిరేకంగా పార్లమెంటు సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించాలని, ఇది ప్రభుత్వ, పార్టీల వ్యవహారం కాదని అన్నారు. ఈ తీర్పును సరిచేసి, న్యాయమూర్తులు దైవాంశసంభూతుల్లా తమను తాము నియమించుకోకుండా, ఉన్నత న్యాయమూర్తుల నియామకాలు పారదర్శకంగా జరిగేలా పభుత్వం, పార్లమెంటు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలోని అన్ని రాజ్యాంగసంస్థల నిష్ణాతుల్ని, ప్రపంచదేశాల నిపుణుల్ని పిలిపించి ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యేలా చర్చ చేయాలని, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక ప్రాతినిధ్యాన్ని కాపాడేలా ఏకాభిప్రాయాన్ని సాధించాలని అన్నారు. మీడియా దేశవ్యాప్తంగా ఈ కీలక తీర్పుపై ప్రామాణిక చర్చ జరిపి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

**రాజకీయాలు దిగజారటం వల్లే ఇంతదాకా వచ్చింది, ప్రక్షాళనపైనా పార్లమెంటు కళ్లు తెరవాలి**

దాంతోపాటు అసలీ పరిస్థితి ఇక్కడిదాకా రావటానికి రాజకీయాలు దిగజారటమే కారణమని పార్లమెంటు గుర్తించాలని జేపీ అన్నారు. అవినీతి, గూండాయిజం వంటి వాటితో రాజకీయం దిగజారటం వల్లే ప్రజలు రాజకీయానికి ప్రత్యామ్నాయంగా న్యాయవ్యవస్థ మీద మితిమీరి ఆధారపడుతున్నారని, ఆ ధోరణి కొనసాగితే అది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్నే హరించివేస్తుందని అన్నారు. మన ప్రజాస్వామ్యంలో, రాజకీయంలో ఉన్న లోపాలపై లోక్‌సత్తా చేసినంత పోరాటం గత ఇరవైఏళ్లలో ఎవరూ చేయలేదని, అధికారం లేకుండానే 99వ రాజ్యాంగసవరణ సహా 15 మౌలిక మార్పుల్ని శాంతియుతంగా సాధించి చూపిందని, కానీ రాజకీయాల్లో మార్పునకు రాజకీయాలను ద్వేషించటం కాకుండా మరింత మరింత మంచి రాజకీయం దిశగా ప్రక్షాళన చేయటం, అత్యుత్తములు ఎన్నికయ్యే అవకాశాన్ని కల్పించటమే మార్గమని ఆచరించి చూపిందని అన్నారు. రాజకీయాలలో విశ్వసనీయత, నైతికత పెంచటానికీ పార్లమెంటు నడుం బిగించాలన్నారు.

“నిజాయతీ, నిష్పాక్షికత, రాజ్యాంగం పట్ల గౌరవం, రాజకీయాల్లో, వ్యవస్థల్లో మౌలికమార్పు కోసం అసాధారణ కృషి అర్హతలుగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ పోరాటానికి పిలుపు నిస్తోంది. కానీ ఈ పోరాటం చేయాల్సిన బాధ్యత, అధికారం పార్లమెంటుది, పౌరసమాజానిది. లోక్‌సత్తా తన వంతు పాత్ర పోషిస్తుంది” అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# హుజూరాబాద్, మునుగోడు

# ముగిసిన కథ కాదు..

జమిలి ఎన్నికల గొడవేమో గానీ.. దేశంలో ఏదోకరూపంలో ఏటా ఎన్నికలు జరుగుతుంటే మాత్రం శరవేగంగా పెరుగుతున్న నిరుద్యోగం నుంచి అసంఘటితంగానైనా కొంత ఉపశమనం లభిస్తుందేమోనన్న భావం ప్రబలుతోంది. తెలంగాణలోని మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక జరిగిన తీరు చూశాక ఈ మాట ఎవరైనా ఒప్పుకోకతప్పదు. ఎన్నికలంటే జాతర, మజా, ఉత్కంఠ స్థాయి నుండి ఉపాధి, ఆదాయ మార్గం స్థాయికి మళ్లటం మునుగోడులో కొత్త ఎత్తులను అందుకుంది. తెలంగాణలోనే 2021లో జరిగిన హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక రికార్డును ఈ విషయంలో మునుగోడు అధిగమించింది.



రెండు జిల్లాలు, మూడు రెవెన్యూ డివిజన్లు, మూడు పోలీసు డివిజన్లు.. ఒక మండలంతో మరో మండలానికి సంబంధంలేని రీతిలో నల్గొండ జిల్లా చివరన ఉన్న దేవరకొండ నుంచి హైదరాబాద్ సమీపం వరకు విస్తరించిన మునుగోడు నియోజకవర్గానికి ఎన్నికకు నెల రోజుల ముందే బయటి నుంచి పాతిక వేల మంది దాకా వచ్చినట్లు అంచనా. నియోజకవర్గంలోని 298 బూత్‌ల వారీగా వీరంతా పనిచేశారు. వీరికి వసతి, విందు భోజనాలు, చెల్లింపులు భారీగా జరిగాయి. స్థానికంగా ఉండే కూలీలు, చిన్న రైతులకు కూడా పెద్దఎత్తున ఉపాధి లభించింది. ర్యాలీకి ఇంత, రోడ్‌షోకు ఇంతని రోజూ ఒక్కొక్కరికీ వందల రూపాయల్లో కిరాయి చెల్లించారు. లక్షలు ఖర్చు పెట్టి ఊళ్లకు ఊళ్ల చొప్పున రోజూ భోజనాలు పెట్టించారు. ముక్క, మద్యం ఏరులైపారించారు. దాదాపు 2,41,000 మంది ఓటర్లున్న నియోజకవర్గంలో చాలా ఊళ్లలో మగవారికి మద్యం బాటిల్, ఆడవారికి కూల్‌డ్రింక్‌లు పెద్దఎత్తున సరఫరా జరిగినట్లు సమాచారం. ఈ సీజన్‌లో రూ.200 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు సాగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో అక్టోబర్ నెల తొలి పది రోజుల్లోనే రూ.70.7 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి. టెంట్లు, భవనాల అద్దెకూ భారీగా ఖర్చు పెట్టారు.

మునుగోడులో ఉప ఎన్నిక వల్ల అనేక పెండింగ్ పనులకపూర్తికి అధికార టీఆర్ఎస్ చకచకా చర్యలు తీసుకుంది. 2016 నాటి భూనిర్వాసితులకు చెల్లింపులు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మిలకు కేటాయింపులు, దళితబంధు జాబితా రెడీ చేయటం, గొర్రెల యూనిట్లకు డబ్బు బదిలీ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు విడుదల, రోడ్లు టకటకామని బాగుచేయటం, సర్వాయి పాపన్న జయంత్యుత్సవాలు అధికారికంగా నిర్వహించటంపై హామీ, సంక్షేమ అధికారులతో రహస్య సమావేశాలు ఇలా వరస పెట్టి చేశారు. వీటితోపాటు ఇతర ప్రధాన పార్టీల కంటే మిన్నగా వ్యక్తిగతమైన పనులు కూడా చేసిపెట్టారు. ఎవరన్నా తమ ఇంట్లో అనారోగ్య సమస్యల్ని చెబితే హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచిత చికిత్స ఇప్పించారు. కండువా కప్పుకుంటే క్యాష్ డౌన్ ఆఫర్లతో యువతకు ఆకర్షణలు వెదజల్లారు. దేవాలయాల దర్శనానికి తీసుకెళ్లి మరీ ఒట్లేయించుకున్నారు, ఇంటింటికీ బొట్టుపెట్టే కార్యక్రమాలు చేశారు. విమాన టికెట్లు కూడా ఇచ్చి కొందరిని రప్పించినట్లు సమాచారం.

మరోవైపు ఒక్కో నాయకుడికీ లక్షలు చొప్పున చెల్లించి స్థానిక నేతల్ని కొనుగోలు చేశారు. ఇదంతా చూశాక ఆయా పార్టీల సొంత కార్యకర్తలు కూడా పనిచేయటానికి డబ్బులు డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలను కాపాడుకోవటానికి ఉన్నంతలో కాంగ్రెస్ కూడా డబ్బులు పంచాల్సి వచ్చిందని సమాచారం.

బేగంపేటలో, పంజాగుట్టలో, నగర శివార్లలో ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోనే 15 రోజుల వ్యవధిలో మూడు కమిషనరేట్ల పరిధిలో సుమారు 15-25 కోట్ల మేర అక్రమంగా తరలిస్తున్న నగదు పట్టుబడింది. బేగంబజార్, గోషామహల్, అబిడ్స్, సికింద్రాబాద్, తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లో గోదాముల్లో పెద్దఎత్తున నగదు చేరినట్లు సమాచారం. నాలుగైదు రాష్ట్రాల వ్యాపారులు, పారిశ్రామికవేత్తలతో పరిచయం ఉన్న దళారులు సిటీలో పదుల సంఖ్యలో ఉన్నట్లు అంచనా.

వీటన్నిటిపై మీడియాలో విస్తృతంగా వార్తలు వచ్చాయి. నియోజకవర్గంలోని వారు ఇతర ప్రాంతాల్లోని తమ

బంధుమిత్రులతో కూడా తమకు డబ్బు, రకరకాల ప్రలోభాల పంచటంపై వివరాల్ని పంచుకున్నారు. కొన్ని పార్టీల, పౌర సమాజ నేతలు ఎన్నికల సంఘానికి సాక్ష్యాధారాలతో ఫిర్యాదు కూడా చేశారు.

ఇలా మునుగోడులో ఆయా రాజకీయ పార్టీలు కూడా కనీవినీ ఎరుగని రీతిలో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల పర్వం కొనసాగింది. ఒక అంచనా ప్రకారం, మునుగోడులోని దాదాపు 60 శాతం ఓటర్లకి వివిధ రూపాల్లో ప్రలోభాలు అందాయి.

మునుగోడులో రూ.6.6 కోట్ల నగదు, వేల లీటర్ల మద్యం, రూ.1.78 కోట్ల నగలను జప్తు చేసినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కానీ మీడియా వార్తలతోపాటు ఎన్నికల ప్రచార సమయంలో నియోజకవర్గంలో పర్యటించిన వివిధ సంస్థల, నేతల నివేదికల్ని చూస్తే.. హుజూరాబాద్ అనుభవంతో అధికార టీఆర్ఎస్ తమ ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఆర్థిక మూలాలను కట్టడి చేయటంతో చివరి నిమిషంలో ఓటుకు నోటు విలువ ముందనుకున్న స్థాయిలో లేకున్నా మొత్తంగా మునుగోడు తాజా ఎన్నికలో రూ.350 కోట్ల నుంచి 400 కోట్ల వరకు ప్రధాన పార్టీల పెట్టుబడిగా తేలుతుంది. ఇది బ్రిటన్‌లోని 650 పార్లమెంటు స్థానాలకు 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వ్యయం కంటే కూడా ఎక్కువ. బ్రిటన్‌లో ఆ ఎన్నికలకు రెండు ప్రధాన పార్టీలు కన్సర్వేటివ్, లేబర్ కలిసి 28 మిలియన్ పౌండ్లు ఖర్చు చేయగా, అభ్యర్థులు 11 మిలియన్ పౌండ్లు వ్యయం చేశారు. ఈ మొత్తం కలిపి ప్రస్తుత మారక విలువలో రూ.370 కోట్లు కాగా, కొనుగోలు శక్తి రీత్యా రూ.120 కోట్లు. అలాంటిది భారత్ వంటి ఒక పేద దేశంలో, ఒక చిన్న రాష్ట్రంలో, ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికకు మనం ఇంతింత ఖర్చు చేయటం ఏ రకంగా చూసినా రాజకీయ చాతుర్యం కాదు, శక్తిసంపన్నత అంత కన్నా కాదు.. కేవలం ఉన్మాదం!

**మునుగోడు గెలుపోటముల్ని ప్రజలు పట్టించుకోవటం లేదు**

ఎన్నికల్లో గెలిచినవారి వల్ల, గెలిచిన తీరు వల్ల దేశానికి పెద్దగా ఒరిగేదేమీ లేనప్పుడు ఎన్నికల ఫలితాల గురించి లోక్‌సత్తా లాంటి సంస్థలు పెద్దగా వ్యాఖ్యానించవు. కానీ, ఏ ఎన్నిక గురించయినా టీ 20 మ్యాచ్‌లా చర్చించేవారు కూడా మునుగోడు ఉప ఎన్నికలో గెలిచినవారి గురించి, ఓడినవారి గురించి కాకుండా ఎన్నికల తీరు గురించే ఎక్కువ మాట్లాడుతున్నారు.

**ఈ ఉన్మాదం వెనుక మరో ఉన్మాదం**

కేవలం ఒక్క ఏడాది మాత్రమే పదవీకాలమున్న, ప్రభుత్వ మనుగడపై ఏమాత్రం ప్రభావం చూపని ఒక్క ఎమ్మెల్యే పదవి కోసం ఇన్ని వందల కోట్లు ఎందుకు ఖర్చు పెట్టారంటే, ఈ ఉన్మాదం వెనక మరో ఉన్మాదం ఉంది. 2023లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావాలన్న టీఆర్ఎస్ ఆరాటం, ఎలాగోలా అధికారాన్ని కైవశం చేసుకోవాలన్న బీజేపీ పోరాటం మునుగోడును భీకర రణగోడుగా మార్చాయి.

**సారాంశం.. డబ్బే ఎన్నికలకు ఎంట్రీ పాయింట్**

మునుగోడులో కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది, ఆ పార్టీ తరపున 2018లో గెలిచిన రాజగోపాలరెడ్డికి ఇంకా ఎక్కువ బలం ఉంది. ఆయనకు కొంతకాలానికి తాను గెలిచిన పార్టీ నచ్చకపోయి ఉండొచ్చు. ముందు టీఆర్ఎస్‌లో ప్రవేశించాలని అనుకున్నారట. ఆ తర్వాత బీజేపీ ఆయన్ను లాక్కుంది. తనకు నచ్చని పార్టీలో కొనసాగకూడదని ఆయన అనుకోవటంలో తప్పు లేదు. నైతిక బాధ్యతతో ఆయన ఆ పదవికి రాజీనామా కూడా చేశారు. రాజీనామా చేయకుండా బీజేపీ మద్దతుదారుగా కొనసాగివుంటే అవకాశవాది అంటూ వచ్చే విమర్శకు భిన్నంగా ఇప్పుడు ఉప ఎన్నికకు కారణమయ్యారనే విమర్శను రాజగోపాలరెడ్డి ఎదుర్కొన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల కోణంలో ఈ ఉప ఎన్నిక రావటంతో విమర్శల దాడి మరింత తీవ్రంగా ఉంది.

ఇలాంటి ఒక ఉప ఎన్నిక మరోటి సాధారణ ఎన్నికల లోపు వస్తుందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. తాము సృష్టించినా, ఎదుటివారు సృష్టించినా ఇలా డబ్బుతో, ఇతర పార్టీల నుంచి నేతల్ని లాక్కుంటూ, వ్యవస్థల దుర్వినియోగంతో కొన్ని ఉప ఎన్నికల్ని గెలిస్తే, 2023 ఎన్నికల్లో తాము గెలుపు గుర్రం కాగలమని టీఆర్ఎస్, బీజేపీ భావిస్తున్నాయంటే సారాంశం ఒకటే.. కోట్లకు కోట్లు ఖర్చు పెడితేనే ఏ పార్టీకయినా వచ్చే ఎన్నికల్లో బరిలో ఉన్నారనిపించుకునే అవకాశం ఉంటుంది. అంత ఖర్చు పెడితే, ఆ మధ్యలో ప్రజలు అప్పటి పరిస్థితులను బట్టి తమకు నచ్చిన పార్టీకి ఓటు వేస్తారు. వీరి మధ్య ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ నచ్చినా, మూడో పార్టీ అవుతుంది అనుకుంటే ఓటు వృథా అని పక్కన పెట్టేస్తారు.

**బ్రిటన్‌లో శతాబ్దాల క్రితం ఇలా వేలం పాటలుండేవి**

మన ప్రస్తుత సంక్షోభం కొన్ని శతాబ్దాల క్రితం బ్రిటన్‌లోని రాటెన్‌బర్రోస్ నియోజకవర్గాలను తలపిస్తోంది. అప్పట్లో అక్కడ ఎన్నికలంటే వేలంపాటలు! ఇప్పుడు బ్రిటన్ తనను తాను సంస్కరించుకుని ఎంతో ప్రజాస్వామ్యయుతంగా తయారవ్వగా, మనం మాత్రం ఆ దేశం వదిలేసిన శిథిలాల మధ్యే తచ్చాడుతున్నాం.

**దేశ ప్రజాస్వామ్యం బలహీనపడుతుంటే, 2047 యువ భారత్ లక్ష్యం తడబడుతుంది**

కేవలం పోలింగ్ బూత్ లోపల స్వేచ్ఛగా ఓటు వేయటం భారత ప్రజాస్వామ్యాన్ని ఒక పరిధి దాటి కాపాడలేదని హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికలు చాలా స్పష్టంగా రుజువు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల్లో అంతర్మథనం జరగాలి. దేశ ప్రజాస్వామ్యం బలహీనపడుతుంటే, వందేళ్ల భారతం యువత అడుగులు కూడా తడబడతాయి. భారత్‌కున్న ఆర్థికాభివృద్ధి అనుకూలతలు కూడా పరిమితమైపోతాయి. చివరికి ఈవేళ అలెగ్జాండర్లమని చెప్పుకుంటున్న నేతల్ని, వారి పార్టీల్ని కూడా కబళించే పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా మేలుకోవటం అందరికీ శ్రేయస్కరం.

సమాజంలోని అవిద్య, పేదరికం, అధికారం పట్ల ఉన్న పిచ్చిని, మీడియా అపరిపక్వతను ఇంకా ఇంకా అవకాశవాదంతో ఉపయోగించుకోకుండా ఈ దేశానికి మార్గం చూపే నేతలు, పార్టీలకు మాత్రమే భవిష్యత్తు ఉంటుంది.

**పథకాలపైనా టీఆర్ఎస్ పునస్సమీక్షించుకోవాలి**

ప్రజలను తాత్కాలిక తాయిలాలతో కాకుండా వారికి దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే విధానాలతో ఆకట్టుకుంటే పార్టీలకు మద్దతు కూడా దీర్ఘకాలం కొనసాగుతుంది. నిజంగా కేసీఆర్ ఇచ్చిన స్కీములు బలంగా పనిచేస్తుంటే, మునుగోడులో అంత మోహరించాల్సిన పరిస్థితి ఆయనకు వచ్చేది కాదు. గత ఎన్నికల్లో 12,725 ఓట్లు మాత్రమే సాధించిన బీజేపీ కేవలం నాలుగేళ్ల వ్యవధిలో ఈసారి ఏడు రెట్లు అధికంగా ఓట్లు తెచ్చుకుందంటే, గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టుసాధించిందంటే, రికార్డు స్థాయిలో 93 శాతం పైచిలుకు పోలింగ్‌లో యువత మద్దతును అన్ని పార్టీల కంటే ఎక్కువగా సాధించిందంటే, చివర్లో చేతులెత్తేయకుండా ఉంటే గెలిచి ఉండేదంటే, కమ్యూనిస్టుల మద్దతు లేకున్నా, కాంగ్రెస్‌కు ఇరవై వేలు పైచిలుకు ఓట్లు రాకున్నా (ఈ రకంగా ఓట్లు రావటానికి కూడా కేసీఆర్ వ్యూహాత్మక ఉదారతే కారణమనే విశ్లేషణలున్నాయి) టీఆర్ఎస్ ఓడిపోయే పరిస్థితి వచ్చేదంటే.. కేసీఆర్ పార్టీ ఆలోచించుకోవాలి. అది కూడా పది మంది మంత్రులు, 80-90 మంది ఎమ్మెల్యేలు అక్కడ ప్రతి అడుగునూ జల్లెడ పడుతూ పనిచేసినా, డబ్బు భారీగా వెదజల్లినా.

**పాలనలో, ఎన్నికల వ్యవస్థలో మార్పులతోనే దీర్ఘకాల మనుగడ**

కాలం గడుస్తున్న కొద్దీ టీఆర్ఎస్ పథకాలను ప్రజలు ఎక్కువగా తాత్కాలిక సాయంలో భాగంగా చూస్తున్నారే తప్ప.. అవి తమ జీవితాల్ని బాగుచేయటానికి ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలన అనుకోవటం లేదు. పాలనా పరంగా విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, సర్కారీ కార్యాలయాల ప్రక్షాళన మీద దృష్టి కేంద్రీకరిస్తేనే టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మీద దీర్ఘకాలిక ప్రభావం చూపగలుగుతుంది. అలాగే ఎమ్మెల్యేల మద్దతు, ప్రతిసారీ వారి ఎన్నికల గురించి, కూడికలు తీసివేతల గురించి ముఖ్యమంత్రి హైరానా పడాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా, సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక విధానాన్ని ఏకాభిప్రాయంతో తీసుకురావాలి. ముఖ్యమంత్రులు నేరుగా ప్రజల నుంచే ఎన్నికైతే.. సుపరిపాలన, అభివృద్ధి కోసం సమాజంలో సమర్థుల సేవలు మంత్రివర్గంలో ఉపయోగించుకునే అవకాశం కూడా లభిస్తుంది.

దీంతోపాటు మూడో స్థానమో, ఆ తర్వాతి స్థానాల్లో ఉండే పార్టీకి వేసే ఓటు వేస్టు అనుకుంటూ మంచి అభ్యర్థికి, నచ్చిన పార్టీకి ఓటు వేయకుండా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయనుకున్న పార్టీలకు ఓటు వేయాల్సిన అవసరం లేకుండా.. ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలి. ఈ ఎన్నికల సంస్కరణల వల్ల మోదీ, కేసీఆర్ లాంటి బలమైన నాయకులకు, వారి పార్టీలకు ప్రయోజనం చేకూరుతుంది, డబ్బులో తూగలేక, మూడో స్థానంలోకి వెళ్లిపోవటం వల్ల నష్టపోతున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు వంటి పార్టీలకూ లాభం జరుగుతుంది, పదివేల ఓట్లతో ఓడిపోవటం వల్ల పడ్డ కష్టమంతా వృధా అయిందని రాజగోపాలరెడ్డి లాంటివారు ఆక్రోశించాల్సిన పరిస్థితి ఉండదు, కుల, మత తత్వాలు పెచ్చరిల్లాయని తల్లడిల్లుతున్న పౌర సమాజానికీఊరట కలుగుతుంది, అన్నిటినీ మించి సమర్థులు, నిజాయతీపరులు చట్టసభల్లోకి వెళ్లే అవకాశాలు మెరుగై ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.

**దామాషా పద్ధతి ఆనాడే వచ్చి ఉంటే దేశ రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారేది**

మునుగోడులో ఇప్పుడు కాంగ్రెస్ ఎదుర్కొన్న పరిస్థితిని ఒకప్పుడు తాము ఎదుర్కొన్నామని, డబ్బు, మద్యం పంపిణీ చేయలేక విలవిల్లాడమని కమ్యూనిస్టు పార్టీలు చెబుతున్నాయి.



మిత్రపక్షాలుగా తాము మద్దతిస్తున్న టీఆర్ఎస్ డబ్బు భారీగా పంపిణీ చేస్తున్నా, వారితో కొనసాగటం తప్ప మరో మార్గం లేదని, దామాషా ఎన్నికల పద్ధతి వచ్చే వరకూ ఇదే ఎత్తుగడలతో వ్యవహరిస్తామని కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడొకరు ఎన్నికల ఫలితాలొచ్చాక ఓ టీవీ ఛానల్‌లో మాట్లాడుతూ తెలిపారు. దామాషా ఎన్నికల పద్ధతికి లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ 2005లో చేసిన ప్రయత్నం తృటిలో తప్పిపోవటానికి ఇదే కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ఓ జాతీయ నేతే కావటం చారిత్రక విషాదం. భారతదేశ పరిస్థితులకనుగుణమైన దామాషా ఎన్నికల సంస్కరణ ఆరోజే వచ్చి ఉంటే ఈవేళ దేశ రాజకీయం చాలా భిన్నంగా ఉండేది.

**పీఎం, సీఎంల చేతుల్లో నుంచి అధికారాన్ని వికేంద్రీకరించాలి**

అలాగే అధికారమంతా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటం వల్ల ప్రజలు ఓటులో తాత్కాలిక లబ్ధిని తప్ప తమ జీవితాల్ని చూసుకోవటం లేదు. దీంతో మోదీ లాంటి వారు వ్యక్తిగతంగా ఎంత నిజాయతీగా ఉన్నా, ప్రభుత్వ ధనాన్ని సద్వినియోగం చేయాలని ఎంత తపనపడుతున్నా, చట్టవిరుద్ధ డబ్బుతో కొనుగోళ్లు లేకుండా గెలుపు అసాధ్యమయ్యే పరిస్థితులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అందువల్ల అధికారాన్ని వికేంద్రీకరించి, మంత్రులకూ బాధ్యతలు అప్పచెప్పటం, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం కూడా ప్రధాన పార్టీలు, నేతలకు తక్షణావసరం.

**ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే ఆ భారం ప్రజల మీద పడకూడదు**

అధికార పార్టీని గెలిపిస్తేనే పథకాలు అమలు చేస్తామనే ఒరవడిని కేసీఆరే సృష్టించినారు. దీనివల్ల టీఆర్ఎస్‌లో చేరాలని ప్రజల నుంచికూడా ఒత్తిడి వచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. మునుగోడులో ప్రభుత్వం హడావుడిగా పలు కార్యక్రమాలను ప్రారంభించటం, జిల్లాను దత్తత తీసుకుంటామని చెప్పటం, డబ్బులు, ఇతర ప్రలోభాలను పంచటం చూశాక మా నియోజకవర్గంలో కూడా ఉప ఎన్నిక పెట్టాలని ఒత్తిళ్లు వస్తున్నాయని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఈ పరిస్థితిని పరిష్కరించేందుకు పైన పేర్కొన్న సంస్కరణలను తేవటం, ఎమ్మెల్యేకున్న రాజీనామా చేసే స్వేచ్ఛను కాపాడటంతోపాటు ప్రజలపై భారం లేకుండా ఎన్నికల వ్యవస్థలో కొన్ని ఏర్పాట్లు కూడా చేయటం అవసరం. రాజీనామా చేసిన ప్రజాప్రతినిధే ఎన్నికల వ్యయాన్ని భరించటం లేదా దామాషా పద్ధతిని ప్రవేశపెట్టి ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎమ్మెల్యేగా

## మునుగోడు ఉప ఎన్నిక క్షేత్రస్థాయి పరిశీలన-1

మునుగోడు ప్రాంత రైతులు 2005 నుండి పెండింగ్‌లో ఉన్న ఉదయ సముద్రం రిజర్వాయర్‌ను పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని అడుగుతూనే ఉన్నారు. అది పూర్తయితే మూడు మండలాల్లో భూగర్భ జలం పెరుగుతుంది. జబ్బు వస్తే ఆరెంపీ డాక్టర్లే గతి. వైద్యులను కలవకుండా మందులు కొనుక్కోవడమే ప్రజలకు అలవాటు. తమ దవాఖానాల్లో పనిచేసే వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని వాళ్లు ప్రభుత్వాన్ని చాలాసార్లు అడిగారు. హైదరాబాద్‌కు వెళ్లలేని అమ్మాయిలు కాలేజీ చదువులు మానేస్తున్నారని, కుర్రాళ్లకు పనిలేకపోవడం వల్ల ముంబై వలస వెళ్తున్నారని ఎమ్మెల్యేకు చాలాసార్లు చెప్పారు. 1970 తర్వాత పొలం నుంచి గ్రామం వరకు వెళ్లే రోడ్ల మీద ఒక తట్టెడు మట్టిపోయలేదని పాతతరం రైతులు వాపోవడం కనిపిస్తుంది. ఇవాళ మునుగోడులోని ప్రజలు ఓటర్లు మాత్రమే. ఎందుకంటే ప్రజల సామూహిక సమస్యలు కొత్త రాజకీయ చట్రంలో ఇమడవు.

మేము మాట్లాడినవాళ్లలో సామాన్యుల నుంచి అన్ని పార్టీల కార్యకర్తలు ఉన్నారు. వారంతా ఒప్పుకున్న అంశాలు కొన్ని ఉన్నాయి. 2014 తర్వాత మిషన్ భగీరథ పనులు జరగడం వల్ల ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం మాత్రం వచ్చింది. అది మాత్రమే ఉమ్మడి అభివృద్ధి పథకం. రైతుబంధు పథకం కౌలు రైతులను కౌలు రైతులుగానే మిగిల్చింది. ఆసరా పెన్షన్ నత్తనడకన సాగుతోంది. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించిన ప్రతిచోటా ప్రభుత్వం అతి తక్కువ నిధులు ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరేంత వరకు ఆ నియోజకవర్గాల ప్రజలకు ప్రభుత్వం చేయాల్సినంత చేయలేదు.

ఈ ఎన్నికల కంటే వచ్చే ఏడాది రాబోయే ఎన్నికలు టీఆర్ఎస్‌కి ప్రాణసంకటం కాబట్టి ఇప్పుడు ఆ పార్టీని ఓడగొడితే వచ్చే ఎన్నికల లోపు అన్ని పథకాలు ప్రజలకు వచ్చి వాలుతాయని కొందరు వాదిస్తున్నారు. కానీ ప్రభుత్వం పాటిస్తున్న ఈ విధానం స్వభావాన్ని అర్థం చేసుకోవడం అవసరం. మొదటగా ఇది ప్రతిపక్షాలను ఆదరించినందుకు ప్రజలపై కక్ష కట్టడం. రెండు, ప్రతిపక్షాలను లేకుండా చేయడానికి ప్రయత్నించడం. మూడు, ప్రజాధనాన్ని ఉపయోగించి అధినాయకుడి పట్ల ప్రజలలో లేని వ్యక్తిగత విధేయతను బలవంతంగా సృష్టించడం. అందుకే మెజారిటీ పథకాలు లబ్ధిదారులకు వ్యక్తిగతంగా ఉద్దేశించినవే. ప్రజల సామూహిక అవసరాలను తీర్చే ప్రాజెక్టులను చేపడితే ప్రజలు వ్యక్తిగతంగా విధేయులుగా ఉంటారనే హామీ లేదు. సామాజిక పరిస్థితులు మెరుగైతే ప్రభుత్వం మీద ఆధారపడాల్సిన అవసరమూ లేకపోవచ్చు. దీని పర్యవసానం ఏమంటే హక్కులు డిమాండ్ చేయగల పౌరులను, హక్కులు లేని లబ్ధిదారులుగా మార్చడం. కానీ బహుముఖ పోటీ వల్ల, ఏ ప్రభుత్వమైనా మూడో వంతు మంది ప్రజలను తాము లబ్ధిదారులుగా అనుకునేలా చేస్తే కనీసం ఇంకోసారి ఎన్నికల్లో అధికార పార్టీ లబ్ధిదారు అవుతుంది. కులాల వారీగా లబ్ధిదారులను తయారుచేయడం వల్ల ప్రతి కులం ఇతర కులంతో పోల్చుకుని తాము వివక్షకు గురవుతామని భావిస్తాయే తప్ప ప్రజలందరినీ మార్కెట్ దోపిడీ చేయడానికి ప్రభుత్వం సహకరిస్తున్నదనే వాస్తవాన్ని గుర్తించలేరు.

ఈ ఎన్నికలను తీవ్రంగా తీసుకోడానికి ప్రజలకు నిజాయితీగా ఒక్క కారణంగా కనిపించడం లేదు. అవతల పార్టీకి ఓటు వెయ్యకుండా ఉంచడానికి లంచమివ్వడం, గుర్తులను పోలిన గుర్తుల మీద పోటీ చేయడం, పోటీ చేయించడం, ఓట్లను చీల్చడానికి డమ్మీ అభ్యర్థిని నిలబెట్టడం రాజకీయ పార్టీల చతురతగా, వ్యూహంగా విశ్లేషకులు పరిగణించవచ్చు. కానీ ఇవన్నీ సమస్యల మీద ప్రజల గొంతు ఐక్యం కాకుండా అడ్డుకో వడం, వాళ్లను మరింత బలహీనపరచడం, అంతిమంగా ఓడించడానికి ప్రయత్నం చేయడం. రోజువారీ బతుకు పోరాటం అయిన సామాన్య ప్రజలపై రాజకీయాల ప్రభావం ఉండొచ్చు, కానీ వాళ్లకు రాజకీయ పార్టీలు లేవు. వాళ్ల ఓటమి ప్రజాస్వామ్య స్ఫూర్తికే ముప్పు.

**- హారతి వాగీశన్, మురళి కె.**

ప్రకటించటం వంటి పద్ధతుల్ని అనుసరించవచ్చు.

**ఇంకెంతకాలం ఈ దిగజారుడు బహిరంగ చర్చలు**

మునుగోడు ఉప ఎన్నికలో వ్యక్తిగత దూషణలు కూడా మిన్నుముట్టాయి. బఫూన్, గజదొంగ, దండుపాళ్యం బ్యాచ్ వంటి పదాలతో మనం నేతలుగా భావిస్తున్నవారు తిట్టుకున్నారు. పై ఎజెండాను అమలు చేస్తే, క్షేత్రస్థాయిలో, మీడియాలో బహిరంగ చర్చ ప్రమాణాలు కూడా ఎంతో మెరుగవుతాయి. ప్రజలు కూడా కొంత ఆలోచనతో, బాధ్యతతో ఓటు వేయగలుగుతారు. మునుగోడులో ఎన్నికల పరిశీలకుల దృష్టికి రాకుండా దొంగ లెక్కలకు పార్టీల వారు సీఏలను నియమించుకున్నారు. దొంగ లెక్కల సంతకాలతో మన దేశంలో అత్యధిక నేతల చట్టసభ ప్రస్థానం మొదలవుతోందని మాజీ ప్రధాని వాజ్‌పేయి అన్న మాటలు ఈవేళ మరింత వికృత పోకడలతో మనల్ని సవాలు చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో.. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికలు ముగిసిన కథ కాదు, అసలు కథకు ప్రారంభం! వీటిపై చర్చ కొనసాగాలి. ఇక్కడే కాదు దేశవ్యాప్తంగా జరగాలి. అన్ని పార్టీలకూ పాఠం కావాలి. ఎన్నికల, పాలనా సంస్కరణలకు నాంది కావాలి. ఎన్నికల సంఘమో, సుప్రీంకోర్టో ఈ సంస్కరణల్ని తేలేవు. పార్టీలు, మీడియా, సమాజం పట్టించుకోవాలి. జాతీయ స్థాయికి కూడా ఎదగాలనుకుంటున్న కేసీఆర్‌కు ఇది మరింత మంచి అవకాశం. జేపీ చెప్పినట్లు.. ఎన్నికల్లో ధనరాజకీయాలు మన దక్షిణాది రాష్ట్రాల నుంచే మొదలయ్యాయి. ఇంత ఉన్మాద స్థాయికి చేరుకున్నాయి. తెలుగు నేతలది ఇందులో పెద్ద పాత్ర. పరిష్కారం కూడా మన నుంచే మొదలవ్వాలి.

## క్షేత్రస్థాయి పరిశీలన-2

మేము వెళ్లిన 12 గ్రామాలలో ప్రజలంతా వచ్చే పోయే కార్లను, కొత్త వ్యక్తులను ఆశ్చర్యంగా చూస్తూ కనిపించారు. మాకు డజన్ల కొద్ది పెద్ద పెద్ద, చాలా విలువైన కొత్త కార్లు తిరుగుతూ కనిపించాయి. మేము కలిసిన ప్రజలందరు కూడా తమ గ్రామాలకు వచ్చే రాజకీయ పార్టీల నాయకులుగాని, అభ్యర్థులకు సంబంధించిన ప్రచార కార్యకర్తలుగాని తమ సమస్యలు ఏంటి, తాము ఏమి కోరుకుంటున్నారు అనే విషయం అసలు అడగడం లేదు అని తెలిపారు. తమ గ్రామానికి చెందిన బుడ్డ నాయకుడు ఫలానా పార్టీవారు ఓటుకు ఇంత ఇస్తామన్నారు, మీరు ఎంత ఇస్తారు అనే చర్చ, సంప్రదింపులు చాలా బహిరంగంగా వాళ్ల ముందే జరుపుతున్నారని తెలిపారు. చాలా గ్రామాలలో మాకు తాగునీటి సమస్య ఉందని చెప్పారు. చదువుకున్న యువకులు హైదరాబాద్‌కు వెళ్లి, ఏదైనా ఉద్యోగం దొరుకుతుందని ఆగమాగంగా తిరుగుతున్నారు. డిగ్రీ పాసైన వాళ్లు కూడా చాలామంది కొరియర్ సర్వీస్ సంస్థల్లో, డెలివరి బాయ్స్‌గా పనిచేస్తూ ఉన్నారన్నారు. చౌటుప్పల్ లేబర్ అడ్డాలో 500 మంది దాకా పని కోసం నిరీక్షిస్తూ కూర్చుంటే సాయంత్రం వరకు 100 మందికి మాత్రమే పని దొరుకుతుందన్నారు. చౌటుప్పల్‌లో చిన్న చిన్న పరిశ్రమలు చాలానే ఉన్నాయి. కాని ఆ పరిశ్రమల యజమానులు వాళ్ల వాళ్ల రాష్ట్రాల వాళ్లకే పనులు ఇస్తున్నారన్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన కార్మికుల బ్రోకర్లు వాళ్ల రాష్ట్రం వారినే పనికి తీసుకెళ్తారు అని చెప్పారు. గత రెండు దశాబ్దాలుగా చౌటుప్పల్‌లో ఒక డిగ్రీ కళాశాల స్థాపించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో పడకల సంఖ్య పెంచి అభివృద్ధి చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. డిండి ప్రాజెక్టులో ముంపు గ్రామాలైన చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం, లెంకెపల్లి, లక్ష్మీపురం గ్రామస్తులు గత కొన్ని మాసాలుగా తమ భూములకు నష్టపరిహారం, న్యాయబద్ధంగా రాలేదని మల్లన్నసాగర్ ముంపు రైతులకు ఇచ్చిన పద్ధతిలో ఇవ్వాలని కోరుతూ ధర్నాలు చేశారు.

ఈ విషయాలు ఏవీ చర్చలోకి రావడం లేదు. అసలు ఏ రాజకీయ పార్టీ కూడా ఎన్నిక ప్రణాళిక ప్రకటించలేదు. అక్కడక్కడ కనపడ్డ కరపత్రాలతో మునుగోడు వెనకబడింది, అభివృద్ధి చేస్తాం అన్న గాలికబుర్లు ఉన్నాయి తప్ప, నిర్దిష్టమైన ప్రాంత, ప్రజల సమస్యల అంశాలు ఏవీ లేవు. చాలాచోట్ల రోడ్డుషోలు తారసపడ్డాయి. ప్రజలంతా, పాఠశాల విద్యార్థులలాగా రోడ్డుకు రెండు పక్కల ఫర్లాంగుల దూరం కొద్ది క్రమశిక్షణతో బుద్ధిగా నిలబడి కనిపించారు. వాళ్లు అట్లాగే నిలబడి ఉంటే రాజకీయ వాహనాల కాన్వాయి వెళ్లిపోయిన తర్వాత వరుసగా క్రమశిక్షణతో డబ్బులు పంచుతారు అని తెలిసింది. మామూలుగా ఒకసారి నిలబడ్డ వాళ్లకు ఒక్కొక్కరికి రూ.300, నాయకుడికి ఆహ్వానంగా బతుకమ్మలు, బోనాల కుండలు తలపై పెట్టుకున్న మహిళలకు రూ.500 అందుతున్నాయి. వర్షం పడుతున్నా కూడా అట్లాగే నిలబడి ఉన్నారు. ఈ ప్రజలే అన్ని పార్టీలకు వాళ్లు పట్టుకున్న రాజకీయ పార్టీ జెండాలు మార్చుకుంటూ నిలబడుతున్నారు. ఈ ప్రక్రియ అన్ని గ్రామాలలో అన్ని ప్రధాన రోడ్లపై జరుగుతూనే ఉంది.

మునుగోడు ఉప ఎన్నిక దేశంలోనే అతి ఖర్చుతో కూడుకున్న ఎన్నిక కాబోతోంది. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో ఈ ఎన్నికలను ఒక నమూనాగా రాజకీయ పార్టీలు తీసుకునే అవకాశం లేకపోలేదు.

ఎవరు గెలుస్తారు అన్నది కాదు ముఖ్యం. 'సారం'లో ప్రజాస్వామ్యం ఇంతగా దిగజారిపోతే ఎట్లా అనేది ముఖ్యం. దాన్ని సంస్కరించడానికి, బుద్ధిజీవులుగా, పౌరులుగా, పౌర సంస్థలకు ఏమైనా బాధ్యత ఉందా అని ఆలోచిద్దాం. ఏమీ చేయలేము అనుకుంటే, నిశ్శబ్దంగా, నిస్సహాయంగా ఉంటే మనం కూడా ఇందుకు బాధ్యులం కావచ్చు అనే ఆలోచన మన మనస్సులను తొలచివేస్తుందేమో? ఇది కూడా ఆలోచిద్దాం.

**-యస్.జీవన్ కుమార్,**

**మానవ హక్కుల వేదిక (కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# ఉప ఎన్నిక పరిశీలన

ఒకప్పటిలా అభ్యర్థులు ప్రచారానికి మీడియాలో ప్రకటనలు ఇవ్వడం లేదు. పెయిడ్ వార్తలు వేయించుకుని భారీ మొత్తం చెల్లిస్తున్నారు. దీన్ని గుర్తించి నిరూపించడం అంత తేలిక కాదు. ఆలయాలు, కమ్యూనిటీ హాళ్లు, కుల సంఘ భవనాలు, పేదవారికి ఇళ్లు కట్టిస్తామని ఇచ్చే హామీలు ఎన్నికల్లో గెలిస్తే నెరవేరుస్తారు. పోలింగ్ ముగిసిన తర్వాత చేసే వ్యయంపై ఎవరి నిఘా ఉంటుంది? దేశంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికగా మునుగోడు నిలవబోతోంది. ఓటుకు ఎంత చెల్లించి కొనుక్కుంటారనేది పోలింగుకు రెండు, మూడు రోజుల ముందు తెలవొచ్చు. మొత్తం మీద ఉప్పెనలా ప్రవహిస్తున్న ధనం ఈసీ నియమావళిని అపహాస్యం చేస్తోంది.

2019 సాధారణ ఎన్నికల్లో రూ.50,000 కోట్ల బ్లాక్‌మనీ చేతులు మారిందని ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ మీడియా స్టడీస్' వెల్లడించింది. ఇవి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలని ఆందోళన వ్యక్తం చేసింది. ఆ తర్వాత జరగాల్సిన ప్రక్షాళన గురించి, డబ్బు, మద్యం ప్రలోభాలు లేని స్వేచ్ఛాయుత ఎన్నికల గురించి అనేక చర్చలు జరిగాయి. ప్రజలు మార్పు కోరుకుంటున్నా అందులో భాగస్వాములుగా ఉన్న రాజకీయ పార్టీలు పరివర్తనకు సిద్ధంగా లేనప్పుడు మునుగోడు లాంటి బై ఎలక్షన్లలో అభ్యర్థుల చెల్లింపు శక్తే జయాపజయాలను నిర్దేశిస్తుంది. ఇటువంటి ఎలక్షన్ నిర్వహించడం కంటే టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి ఎక్కువ 'వితరణ' కోట్ చేసిన అభ్యర్థి విజయం సాధించినట్లుగా ప్రకటించడం ఉత్తమం అని నిస్పృహతో కూడిన సూచనలు వినిపిస్తున్నాయి. ఇలా వచ్చిన డబ్బులో సగం ఓటర్ల ఖాతాలకు బదిలీ చేసి మిగిలిన మొత్తాన్ని అభివృద్ధి పనులకు వ్యయం చేసేలా రాజ్యాంగ సవరణ చేస్తే ఏ గొడవా ఉండదేమో! ప్రజాస్వామ్య విరుద్ధమనిపించినా జరుగుతున్నది అదే కదా!!

**- బీటీ గోవిందరెడ్డి,**
**సీనియర్ జర్నలిస్టు**

## మునుగోడు ఉప ఎన్నికపై వ్యంగ్య వ్యాఖ్యానం

ఈ మధ్య అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై, జనాభివృద్ధిపై, పేదరికంపై జరుగుతున్న పరిశీలనలు, చూపిస్తున్న సూచికలు విపక్షాల విమర్శల్లాగే తప్పు.. సరిగ్గా లేనట్లుంది... మొన్నటికి మొన్న ఆకలి సూచిలో 107 స్థానానికి మనను నెట్టాయి.

మునుగోడుకు ఆ బృందాలను పంపి పరిశీలించమనండి. వాళ్ల అంచనాలు తల్లకిందులైపోవూ!

ప్రజల శ్రేయస్సు కోరి నియోజకవర్గంలోనే తిరుగుతున్న రాష్ట్ర, కేంద్ర మంత్రులు... పొద్దున లేవగానే మంచిచెడ్డల పరామర్శలు, పనుల్లో పాలు పంచుకుంటూ వందలాది నాయకులు. (వెయ్యి ఓట్లున్న గ్రామంలో అన్ని పార్టీలు కలిపి.. 150 వాహనాలు.. నాలుగైదు వందల కార్యకర్తలు ఎప్పుడూ కనపడుతున్నారట)

**– ఇంతకు మించి పాలన ఏమి ఉంటుంది?**

తలలు తెగిపడుతున్న నాటుకోళ్లు, యాటలు... బిర్యానీ పొట్లాల పెళపెళలు... ఐదు రూపాయలకే భోజనం అని ఆహ్వానిస్తున్న హోటళ్లు

– ఆకలిసూచిక పొలమారుతోంది...

బస్సుల్లో తీసుకొచ్చి హైదరాబాద్‌లో కార్పొరేట్ వైద్యం చేయించడం, బంకుల్లో రెండు లీటర్ల ఫ్రీ పెట్రోల్, జనం చేసిన అప్పులు తీర్చడానికి ఆర్థిక సాయం, 20 వేల నుంచి 30 వేల దాకా నడుస్తున్న ఓటు వేలం పాట..

– మానవాభివృద్ధి సూచిక పరిగెత్తించడానికే కదా!

యాదాద్రి లాంటి గుళ్లలో ఫ్రీ దర్శనాలు (ప్రమాణానికే అనుకోండి), కాసిన్ని విందులతో ఆనంద విహారాలు, మంచింగ్‌లు, మందు బాటిళ్ల చప్పుళ్లు.

**– హ్యాపీ ఇండెక్స్ చిద్విలాసమే కదా!**

ఎలాగైనా జనం జేబుల్లో డబ్బు చేర్చాలని తహతహలాడే పార్టీలు 'హవాలా' రిస్కుకూ వెనుకాడడం లేదు... నిఘా కన్నులు కప్పి చెక్‌పోస్టులు దాటి... బైకుల ద్వారా... డొంకల్లో నుంచి... కోట్లు తీసుకువచ్చే ప్రయత్నాలు..

**– ఇంతకు మించి ప్రజాసేవ ఏముంటుంది?**

ఆరేళ్ల కిందట నల్లధనం బయటికి తెస్తానన్న మోదీ మాట విని నవ్వుకున్న వారు ఇప్పుడు... 'అరే వచ్చేసిందే' అని తెల్లబోతున్న సందర్భం.

మాది 'బంగారు తెలంగాణ' అన్న కేసీఆర్ మాట విని వెక్కిరించిన వారి ముఖంలో ఇప్పుడు 'నిజమే...'నన్న ఆశ్చర్యం.

సంపద పంపిణీ జరగాలని అరిచి అరిచీ అలసిపోయిన వామపక్షవాదుల కళ్లలో... ఆనంద బాష్పాలు.

పక్క నియోజకవర్గాలు కూడా తమ ఆనందానికి, అభివృద్ధి కోసమై రాజీనామా చేసే ఎమ్మెల్యేలల కోసం... ఉప ఎన్నికల కోసం... ఎదురుచూస్తున్న తరుణం.

**– ఇది కదా ప్రజాస్వామ్య ఔన్నత్యం..!**

ఇక్కడ కదా ఆనందాభివృద్ధి తూనికలు, కొలమానాలు, సూచికలు లెక్కగట్టాల్సింది..

**ఓ ఓటరు మాట..**

ప్రస్తుతం జాతర నడుస్తోంది. ఇప్పటిదాకా చేసిందేమీ లేదు, ఇక ఎవరు గెలిచి చేసేదేమీ లేదు... వారికి ఓట్లు గావాలే మాకు డబ్బులు కావాలే... మా అవకాశం మాది... వారి అవకాశం వారిది. ఇక్కడ మాకు నచ్చింది ఒకటే... '... మాకు పైసలిస్తున్నరు... అంతే.'

ఇప్పుడు 100 కోట్లు పెడితే తర్వాత రెండొందల కోట్లు సంపాయిస్తడు. వాళ్లకు పోయేదేముంది.. అభివృద్ధి లేదు పాడూ లేదు... ఇన్నేళ్లూ లేంది ఇప్పుడయితదా! ఎవడు డబ్బులిస్తే వాడికి ఓట్లెయ్యడం మంచిది... గొడవలేకుండా.

**– ఆహా... ఇది కదా ప్రజాస్వామ్య స్థితప్రజ్ఞత!**

(మన మంత్రి నిర్మలమ్మ భాషలో చెప్పాలంటే ప్రజాస్వామ్యం విలువ తగ్గల్లే... నాయకుల 'వ్యాల్యూ' పెరుగుతోంది అంతే... దానివల్లే ఇన్ని వెసులుబాట్లు)

'... పంచుతున్న డబ్బులన్నీ వాళ్లు కూలీనాలీ చేసి చెమటోడ్చి సంపాదించినవా? అంతా మా డబ్బే కదా ఇవ్వనివ్వండి...'.

**– ఇది కదా ప్రజాస్వామ్య పరిపక్వత!**

**- సరికొండ చలపతి (కర్టెసీ: సాక్షి)**






# బాలల క్రియాశీల వికాసమే భారత వికాసం: జేపీ

బాలలు వికసిస్తేనే భారతదేశం వికసిస్తుందని, బండెడు పుస్తకాలు మోసే విధానం పోయి ప్రాక్టికల్ విద్యావిధానం వచ్చినప్పుడే బాలల వికాసం సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రియ పిల్లల వార్షిక పండుగను జేపీ ముఖ్య అతిథిగా ప్రారంభించారు.

క్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి 8,405 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిండైన ఆత్మవిశ్వాసంతో తమలోని సృజనను, కళాత్మకతను ప్రదర్శించారు. రెండు రోజుల ఈ కార్యక్రమంలో మొదటిరోజు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో లఘునాటికలు, శాస్త్రీయ నృత్యం, వాద్య సంగీతం, ఏకపాత్రాభినయం, పోస్టర్ ప్రజంటేషన్, సైన్స్ ప్రయోగాలు, స్పెల్లింగ్, క్విజ్, డిబేట్, వ్యాస రచన, చిత్ర సమీక్ష, కథా రచన, కథా విశ్లేషణ, ఇంటర్నెట్‌లో అన్వేషణ, మ్యాప్ విభాగాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి సౌందర్యం, సముద్రతీరం, ప్లాస్టిక్ భూతం ఇలా పలు అంశాల్లో చిన్నారులు తమ సృజనాత్మతకను జోడించి అబ్బురపరిచారు.

లఘు నాటికల్లో చిన్నారుల పాత్రలు ఆలోచింపచేశాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహనే కాకుండా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు ధైర్యంగా సమాధానాలు చెప్పటం ఆకట్టుకుంది. అక్షరాలు దిద్దుకొని, గుణింతాలు నేర్చుకుని వాక్యాలు రాసే స్థాయికి వచ్చిన పిల్లలు సైతం కథ రచన పోటీలకు వచ్చారు. తెలుగు వాక్య నిర్మాణం, అక్షరాల పొందిక లాంటి అంశాల్నే కాకుండా భావాన్ని పరిగణలోకి తీసుకుంటే భవిష్యత్తులో చేయి తిరిగిన కథా రచయితలు అందివచ్చేందుకు ఇదొక మంచి వేదికని పలువురు అనుకోవటం కనిపించింది.

జేపీ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే నేర్చుకునే శక్తిసామర్థ్యాలు ఉంటాయని, పిల్లల్లో నైపుణ్యం పెంపొందించే బోధన సాగాలని, దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బాలల వికాసమే ధ్యేయంగా సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేస్తూ.. శాస్త్ర సాంకేతిక అంశాలను ఇనుమడింప చేసేలా క్రియ పిల్లల పండుగ జరగటం అభినందనీయమన్నారు. ఎవరూ పుట్టుకతో ఏదీ నేర్చుకోరని, కార్యదక్షత, కఠోర సాధనతోనే విజయాలు సాధించగలుగుతారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. క్రియ పండుగ నిర్వాహక కార్యదర్శి జగన్నాథరావు, సభ్యుడు రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ఓఎన్‌జీసీ ఈడీ ఆదేశ్ కుమార్, వాడ్రేవు చినవీరభద్రుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'నది లాంటి మనిషి' పుస్తకాన్ని ఆవిష్కరించారు.



**పబ్లిక్ ఫైనాన్స్ సంస్కరణలు 'కాగ్' ద్వారా సాధ్యం**

బ్రిటిష్ కాలంలో జరిగిన ఓ మంచిపనిని 'కాగ్' రూపంలో మనం స్వతంత్ర భారతంలోనూ కొనసాగిస్తున్నామని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆడిట్ దివస్ ముగింపు సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పబ్లిక్ ఫైనాన్స్‌లో అనేక సంస్కరణలు అవసరమని, అవి కాగ్ ద్వారా సాధ్యమన్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేని ఏకైక శాఖ కాగ్ అని, ఈ సంస్థపై ప్రజలకు అపార నమ్మకం ఉందన్నారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్స్ ఇందు అగర్వాల్ (ఆడిట్), చంద్రమౌళీ సింగ్ (ఎ అండ్ ఇ), విశ్రాంత ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ సుధీర్ కుమార్, డీఏజీలు కిషోర్ రెడ్డి, గౌతమ్ అల్లాడ, స్వరూప్, కల్లూరి భాస్కర్, ఇమాన్యుయేల్, ఆర్‌వీకే సాయిగాంధీ, పర్యవేక్షణాధికారి పేరం శ్రీనివాసరావు, సీనియర్ ఆడిట్ అధికారులు జితేంద్రనాథ్ శర్మ, అమర్ శంకర్, జి.శ్రీనివాస్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## ఓట్ జుగాడ్: డిసెంబర్ 2022
## ఓటర్లకు కనిపించని నిజాలు 2

**ప్రశ్న: ఎన్నికల సమయంలోనే ఓటర్లంతా "తాగుబోతులయిపోయి" తమయొక్క వెలకట్టలేని జీవితస్థిరాస్తి అయిన ఓటుని అయిదేళ్ల వరకూ "అమ్మేసుకుని" బానిసలుగా మారిపోతున్నారా ?**

<u>జుగాడ్ ఓటరుగా నా సమాధానం</u>: మనది ఓటర్లజాతి. అంతా మనోళ్లే! ఎవరినీ నిందించవద్దు! అత్యల్పసంఖ్యాకులైన కొద్దిమంది ఓటర్లు కులం, మతం, ప్రాంతం, భాష, యాస, మద్యం, మాంసం, లింగవివక్ష, పేదరికం మూఢనమ్మకాలు సోమరితనం, మొదలైన సామాజిక రుగ్మతలను రూపుమాపి "పాపపంకిలమైన" ఈ సమాజాన్ని "పునీతం" చేయడానికి కంకణంకట్టుకున్న ధనికవర్గానికి చెందిన స్వతంత్ర ఆలోచనాపరులు వార్తాపత్రికలూ ప్రసారమాధ్యమాల సాక్షిగా మనచే MLA / MP గా జాతీయ ఎన్నికల కమిషన్ ద్వారా ఎన్నుకోబడి, రాజ్యాంగవ్యవస్థలలో పనిచేస్తున్న కొంతమంది అనైతిక ప్రభుత్వోగుల సహకారంతో, దేశ రాజకీయాల్ని "ప్రజాస్వామ్యం (democracy) " పేరిట, అంతర్గత ప్రజాస్వామ్యం పాటించని పార్టీల పరస్పరవైరుధ్య భావజాలాలతో అత్యధిక సంఖ్యాకులైన పేదమధ్యతరగతి రైతులనూ, నిరుద్యోగులనూ, నిద్రాణంలో ఉన్న జుగాడ్ ఓటర్లనూ "మద్యానికీ డబ్బుకీ అమ్ముడుపోతున్న తాగుబోతులుగా అవహేళన చేస్తూ", రాజ్యాన్నేలుతున్నారు. ఇది పచ్చినిజం! నిస్సిగ్గుగా అంగీకరిద్దాం!

అవకాశవాద రాజకీయాల స్థానంలో నమూనా మార్పు (paradigm shift) తీసుకురా గలిగిన సంకల్పం ఉన్నవారే జుగాడ్ ఓటర్లు. వారే రాజ్యాధికారానికి అసలైన హక్కుదారులు. తమ కష్టార్జితమైన రెండు వేల రూపాయలు, లేదా అయిదువేల రూపాయలు, గరిష్టంగా పదివేలరూపాయలు ఒకే ఒకమారు విరాళమిచ్చి తమ పార్టీని "నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం" అనే సిద్ధాంతం ప్రాతిపదికపై నిర్మించుకుంటారు. పది వేల రూపాయిల విరాళదాత తనయొక్క సత్ప్రవర్తన విశ్వసనీయతతో తన సమీప బంధుమిత్రులనుండి కనీసం పదిమంది జుగాడ్ ఓటర్ల మద్దతు సేకరించుకోగలిగిన నాయకత్వ సామర్ధ్యం కలిగి ఉండాలి. జుగాడ్ (అధినేత రహిత) పార్టీకి పేరు పెట్టలేదు. జుగాడ్ ఓటర్ల మెజారిటీ ఓటు ప్రకారం పార్టీ నిర్వహించబడుతుంది. జుగాడ్ ఓటర్ వివాహితులైతే దంపతులిరువురికీ గుర్తింపు లభిస్తుంది. ఓటు మనది. బ్యాంకు మనది. పార్టీ మనది. అధికార పక్షం మనది. అధికారం మనది. ప్రతిపక్షమూ మనదే!

**రండి! జుగాడ్ ఓటర్ల స్వచ్ఛ రాజకీయానికి(జుగాడ్ 50: 50) స్వాగతం పలకండి!**

Please contact: (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

ADVT

# మార్పు ఆలస్యం కావొచ్చు కానీ.. రావడం తథ్యం

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో కటారి శ్రీనివాసరావు ముఖాముఖి (మొదటిభాగం)

**కటారి : లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభానికి ముందు 25 సంవత్సరాలలో మీలో జరిగిన అంతర్మథనాన్ని వివరిస్తారా?**

**జేపీ:** నా జీవితాన్ని1972-73లో ఉన్న పరిస్థితులు ప్రభావితం చేశాయి. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 25 ఏళ్లు గడిచాయి..అవినీతి ఇంకా అలానే ఉంది. ఇంకా పెరుగుతోంది. నిరుద్యోగం ఉంది, బీదరికం ఉంది. ఈ మూడూ ప్రధానంగా ఉన్నాయి. దాని చుట్టూనే గుజరాత్‌లో నవనిర్మాణ్ సమితి, బీహార్‌లో లోక్‌నాయక్ జేపీ ఆధ్వర్యంలో ఛాత్ర్ సంఘర్ష్ పరిషత్ ఉద్యమం. నితీష్‌కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ వీళ్లంతా ఆ ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లే . వీళ్లంతా పాట్నా యూనివర్శిటీలో విద్యార్థి సంఘం నేతలుగా ఉండేవారు. అరుణ్ జైట్లీ ఢిల్లీలో ఉండేవాడు. వీళ్లంతా ఉద్యమాలు చేయడం జైళ్లకు పోవడం ఉండేది. అప్పడసలు మన ప్రజాస్వామ్యంలో ఏం జరుగుతోందనే ఆలోచన మొదలైంది. అప్పట్లో సోషల్ మీడియా లేదు. పంచాయతీ ఆఫీసుకు ఓ పత్రిక వచ్చేది. అది చూస్తే ఏంటో కూడా అర్థం అయ్యేది కాదు. 13 ఏళ్ల వయస్సులో నేను స్కూలు నుంచి బయటకు వచ్చాను. బయటకు వచ్చే నాటికి ప్రపంచం గురించి ఏమీ తెలియదు. ఏదో సివిక్స్ పాఠ్య పుస్తకాల్లో రాజ్యాంగం, రాష్ట్రపతి, హక్కులు , విధులు వాటి గురించి చెబుతారో అదేంటో అర్థం కాకపోయినా కొంత నేర్చుకునే ప్రయత్నం చేశాం. అంతకు మించి తెలియదు. కానీ 1972-73లో నా వరకు నాకు మొదటిసారిగా విప్పారిన కళ్లతో మన దేశాన్ని, మన సమాజాన్ని, మన జీవితానికి ఈ ప్రభుత్వ వ్యవస్థకి ఉన్న సంబంధాన్ని, అన్నిటిని మించి ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాల్లో ఏం జరుగుతోందన్న పరిశీలన చేశాను. అది చదవడం మొదలు పెట్టగానే అక్కడ అలా ఉంటే మరి ఇక్కడ ఎందుకు ఇలా ఉంది..ఇదీ ప్రజాస్వామ్యమే..అదీ ప్రజాస్వామ్యమే కదా?.. అక్కడి నుంచి అంతర్మథనం మొదలైంది. అది నా జీవిత గమ్యాన్ని మార్చింది. ఒక డాక్టరుగా వెళ్లాల్సిన నేను ఈ తృష్ణ నుంచి ఈ అన్వేషణ నుంచి ఐఏఎస్ వైపు వెళ్లాను. అప్పటి నుంచి స్వర్ణోత్సవం వచ్చే నాటికి అవగాహన పైపై నుంచి చూడడం కాకుండా..ఎవర్నో తిట్టిపోయడం కాకుండా..లోతుగా సాగింది.

1977లో ఇందిరా గాంధీ దేశం నుంచి పోతే దేశం అద్భుతంగా అవుతుందని నిజంగా ఆశపడ్డాం. ఇప్పటికి కూడా చాలా మంది మోదీ పోతే బ్రహ్మాండంగా ఉంటుంది, మన్మోహన్ సింగ్ పోతే బ్రహ్మాండంగా ఉంటుంది, కేసీఆర్ పోతే బ్రహ్మాండంగా ఉంటుంది..జగనో, చంద్రబాబో పోతే బ్రహ్మాండంగా ఉంటుందని ఆలోచిస్తారు. ఇవన్నీ పరిణతి గల ఆలోచనలు కావు..వ్యవస్థ గురించి కాకుండా వ్యక్తుల గురించి ఆలోచిస్తున్నాం.




ఆ తర్వాత ప్రభుత్వంలో ఉన్న కాలంలో నాకు ఆ అవకాశం దొరికింది. కొంత చేసే అవకాశం దొరికింది..అంతకు మించి లోతుగా అధ్యయనం చేసి అసలు ఎక్కడుంది లోపం.. మనుషులంతా దుర్మార్గులు కాదు..అధికారులు కానీ నాయకులు కానీ మరొకరు కానీ..వ్యవస్థలో ఏం లోపాలున్నాయి. దాన్ని సరిజేయడం ఎలా అనే అవగాహన వచ్చింది. ఏ చెట్టు లేని చోట

ఆముదం వృక్షమే మహా వృక్షం కాబట్టి మనం కొద్ది పనులు చేస్తే ప్రజలు ఎక్కువగా అనుకుని గౌరవించడం, విశ్వసనీయత పెరగడం. దాన్నుంచి మార్పు సాధించాలని 50 ఏళ్లకు లోక్‌సత్తా ఉద్యమం వచ్చింది.

**ప్రశ్న: ఏదైనా విషయం తెలుసుకోవాలంటే ఈ రోజుల్లో ఉన్నన్ని అవకాశాలు అప్పట్లో లేవు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన మీరు ఇన్ని అంశాలను తెలుసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశారు, సమగ్రమైన దృక్పథానికి ఎలా రాగలిగారు?**

**జేపీ :** 1969లో 13 ఏళ్ల వయస్సులో నేను స్కూలు నుంచి బయటకు వచ్చాను. 1972 నుంచి రోజుకో పుస్తకం చొప్పున విపరీతంగా చదివాను. చాలా కాలం పాటు 14..15 పేపర్లు చదివాను. ఎడిట్ పేజీలో ఉన్న ఆర్టికల్స్, మిగతా వార్తలు అన్నీ చదివే వాడ్ని. ఆ రోజుల్లో రెండు చిన్న పత్రికలు ఉండేవి. హిమ్మత్ అని రాజమోహన్‌గాంధీ ఎడిట్ చేసేవారు. మెయిన్ స్ట్రీమ్ అని నిఖిల్‌చక్రవర్తి ఎడిట్ చేసేవారు. ఆ రెండు పత్రికలు పూర్తిగా చదివేవాడ్ని. అన్నిటిని మించి రోజుకు ఏడెనిమిది గంటలు బీబీసీ రేడియో వినేవాడ్ని. ప్రపంచంలో చీమ చిటుక్కు మంటే ఏ విషయం అయినా తెలిసే కొద్దిమందిలో నేను ఒకడ్ని . దాంతో బహుశా 1974-75లో ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను పదిమంది వింటే అందులో నేను ఉంటాను. దానిలో ఏమాత్రం సందేహం లేదు. ఈ రోజు ఉన్నటువంటి అవకాశాలు లేకపోయినా లయోలా నా కళ్లు తెరిపించింది. విశాలమైన ప్రపంచాన్ని చూపెట్టింది. పుస్తకాలు బట్టీపట్టడమో, మార్కులు తెచ్చుకోవడమో కాకుండా ప్రపంచాన్ని అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ తర్వాత వైద్యకళాశాలకు వెళ్లిన తర్వాత మనమీద మనం ఆధారపడతాం. హాస్టల్‌లోని రీడింగ్ రూమ్‌లో అన్ని పుస్తకాలు ఉంటాయి. ఉన్నంతలోనే పుస్తకాలు విపరీతంగా అధ్యయనం చేయడం, ఏడెనిమిదేళ్ల పాటు 300 పేజీల పుస్తకం రోజుకొకటి చొప్పున చదివేసేవాడ్ని. నేర్చుకోవాలి, తెలుసుకోవాలనే తపన ఉండేది.

**ప్రశ్న: సివిల్ సర్వీసులో చేరిన తర్వాత ఎలాంటి మార్పు వచ్చింది?**

**జేపీ :** చాలా కొద్ది కాలంలోనే లోతు ఏంటో తెలిసింది. పది పన్నెండేళ్లు పరిష్కారాల కోసం వెతికాను. పరిపాలనకు, రాజకీయానికి, ఆర్థిక వ్యవస్థకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. అది ఎలా నడుస్తోంది..కాగితాల మీద చెప్పేదేంటి? వాస్తవంగా జరుగుతుందేంటి? చట్టబద్ధ పాలన కాగితం మీద బ్రహ్మాండంగా ఉంటుంది. కానీ నిజంగా జరిగేదేంటి..లోతుకి వెళ్తే కానీ మనకు అవగాహన రాదు. ప్రభుత్వ ఉద్యోగాల వల్ల కొంత చేయొచ్చు.. చేయలేకపోవచ్చు. కానీ నేర్చుకోవడానికి, నేర్చుకోవాలనే మనసు ఉంటే మాత్రం ప్రభుత్వ ఉద్యోగం ఓ అద్భుతమైన అవకాశం. చాలా వేగంగా, సమగ్రంగా అవగాహన రావడానికి ప్రభుత్వ ఉద్యోగం దోహదం చేస్తుంది.

**ప్రశ్న: సివిల్ సర్వీసెస్ నుంచి బయటకు వచ్చేసేనాటికే మీకు పూర్తి స్థాయి అవగాహన ఉంది. రాజకీయ, పాలన పరమైన సంస్కరణలే అజెండాగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించారు..వీటినే ప్రధానాంశాలుగా తీసుకోవడానికి గల కారణం?**

**జేపీ:** మన లక్ష్యమేమో వ్యవస్థలో సమగ్రమైన మార్పు. అధికార వికేంద్రీకరణ, ఎన్నికల వ్యవస్థ, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం, రూల్ ఆఫ్ లా, జవాబుదారీ తనం ఇవన్నీ సామాన్య జనానికి పట్టేవి కావు. ఎక్కడో స్విచ్ వేస్తే లైటు వెలుగుతుంది. స్విచ్‌కు లైట్‌కు సంబంధం ఉండదు. లోతుగా అధ్యయనం చేయాలి..మధ్యలో బోల్డన్ని లింక్‌లు ఉన్నాయి. ప్రజలకు చివరకు కావాల్సింది ఏంటి? జీవితంలో నాకు ఏమౌతుంది అనేది మాత్రమే. కాబట్టి ఆ అంశాలకు వెళ్లకపోతే సమాజాన్ని సంఘటితం చేయడం సాధ్యం కాదు. అందరికీ లోతు తెలియకపోవచ్చు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో కూడా చాలా మందికి చాలా విషయాల్లో లోతైన అవగాహన ఉండదు. ప్రజాస్వామ్యంలో ఏదేశంలో అయినా ఓటేస్తాం కానీ లోతైన అవగాహన ఉండదు...దాని అవసరం కూడా ఉండదు..కొంతమందికి తెలుస్తుందంతే. ధరలు పెరుగుతున్నాయి, ప్రభుత్వాఫీసులో పని జరగడం లేదు..లంచం తీసుకుంటున్నారు. చదువు సరిగా అబ్బడం లేదు..రోడ్లు అధ్వానంగా ఉన్నాయి..ఇవన్నీ అర్థం అవుతాయి..అందుచేత 1998 అక్టోబర్ 2 తేదీన పెట్రోలు బంకుల ఉద్యమం అద్భుతమైన ఫలితాలు తీసుకొచ్చింది. గాంధీ ఆ రోజు ఉప్పు సత్యాగ్రహం చేపట్టారు. ఉప్పు కూడా ఆ దేశం నుంచి రావాలని బ్రిటీషువాళ్లు ఉప్పుపై పన్ను వేశారు..శేరు..మూడు పైసలు ఉండేది. అప్పటి మన సమాజంలో మూడు పైసలు చాలా భారం. నా చిన్ననాడు జేబులో రెండు రూపాయలు ఉండడం చాలా గొప్ప విషయం. అంత పెద్ద సామ్రాజ్యాన్ని ఎదిరించడానికి గాంధీజీ ఉప్పును సాధనంగా చేసుకున్నారు. పెట్రోలు బంకుల్లో మోసం జరుగుతోందని మన అందరికీ తెలుసు. మోసం జరుగుతోందని నినదిస్తే చాలదు. మన చేతుల్లో ఒక ఆయుధం కావాలి. కాకతాళీయంగా వామపక్ష ఎమ్మెల్యే గారు ఒకరు నా దగ్గరకు వచ్చారు..పెట్రోలు బంకుల్లో పనిచేసేవారికి జీతాలు పెద్దగా ఇవ్వరు..కమీషన్లు ఇస్తారు. ఎంత అమ్ముడు పోయిందో దాన్ని బట్టి కమీషన్లు ఇస్తారు. యజమానులు ఏం చేస్తున్నారు..పెట్రోలు ట్యాంకులో పోసింది ఎంతో తెలుసు..మీటరుల్లో ఎక్కువ ఉంటుంది. మీటరులో ఉన్నది కాకుండా ట్యాంకుల్లో ఉన్నది ఇస్తున్నారు..ఈ తేడా ఉంది. ..మీటరు ప్రకారం ఇవ్వాలి కదా ..అన్యాయం జరుగుతోందని ఆ ఎమ్మెల్యేగారు నా దగ్గరకొచ్చారు. నేను దాన్నుంచి వెళ్లాను..మీటరు ప్రకారం పొయ్యాలి కదా..అంటే ఆ విషయం తర్వాత చూద్దాం..అన్నారు. ఈ విషయం మీకు నాకు తెలుసు. కానీ కొంచెం లోతుగా వెళితే..ఓ అధికారిగా నాకు ఓ కొత్త విషయం తెలిసింది. ఓ వినియోగదారుడు ఓ పాత్రలో పెట్రోలు పోయమని అడిగే అధికారం ఉంది. అది తెలియగానే మన చేతికి ఒక ఆయుధం దొరికింది. మీటరులో ఎంత ఉంది..ఈ పాత్రలో ఎంత ఉందనే తేడా తెలిసిపోతుంది. 1998లో లోక్‌సత్తా ఆ పని చేసింది దాంతో పదిహేను రోజుల్లో ఉమ్మడి రాష్ట్రంలో అన్ని పెట్రోలు బంకుల్లో మీటర్లు సవరించేశారు. మనం తలుచుకుంటే ఏం చేయొచ్చు అనేదానికి ఇదే పెద్ద ఉదాహరణ. 1998 నుంచి ఇప్పటి వరకు 24 ఏళ్లు అయ్యింది. సగటున ఏడాదికి రూ. 50

వేల కోట్లు మిగిలింది. ఈ లెక్కన 24 ఏళ్లలో రూ. 12 లక్షల కోట్లు ఈ చిన్న ప్రయత్నం వల్ల మిగిలింది. కొద్ది మంది ఒక చిన్న ప్రయత్నం చేయగానే ఆయిల్ కంపెనీలు పూనుకుని దేశం మొత్తం మీద పెట్రోలు బంకుల్ని మార్చాయి. ఇప్పుడూ తూకంలో మోసం ఉంది. కానీ అప్పుడు పదిశాతం ఉన్నది ఇప్పుడు 1.5 శాతం ఉంది. అంటే 8.5 శాతం మోసాన్ని అరికట్టాం.

లక్ష్యాలు చాలా పెద్దవి అయినా కూడా ప్రజలు అందులో సంఘటితం కావాలంటే మనకు అర్థం అయ్యే రీతిలో, ఫలితం వచ్చే రీతిలో చేయకపోనట్టయితే సమీకరించడం సాధ్యం కాదు. ఆ ప్రయత్నాలు జరిగాయి కాబట్టే, అందరూ కృషి చేశారు కాబట్టే కొన్ని లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. బహుశా దేశంలో ఇంతమంది భాగస్వామ్యంతో 15-20 ఏళ్లు పనిచేసిన సంస్థ భారతదేశంలో మరొకటి లేదు. దానికి కారణం ఏంటంటే మనసు పెట్టి సమాజంలో అందరూ కూడా కలిసొచ్చారు. ఈ సమాజంలో లక్షలాది మందికి పరిస్థితులు బాగుపడాలని కోరిక ఉంది. మార్గం గోచరించాలి. కార్యాచరణ గోచరించాలి. ప్రజాస్వామ్యం గురించి మనం నిరాశ చెందాల్సిన అవసరం లేదు. మార్గాన్ని చూపే శక్తి మనకు ఉందా? లోతుగా ఆలోచిస్తున్నామా? పైపైన నినాదాలిస్తున్నామా? దానిపై ఆధారపడి ఉంటుంది. కచ్చితంగా అందుకే నేను గొప్ప ఆశావాదిని.

**ప్రశ్న: దేశంలో చాలా స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి.. చాలా సంస్థలు ఒకటి రెండు అంశాలకే పరిమితమయ్యాయి. కానీ లోక్‌సత్తా అనేక అంశాల మీద పనిచేసింది. చాలా మార్పులకు దిక్సూచిగా ఉంది. అయితే అవి ఇంకా ప్రజలకు చేరలేదు. ఆ భాషను ఇంకా అర్థం చేసుకోవడం లేదనే విమర్శ ఉంది.**


**జేపీ:** ప్రతీ ప్రజాస్వామ్య దేశంలో ఇది వాస్తవం. వందల సంవత్సరాల ప్రజాస్వామ్య చరిత్ర, సంపద ఉన్న అమెరికాలో ఏం జరుగుతోంది. వర్ణం, ఇతర సంకుచిత కారణాల వల్ల ఆ సమాజం ఎంత ముక్కలైపోయిందో చూడండి. లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభించినప్పుడు నేను వేసిన అంచనా, అనుభవం లేక చేసిన పొరపాటు ఏమైనా ఉంటే శరవేగంగా మార్పులు వచ్చేస్తాయనే ఊహ. ఐదేళ్లలో మార్పులు వస్తాయని ఆనాడు నమ్మాను..అదే చెప్పాను. కానీ ప్రజాస్వామ్యం అంత వేగంగా మార్పు వచ్చేది కాదు. రెండోది ప్రజాస్వామ్యం అంత సంక్లిష్టమైన వ్యవస్థ ఇంకోటి లేదు. మన ఇంట్లోనే నలుగురు ఉంటే వారిలోనే అనేక అనుమానాలు, అసూయ, ద్వేషాలు, కోపాలు, వర్గాలు ఉంటాయి..అలాంటిది ముక్కు ముఖం తెలియని కోట్ల మంది కులాలు, మతాలు, ప్రాంతాలు వాళ్ల ఆలోచనలు, వారి నేపథ్యాలు వేరు, పెరిగిన వాతావరణం వేరు వీళ్లందరూ కలిసి ఉమ్మడిగా నిర్ణయం చేసుకోవడం అనేది ఎంత సంక్లిష్టమో మనం చాలా సందర్భాల్లో ఊహించం. రెండోది స్వతంత్ర పోరాటంలో మన నాయకులు చెప్పింది ఏంటి? తెల్లోడు అక్కడి నుంచి వచ్చి పెత్తనం చేయడం ఏంటయ్యా..వాడు పోయి మనమీద మనం పెత్తనం చేసుకుందామని. అంతేగా..అయితే ఇది ప్రజలకు అర్థం కావడానికి ఎన్నేళ్లు పట్టింది. మహాత్మాగాంధీ వచ్చి జనం దగ్గరకు తీసుకెళ్లి వినూత్నమైన పంథాలో సంఘటితం చేస్తే తప్ప సమాజం ఏకం కాలేకపోయింది. కాబట్టి ఇది ఆశ్చర్యం కాదు. కాకపోతే మనకు నైపుణ్యం ఎక్కువ ఉంటే మరింత వేగంగా చేయొచ్చు. ప్రయత్నం జరగాలి. కానీ ఈ పరిణామం అనివార్యం. అందున మనదేశంలో ఏం చేశామంటే ప్రజాస్వామ్యాన్ని ప్రజలకు అందనంత దూరంలో పెట్టాం. కేవలం ఓటుకే పరిమితం చేశాం. మన దేశంలో ప్రజాస్వామ్యం ఓటులో ఉంది. అరిచే స్వేచ్ఛలో, నిరసనలో ఉంది. ఇంక ఎక్కడా ప్రజాస్వామ్యం లేదు. స్వయం పాలన, చట్టబద్ధ పాలన ఈ దేశంలో ఉందని ఇవాళ ఎవరైనా చెప్పగలరా? నేరం చేస్తే ఎవడైనా ఒక్కటే అనేది అమెరికాలో చేయగలిగారు. కానీ మనదేశంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. అధికారం ఉంటే ఏ నేరం చేసినా సమసిపోతోంది..విమర్శ చేస్తే చిన్నదాన్ని కూడా పెద్దదిగా చూపించి గందరగోళం జరుగుతుంది. సామాన్యుడికి ఒక న్యాయం..సంపన్నుడికి ఒక న్యాయం. చట్టబద్ధ పాలన లేకపోతే ప్రజాస్వామ్యం కాజాలదు. ప్రజలకు నిజమైన భాగస్వామ్యం లేదు. మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు అర్జీలు పట్టుకుని అభ్యర్థించడం తప్ప . ఇది ప్రజాస్వామ్యం కాజాలదు. మనకంటే చైనా ఆ విషయంలో చాలా మెరుగు. అధికారాన్ని ఎప్పుడైతే కేంద్రీకరించామో ఈ ప్రజాస్వామ్యం అంటే ఏంటో అర్థం కావడం లేదు. ఓటు వల్ల ఏం జరుగుతుందో తెలియక పన్నులు ఏం కడుతున్నామో అర్థం కాక మనం ఎంత చెప్పినా కూడా అనుభవం లేకపోవడం చేత మార్పు మరింత నెమ్మదిగా అవుతుంది. మామూలుగానే చాలా నెమ్మదిగా అవుతుంది. మన దేశంలో ఒక దేశంగా చేసిన పొరపాట్ల వల్ల స్వయంకృతాపరాధం వల్ల మరింత ఆలస్యం అవుతుంది. అందువల్ల మనం మొదలు పెట్టినప్పుడు కచ్చితంగా రెండుశాతం మందికి అర్థం అయి ఉంటుంది. వాళ్లంతా అభిమానం, గౌరవం వల్ల బాగానే ఉంది..అని చెప్పడం తప్ప లోతైన అవగాహన లేదు. ఇవాళ ఓ పది శాతానికి వెళ్లింది. అంతకంటే ఎక్కువ వెళ్లిందని నేను అనుకోవడం లేదు. పదిశాతం కూడా చాలా గొప్ప సంఖ్య. కొన్ని సినిమాల్లో కూడా మనం చెప్పిన అంశాలను డైలాగుల్లా చెప్పించారు. క్రమక్రమంగా ప్రజల్లోకి వెళుతోంది..అయితే అనుకున్నంత వేగంగా వెళ్లడం లేదు. ఇది వాస్తవం. కానీ నిరాశ పడకూడదు. అది ఎక్కువగా జరుగుతుందని అనుకోవడం మన అనుభవ రాహిత్యం. నేను చాలా ఆశావాదిని. కచ్చితంగా ఈ దేశంలో కొన్ని మంచి మార్పులు వస్తున్నాయి..ఉదాహరణకు ఆ రోజుల్లో రిజిస్ట్రేషన్లలో ఆలస్యం, అవినీతి లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం అందేది కాదు. పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చాయా? అని నేను ప్రతీ సమావేశంలో అడిగేవాడ్ని. ఒక్కరైనా లంచం లేకుండా తెచ్చుకున్నారా అంటే ఒక్కరూ చెయ్యి ఎత్తలేకపోయారు..ఇవాళ మనం గట్టిగా చెప్పగలం. తెలంగాణలో ఈవేళ లంచం లేకుండా పాస్‌పుస్తకాలు అందుతున్నాయి. అయితే అనుకున్నవన్నీ అంత వేగంగా జరగవు. దాన్ని మరింత సమర్థవంతంగా పరిస్థితుల్ని అర్థం చేసుకుని వేగిర పర్చాలి. **(ఇంకా ఉంది...)**

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జూలై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

ఒకపక్క ప్రయివేటు రంగం ప్రస్తుతం 75 శాతం జనాభా అవసరాలను తీరుస్తూ, మరోవైపు ఎన్.సి.డిల భారం పెరుగుతున్న నేపథ్యంలో.. తృతీయ స్థాయి చికిత్సలో ఆయుష్మాన్ భారత్ వంటి ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ పద్ధతులను అనుసరించటం వల్ల వ్యయం పెరుగుతూ అదుపుతప్పటం అనివార్యమని అమెరికా అనుభవం స్పష్టంగా తెలియచేస్తోంది. అధ్యాయం 3లో చర్చించినట్లు, ప్రయివేటు నిధుల ఇన్సూరెన్స్ నమూనాల్లో వేగంగా పెరిగిపోయే వ్యయాలకు ఎక్కువ ఆరోగ్య రిస్కు ఉన్నవారిని తొలగించే క్రీమ్ స్కిమ్మింగ్, ప్రతికూల ఎంపికే కారణాలు. సమాచార అంతరంతోపాటు, తగిన పర్యవేక్షణ చేయటంలో బీమా సంస్థల నిస్సహాయత, అవసరంలేని రోగ నిర్ధారణ పరీక్షలు, మితిమీరిన చికిత్సలు.. అనైతిక చికిత్సలకు దారితీస్తుంది. పటిష్ఠ వ్యవస్థ, జవాబుదారీ సంస్కృతి ఉన్నా కూడా అమెరికాలో అవి జాడ్యాలుగా మారాయి. దీనికితోడు, బీమా సంస్థ, వైద్యులు లాలూచీ పడి అదనపు కిస్తీ భారాన్ని రోగులపైకి మళ్లించవచ్చు. అమెరికన్ వ్యవస్థ వైఫల్యం నుండి నేర్చుకోవటం, తద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు పెద్దగా మెరుగుపడకుండా ఆరోగ్య బడ్జెట్ పెరిగిపోయే ప్రమాదాలను నివారించుకోవటం మనకు అవసరం. మరోవైపు, ఆస్పత్రి ఆరోగ్య వ్యవస్థలో ఎక్కువ శాతం ప్రభుత్వ రంగంలో ఉన్న బ్రిటన్ నమూనా.. వ్యయానికి తగ్గ ప్రయోజనాలనందించటంలో ఆశావహంగా ఉంది. కాబట్టి, దేశంలో ప్రభుత్వ తృతీయ స్థాయి ఆరోగ్య వ్యవస్థ నాణ్యతని మెరుగుపరచటం, అందరికీ అందుబాటులోకి తేవటం మనం తక్షణం చేయాల్సిన పని. ప్రభుత్వానికి అది దీర్ఘకాలంలో ఫలితాలకు తగ్గ వ్యయంగా ఉండాలి, పౌరులందరికీ తక్కువ ఖర్చుతో, అందుబాటులో ఉండాలి.

**6.2. భారత్‌లో ప్రభుత్వ తృతీయ స్థాయి చికిత్స**

ఆరోగ్యం అందించటానికి మార్గంగా ఆరోగ్య బీమాపై మితిమీరి ఆధారపడటం వివేకవంతమైన పని కాదు. ఆర్థికంగా మనగలిగేదీ కాదు. ఎందుకంటే, ఆరోగ్య బీమా.. వ్యాధి భారాన్ని తగ్గించకుండా కేవలం ప్రజారోగ్య వైఫల్య లక్షణాలపై పనిచేస్తుంది. వ్యాధి భారంలో చాలా మేర ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ వైఫల్యం వల్లే కలుగుతుంది. ప్రభుత్వ నిధులతో ప్రయివేటు తృతీయ స్థాయి వైద్యం అంతిమంగా ప్రభుత్వ ఆరోగ్య బడ్జెట్‌లలో అత్యధికాన్ని ఖాళీ చేస్తుంది. దీనివల్ల ప్రాథమిక, నివారణ వైద్యం మూల్యం చెల్లిస్తుంది. నివారణ వైద్యంలో వైఫల్యం.. చికిత్స వైద్యంలో ఖర్చు పెంపునకే దారితీస్తుంది. ప్రాథమిక, ద్వితీయ స్థాయిల్లో పెట్టే ఖర్చులు.. తృతీయ స్థాయిలో భర్తీ (రీఇంబర్స్‌మెంట్) కంటే తక్కువ కాబట్టి, ఖజానాపరంగా చూస్తే, ఆస్పత్రి చేరికల్ని నివారించటమే మెరుగైన ఫలితమవుతుంది. ఇంతకు ముందే చెప్పినట్లు, మూడో దశ వైద్యంలో చేసే వ్యయం వల్ల ఒనగూడే ఫలితం.. ప్రాథమిక, ద్వితీయ స్థాయిల్లో అదే వ్యయాన్ని చేస్తే వచ్చే ఫలితం కంటే ఎంతో

తక్కువ. చికిత్స ఖర్చుల ఆర్థిక భారం నుండి కొన్ని కుటుంబాలు ఉపశమనం పొందవచ్చేమో గానీ, మొత్తంగా దేశ ఆరోగ్య రంగంలో ఫలితాల్లో ఎటువంటి చెప్పుకోదగిన మెరుగుదల లేకుండా ఖజానా త్వరలోనే ఖాళీ అయిపోతుంది. దానికి బదులు, మౌలికంగా ప్రభుత్వ రంగ సంస్థలకు పాత్ర కల్పిస్తూ, తృతీయ స్థాయి చికిత్సలో భారతదేశం ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ విధానం (రిస్క్ పూలింగ్) నమూనాలని రూపొందించుకోవటం అవసరం. డబ్బు రోగిని అనుసరిస్తూ, సేవలకనుగుణంగా ప్రభుత్వాస్పత్రులు, సేవల ప్రాతిపదికన ఆరోగ్య వృత్తిదారులకు కొంత మేర ప్రతిఫలాలు ఉండే నమూనాలో ప్రోత్సాహకాలు సమూలంగా మారతాయి, సేవలు మెరుగవుతాయి. ఆ రకమైన ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ విధానం ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి, పేదలు ఊపిరి పీల్చుకునేలా చేస్తుంది.

అయితే, నిధుల లేమి, ప్రభుత్వ సదుపాయాల్లో విపరీత రద్దీ భారత్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో తృతీయ స్థాయి వైద్య వ్యవస్థకు ఒక పెద్ద అవరోధంగా ఉన్నాయి. పట్టిక 6.2లో చూపినట్లు, ప్రభుత్వ ఆస్పత్రులు రోజుకు 500 నుండి 10,000కు పైగా ఔట్‌పేషెంట్లను చూస్తున్నాయి. అత్యంత నిపుణులైన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది జీతాలు బాగా తక్కువగా ఉన్నాయి, పని పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. దీనివల్ల అసలే అంతంత మాత్రంగా ఉన్న మౌలిక వసతులు, రోగ నిర్ధారణలు, వైద్య, చికిత్స, ప్రజల్లో విశ్వాసం మరింత దిగజారాయి, నైపుణ్యాలు ప్రయివేటు రంగం వైపు మళ్లటం మరింత ఊపందుకుంది.

**(పట్టిక 6.2: ఎంపిక చేసిన ప్రభుత్వ ఆస్పత్రుల ఇన్-పేషెంట్, ఔట్-పేషెంట్‌ల వివరాలు)**

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక బోధన, జిల్లా ఆస్పత్రులపై ఎఫ్.డి.ఆర్ చేసిన అధ్యయనంలో, వాటిల్లో నెలకొన్న నిధులు, సిబ్బంది కొరత స్పష్టంగా వెల్లడైంది. వాటిల్లోని ఆరోగ్య ఫలితాల్ని నిష్పాక్షికంగా బేరీజు వేసి చూస్తే.. కొరతలున్నప్పటికీ, వ్యయం చేస్తున్న ఆ పరిమిత డబ్బుకి కూడా మంచి విలువ సమకూరుతోందని తేలింది. పైన చర్చించినట్లు, ఒక్కో పడకకు ఏడాదికి రూ.50 లక్షల నుండి ఒక కోటి రూపాయల వరకు బిల్లు వసూలు చేస్తేనే, అధునాతన మూడో దశ వైద్య సేవల ప్రయివేటు ఆస్పత్రి మనుగడ సాగించగలుగుతుంది. అయితే, ప్రభుత్వ రంగంలోని బోధనాస్పత్రుల్లో ఏడాదికి ఒక్కో పడకపై మొత్తం వ్యయం సాధారణంగా ఎనిమిది నుండి పది లక్షల రూపాయలు. ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో కేటాయించిన సామర్థ్యాన్ని మించి తరచూ 30-50% 'అదనపు' పడకలు ఉంటున్నాయి. ఈ 'పడకలు' పెరుగుతున్న డిమాండ్‌ను పూరించేందుకు సృష్టించినవి. వ్యయ అంచనాల్ని ఆస్పత్రుల్లో వాస్తవ వినియోగంలో ఉన్న పడకల ఆధారంగా చేస్తే, చాలా సందర్భాల్లో వ్యయం ఒక్కో పడకకి సంవత్సరానికి ఆరు నుండి ఎనిమిది లక్షల మధ్య తేలుతుంది. ఈ స్వల్ప మొత్తంలోనే ఆస్పత్రికి సంబంధించిన - జీతాలు, మౌలిక సదుపాయాల నిర్వహణ, పారిశుద్ధ్యం, ఔట్-పేషెంట్ సేవలు, డయాగ్నొస్టిక్‌లు, చికిత్స, శస్త్రచికిత్స, మందులు, ఆహారం వగైరా అన్ని ఖర్చులూ. దీంతోపాటు, ఈ ఖర్చులోనే అవసరాన్ని బట్టి తరచూ అప్పటికప్పుడు ఏర్పాటు చేసే అదనపు పడకలు, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల నడపటం కూడా ఉంటాయి. ఈ ఆస్పత్రుల్లో అందించే సేవలను, ప్రయివేటు రంగం ధరలతో పోలిస్తే వాటికి ఒక మోస్తరు నుండి తక్కువ మొత్తాల్ని వసూలు చేయటాల్ని ఉజ్జాయింపుగా గణించి చూస్తే.. ప్రభుత్వం చేసే ప్రతి రూపాయి ఖర్చుకీ ఈ ప్రభుత్వ ఆస్పత్రులు నాలుగు రూపాయల విలువైన సేవలను అందిస్తున్నాయని తెలుస్తుంది.

ప్రభుత్వ తృతీయ స్థాయి వైద్య సంస్థల్లో వ్యయానికి తగ్గ ఫలితం మన ఆరోగ్య వ్యవస్థలో కొట్టొచ్చినట్లు కనిపించే అంశాల్లో ఒకటి. విపరీతమైన రద్దీ, అవి లేవు ఇవి లేవు, పారిశుధ్యం అధ్వాన్నం వంటి సహేతుక కారణాలతోనే ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రులను తరచూ విమర్శిస్తుంటారు. అయితే తగిన నిధులు, సిబ్బంది, అవసరమైన పరికరాలు లేకపోవటం, ఆస్పత్రి నిర్వహణలో తగినంత స్వతంత్ర ప్రతిపత్తి లేకపోవటాలను పరిగణలోకి తీసుకుని బేరీజు వేస్తే.. వాటికి కేటాయించిన అరకొర నిధులకు ఆశించదగిన దాని కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఫలితాలు కనిపిస్తాయి. ప్రభుత్వ సదుపాయంతో పోలిస్తే ప్రయివేటు ఆస్పత్రిలో ఒక్కో ఆస్పత్రి కేసుకు సగటున అయ్యే ఖర్చు ఆరు నుండి ఏడు రెట్లు ఎక్కువని పట్టిక 6.3ను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. కాబట్టి, ఖర్చులను నియంత్రించలేని ప్రయివేటు తృతీయ ఆస్పత్రులకు రోగులపై నిధులివ్వటం కంటే.. నాణ్యమైన సేవలు, ఫలితాలకు తగిన చర్యలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత తృతీయ స్థాయి వైద్యాన్ని అందించటం ప్రభుత్వానికి ఆర్థికంగా ఎంతో లాభదాయకం. ఖర్చును తగ్గిస్తూ, వైద్య సూత్రాలు, వనరుల సమష్టి వినియోగాన్ని సహేతుకంగా అమలు చేయటం ప్రభుత్వ రంగంలోనే సాధ్యం. ఒక్కో పడకపై ఇంకొంత వ్యయం, సేవల్ని, జవాబుదారీతనాన్ని మెరుగ్గా బేరీజు వేయటం, మౌలిక వసతుల నిర్మాణానికి వినూత్న రీతి ప్రయివేటు భాగస్వామ్యం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రాక్టీస్‌కి ప్రతిభ గల వైద్య నిపుణులకు ప్రోత్సాహకాల అమలుతో ప్రభుత్వ తృతీయ సేవలను గణనీయంగా మెరుగుపరచటం ఒక మోస్తరు ఖర్చుతోనే అద్భుతంగా సాధ్యం.

(ఇంకా ఉంది...)




## ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు @

# youtube.com/JP Loksatta

స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25 కలిసి వచ్చిన అపురూప సందర్భంలో భవిష్యత్ భారత కార్యాచరణపై ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో..

1) **సామాజిక, రాజకీయ విశ్లేషకురాలు, యువ జర్నో స్వాతి ఇంటర్వ్యూ :**
ఎన్నికల్లో ముక్కుమూసుకుని ఓట్లు వేయటం, ఎవర్ని గెలిపించినా ఏమున్నది గర్వకారణం అని నిట్టూర్చటం, మార్పు కోసం ఏదైనా చేయగల సత్తా ఉన్న యువత రోజువారీ జీవితంలోనే అలసిపోతుండటం.. ఏమిటి చేయటం?.. ఇంకా పలు ప్రశ్నలు.

2) **లైఫ్‌లో ఇంతవరకూ ఎవరినీ ఇంటర్వ్యూ చేయని సామాజిక, పాలనా అంశాల ఉద్యమకారులు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి ఎక్స్‌క్లూజివ్ :**
రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండి.. అన్న వారిని అధికారంలోకి తేవటం తప్ప లోక్‌పాల్ ఉద్యమం సాధించింది ఏమిటి? దేశంలో అవినీతి ఎందుకు అంతం కావటం లేదు?.. & మోర్.

3) **సామాజిక, రాజకీయ ఉద్యమకారులు, మీడియా విశ్లేషకులు కటారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ:**
మోదీ, కేసీఆర్, జగన్‌ల బాకాలే తప్ప ఉద్యమకారులు, పౌర సమాజం గొంతు ఈవేళ బలంగా ఎందుకు వినిపించటం లేదు? ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలు.. సంక్షేమం అంటే ఏమిటి?.. ఇంకా అనేక అంశాలు (రెండు భాగాలు).

4) **విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర ఎక్స్‌క్లూజివ్:**
ట్యాక్స్ ఎగ్గొడితే అది నల్లడబ్బు. మరి సరిగా సేవలు అందించని ప్రభుత్వాలకు పన్ను సరిగా కట్టనక్కర్లేదనుకునే పౌరులు కూడా బ్లాక్‌మనీగాళ్లే అవుతారా? ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఎలా ఉండాలి?.. & మోర్ (రెండు భాగాలు).

5) **పబ్లిక్ పాలసీ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ (ఇందులో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు):**
మోదీ ఈడీని ప్రయోగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు గానీ.. ఒక్క పార్టీ కూడా చట్టబద్ధపాలనని సంస్కరించాలని ఎందుకు డిమాండ్ చేయటం లేదు? డ్రగ్స్‌ని నిషేధించినా ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?.. ఇంకా పలు ప్రశ్నలు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th December, 2022 Posting Date 15 &16th of every month



# అందరికీ ఆరోగ్యాన్ని రాజకీయ ఎజెండాగా మార్చాలి



కొవిడ్ మహమ్మారి భారతీయ సమాజం ఆరోగ్య రంగంపై దృష్టి సారించేలా చేసింది. ప్రాథమిక స్థాయి నుంచి సుస్థిర ఆరోగ్య రంగ సంస్కరణలు వేగంగా అవసరమని ప్రజలు గుర్తిస్తున్నారు. అంటు, జీవనశైలి వ్యాధులపరంగా ఇప్పటికే ఉన్న మితిమీరిన భారం, పేదల్ని పిండేస్తున్న జేబు ఖర్చు, కేవలం అనారోగ్యం కారణంగా ఏటా కోట్ల మంది ప్రజానీకం పేదలుగా మారటం.. ఇవన్నీ తక్షణం మనం ఆరోగ్య రంగంపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు, చౌకగా అందించేందుకు.. మనదేశానికున్న ప్రపంచస్థాయి బలాల్ని వినియోగిస్తూ, మనకున్న ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటూ రూపొందించిన ఒక సృజనాత్మకమైన సేవల నమూనా మనకు అవసరం. అన్నిటికంటే ముఖ్యంగా, ఈ సంస్కరణల్ని అమలు చేసేందుకు, 'అందరికీ ఆరోగ్యం' దార్శనికతను సాకారం చేసేందుకు రాజకీయ సంకల్పం అవసరం. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌డీఆర్/ లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చటమే ఇప్పుడు మన ముందున్న లక్ష్యం.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020